PRAJAPAKSHAM

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

2024, మార్చి 21 గురువారం

హైదరాబాద్ | సంపుటి 26, సంచిక: 273, పేజీలు: 8
ఖమ్మం : 8+8, కరీంనగర్ : 8+8
మహబూబ్‌నగర్: 8, వెల రూ. 5.00

Published from: **Hyderabad**
**Khammam, Karimnagar, Mahabubnagar**

తాతలనాటి కథలు
రూ॥70/-
పేజీలు:64




నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

# ఉచితాలపై విచారణ

## అంగీకరించిన సుప్రీంకోర్టు

## నేడు విచారించనున్న అత్యున్నత న్యాయస్థానం






**న్యూఢిల్లీ:** సార్వత్రిక ఎన్నికలు ఏప్రిల్ 19 నుంచి ప్రారంభం కానున్న సమయంలో, వివిధ రాజకీయ పార్టీలు ఉచితాలను వాగ్దానం చేసే పద్ధతికి వ్యతిరేకంగా దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం (పిల్)ను గురువారం విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ప్రజలను ప్రలోభపెట్టే రీతిలో ఉచితాలను ప్రకటించే రాజకీయ పార్టీల ఎన్నికల చిహ్నాలను స్తంభింపచేసి, వాటి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసే అధికారాన్ని భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ)కి ఇస్తూ ఆదేశం జారీ చేయాలని కోరుతూ సుప్రీం కోర్టులో పిల్ దాఖలైంది. కాగా, ఈ పిల్ చాలా ముఖ్యమైనదని, కాబట్టి గురువారం విచారణ జాబితాలో చేరుస్తామని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలో, జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం బుధవారం ప్రకటించింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈ పిటిషన్‌ను విచారించాల్సిన అవసరం ఉందని న్యాయవాది, పిఐఎల్ పిటిషనర్ అశ్విని ఉపాధ్యాయ్ తరఫు సీనియర్ న్యాయవాది విజయ్ హన్సారియా చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఓటర్ల నుండి అనవసర రాజకీయ ఆదరణ పొందేందుకు ప్రజాకర్షక చర్యలను చేపట్టం ద్వారి రాజ్యాంగాన్ని కొన్ని పార్టీలు ఉల్లంఘిస్తున్నాయని పిటిషనర్ పేర్కొన్నారు. కాబట్టి, ఇలాంటి ఉచితాల ప్రకటనలపై పూర్తి నిషేధం విధించాలని కోరారు. ఇసిఐ స్పందించి, ఉచితాల వంటి ప్రలోభాలను నిరోధక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో, అహేతుకమైన ఉచితాలను పార్టీలు వాగ్దానం చేస్తున్నాయని, వాటికి ఓటర్లను ప్రభావితం అవుతున్నారని పిటిషనర్ అభిప్రాయపడ్డారు. ఈ తరహా ప్రచారం ఎన్నికల ప్రక్రియ స్వచ్ఛతను దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేవారు. ఎన్నికలను దృష్టిలో

తరువాయి 2లో




## సార్వత్రిక ఎన్నికల సమరం షురూ

### తొలి దశ నోటిఫికేషన్ విడుదల

**న్యూఢిల్లీ :** దేశంలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. తొలి విడతలో భాగంగా 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 102 నియోజకవర్గాలకు నోటిఫికేషన్ వెలువడింది. ఫలితంగా నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఈ నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ ఈనెల 27 కాగా, 28న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. మార్చి 30న వరకు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు. ఏప్రిల్ 19న 102 నియోజకవర్గాల్లో తొలి విడత పోలింగ్ జరగనుంది. తమిళనాడులో 39, రాజస్థాన్‌లో 12, ఉత్తర్‌ప్రదేశ్‌లో 8, మధ్యప్రదేశ్‌లో 6, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, అసోంలో ఐదేసి స్థానాలకు తొలి విడత పోలింగ్ జరగనుంది. బీహార్‌లో 4, పశ్చిమ బెంగాల్‌లో 3, అరుణాచల్ ప్రదేశ్, మణిపుర్, మేఘాలయాల్లో రెండేసి చొప్పున, ఛత్తీస్‌గఢ్, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, అండమాన్ నికోబార్,

తరువాయి 2లో



తెలంగాణ ఇన్‌చార్జ్ గవర్నర్‌గా

## సిపి రాధాకృష్ణన్ బాధ్యతల స్వీకరణ

### రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయించిన హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాదె

### హాజరైన సిఎం రేవంత్‌రెడ్డి, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

ప్రజాపక్షం / హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా సిపి రాధాకృష్ణన్ ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో బుధవారం రాధాకృష్ణన్‌తో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే ప్రమాణం చేయించారు. ప్రస్తుతం ఝార్ఖండ్ గవర్నర్‌గా ఉన్న రాధాకృష్ణన్, అదనంగా తెలంగాణ రాష్ట్ర బాధ్యతలు స్వీకరించారు. తకు ముందు వరకు గవర్నర్‌గా ఉన్న తమిళిసై రాజీనామా నేపథ్యంలో రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ఆయనను నియమించిన విషయం తెలిసిందే. ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. 1957 మే 4న జన్మించిన సిపి రాధాకృష్ణన్ తమిళనాడులోని కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి రెండు సార్లు బిజెపి తరుపున ఎంపిగా ఎన్నికయ్యారు. తమిళనాడు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగానూ పనిచేశారు. 2016 నుంచి 2019 వరకు ఆల్ ఇండియా కాయర్ బోర్డ్ చైర్మెన్‌గా సేవలందించారు. తమిళనాడు బిజెపి సీనియర్ నాయకుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. రాధాకృష్ణన్ 2023 ఫిబ్రవరి 18 నుంచి

తరువాయి 2లో

పర్భాని నుంచి సిపిఐ అభ్యర్థిగా

## రాజన్ రామచంద్ర

**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మహారాష్ట్రలోని పర్భాని నియోజకవర్గం నుంచి అభ్యర్థిని ప్రకటించింది. ఈ స్థానం నుంచి రాజన్ రామచంద్ర క్షిరసాగర్ పోటీ చేస్తారని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే తమిళనాడులోని తిరుప్పూర్ నియోజకవర్గం నుంచి కె. సుబ్బరాయన్, నాగపట్టినం నియోజకవర్గం నుంచి వి. సెల్వరాజు పేర్లను ప్రకటించిన విషయం తెలిసిందే.

## వైద్య ఆరోగ్య శాఖలో 5348 పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

ప్రజాపక్షం/హైదరాబాద్




వైద్య ఆరోగ్య శాఖలో 5348 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రజారోగ్యం, ఆయుష్ , డిసిఎ, ఐపిఎం, డిఎంఇ, వైద్య విధాన పరిషత్, ఎంఎన్‌జె క్యాన్సర్ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ నెల 16న ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. వైద్య ఆరోగ్య సర్వీసుల నియామక బోర్డు

తరువాయి 2లో

## రైతులను ఆదుకునేందుకు సిద్ధం



ప్రజాపక్షం/హైదరాబాద్

అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. పంటల నష్టాన్ని అంచనా వేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించినట్లు తెలిపారు. పదేళ్ల పాటు అస్తవ్యస్త విధానాలు, పరిపాలనతో రైతులను అగమ్యగోచరంగా చేశారని, ఇప్పుడు రైతుల కోసమే పనిచేస్తున్న తమ ప్రభుత్వంపై కొందరు అనవసర విమర్శలు చేయడం తగదని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతల పట్ల

తరువాయి 2లో






## మోడీ ముఖంలో ఆందోళన

అయినా... 'అబ్‌కి బార్ 400 పార్' అంటూ గొప్పలు

బిజెపికి 270 సీట్లు రావడం కూడా కష్టమే

సిపిఐ జాతీయ కార్యదర్శి , మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా

ప్రజాపక్షం/హైదరాబాద్

'అబ్‌కి బార్ 400 పార్' అని బిజెపి గొప్పగా ప్రచారం చేసుకుంటున్నప్పటికీ, ప్రధాని మోడీ ముఖంలో మాత్రం ఆందోళన కనిపిస్తోందని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి 270 సీట్లు రావడం కూడా కష్టమేనని వ్యాఖ్యానించారు. ఒక వైపు "ఇండియా " కూటమి బలపడుతోందని, మరోవైపు బిజెపికి రాష్ట్రాల వారీగా ఉన్న సిట్టింగ్ స్థానాలే కోల్పోయే పరిస్థితులు కనిపిస్తుంటే, 400లకు పైగా ఎంపి స్థానాలు ఎలా వస్తాయని ప్రశ్నించారు. బిజెపి మరోసారి అధికారంలోనికి వస్తే రాజ్యాంగాన్ని, పౌరహక్కులను రద్దు చేస్తుందని, ఫాసిజాన్ని అమలు చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని మగ్దూంభవన్‌లో రెండు రోజుల పాటు జరిగే సిపిఐ రాష్ట్ర సమితి సమావేశం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోదా శ్రీరాములు అధ్యక్షతన బుధవారం ప్రారంభమైంది. తొలుత సమావేశంలో జాతీయ రాజకీయ పరిణామాలను రాష్ట్ర సమితికి అజీజ్ పాషా

తరువాయి 2లో

ప్రజలకు ప్రభుత్వానికి పత్రికలు

## వారధిగా పనిచేయాలి

### క్యాపిటల్ ఇన్ఫర్మేషన్ కార్యాలయాన్ని ప్రారంభించిన మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి



ప్రజాపక్షం / రంగారెడ్డి ప్రతినిధి

ప్రజలకు ప్రభుత్వానికి పత్రికలు వారిధిగా పనిచేయాలని, అలాగే పత్రికా విలువలను కాపాడడం కోసం మీడియా పనిచేస్తుందని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని రాగన్న గూడలో నూతనంగా ఏర్పాటు చేసిన 'క్యాపిటల్ ఇన్ఫర్మేషన్' పత్రిక కార్యాలయాన్ని స్థానిక శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, దేవరకొండ ఎంఎల్‌ఎ బాలు నాయక్ లతో కలిసి తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హాయంలో పత్రికలకు కానీ, పత్రికా యాజమాన్యానికి గాని ఎలాంటి విలువ లేకుండా పోయాయన్నారు. గతంలో పనిచేసిన ముఖ్యమంత్రి కెసిఆర్ మీడియా సమావేశంలో జర్నలిస్టులు అడిగే ప్రశ్నలకు జవాబు చెప్పేవారుకాదని, తాను చెప్పిందే వినాలనే విధంగా నియంతలాగా జర్నలిస్ట్‌లకు సూచించేవారని, ప్రతి విషయంలోనూ తాను చెప్పింది వేదంలా మాట్లాడేవారని, అందుకే గతంలో జరిగిన ఎల్‌ఎల్‌ఎ ఎన్నికల్లో ప్రజలు, మేధావులు అందరు

తరువాయి 2లో



## పశుపతి పరాస్ రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం

### కిరణ్ రిజిజుకు అదనపు బాధ్యతలు

**న్యూఢిల్లీ :** బీహార్‌లో సీట్ల పంపకాల్లో తమ పార్టీకి బిజెపి అన్యాయం చేసిందని ఆరోపిస్తూ కేంద్ర మంత్రి పదవికి రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ అధ్యక్షుడు పశుపతి కుమార్ పరాస్ చేసిన రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపతిముర్మ ఆమోదించారు. ఈ మేరకు రాష్ట్రపతి కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుకు పరాస్ నిర్వహించిన మంత్రిత్వ శాఖ అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బీహార్‌లో పొత్తులో భాగంగా చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని ఎల్‌జెపి (రాంవిలాస్) పార్టీకి ఎన్‌డిఎకు ఐదు సీట్లు కేటాయించింది. దీనిపై పశుపతి పరాస్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన్ను బీహార్‌లోని ప్రతిపక్ష కూటమికి ఆర్‌జెడి ఆహ్వానించింది. 'ఒకవేళ పశుపతి పరాస్ బీహార్ ప్రతిపక్ష కూటమిలోకి రావాలనుకుంటే.. మేము స్వాగతం చెప్పడానికి

తరువాయి 2లో



## సిఎఎను రద్దు చేస్తాం

### నీట్ పరీక్షను నిషేధిస్తాం

### డిఎంకె మేనిఫెస్టో విడుదల

**చెన్నై :** తమిళనాడులో అధికార డిఎంకె పార్టీ లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోను బుధవారం విడుదల చేసింది. మేనిఫెస్టోతో పాటు లోకసభ అభ్యర్థుల పేర్లను కూడా ప్రకటించింది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్ష కూటమి అధికారంలోకి వస్తే పౌరసత్వ సవరణ చట్టం 2019ని రద్దు చేస్తామని హామీనిచ్చింది. జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని, కొత్త విద్యావిధానం 2020ను బుట్టదాఖలు చేస్తామని, పెట్రో ధరలు తగ్గిస్తామని వాగ్దానం చేసింది. దేశంలో ప్రతి మహిళలకు నెలకు రూ.1000 ఇస్తామని మేనిఫెస్టోలో డిఎంకె పేర్కొంది. అదే విధంగా గవర్నర్ల నియామకానికి సంబంధించి రాష్ట్రాలను సంప్రదించి చర్చలు జరుపుతామని చెప్పింది. గవర్నర్లకు చట్టపరమైన మినహాయింపులు ఇచ్చే ఆర్టికల్ 361ను రద్దు చేస్తామని

తరువాయి 2లో

## పదేళ్లుగా ప్రజాస్వామ్య మూలస్తంభాలపై దాడి

### కేంద్రంలోని ఎన్‌డిఎ సర్కారుపై సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శ



**న్యూఢిల్లీ:** గత పదేళ్లుగా ప్రజాస్వామ్య మూలస్తంభాలపై దాడి జరుగుతున్నదని కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంపై సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శలు గుప్పించారు. మత ప్రాతిపాదికన ప్రజలను ప్రభావితం చేయడానికి బిజెపి ప్రయత్నిస్తోందన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), సిబిఐ వంటి ఏజెన్సీలను దుర్వినియోగం చేస్తున్నదని బుధవారం పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. కాబట్టి దేశ లౌకిక ప్రజాస్వామిక స్వభావాన్ని కొనసాగించాలా వద్దా అనేది నిర్ణయించడంలో రాబోయే లోక్ సభ ఎన్నికలు కీలకం కానున్నాయని అన్నారు. ఒక రకంగా ఇవి దేశానికి అస్తిత్వ ఎన్నికలని ఏచూరి వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యానికి లౌకిక వాదం ఒక మూలస్తంభమని, ఆర్థిక సార్వభౌమత్వం, సామాజిక న్యాయం, సమాఖ్య వాదం ఇతర మూలస్తంభమని అన్నారు. రాజ్యాంగాన్ని,

తరువాయి 8లో

## రైతుల దరిచేరని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ పథకం

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం



వ్యవసాయ మార్కెటింగ్ శాఖ పథకం (రైతుబంధు) రైతుల దరిచేరడం లేదు. దీంతో ప్రభుత్వం నుండి అందే రైతుబంధు అందని పరిస్థితి ఏర్పడింది. రైతులు పండించిన పంటలకు మార్కెట్లో గిట్టుబాటు ధర లభించనప్పుడు వ్యవసాయ మార్కెంటింగ్ గోదాముల్లో ఆ పంటను నిల్వ చేసుకునేందుకు వీలుంటుంది. గోదాముల్లో ఉంచిన పంటపై సదరు రైతు రుణం పొందే అవకాశం ఉంది. ఈ పథకాన్ని సుమారు 20 ఏళ్ల క్రితమే ప్రభుత్వాలు అందుబాటులోనికి తెచ్చినప్పటికీ రైతులకు అవగాహన లేకపోవడంతో ఆచరణకు నోచుకోవవడం లేదు. వ్యవసాయ శాఖ మార్కెటింగ్ అధికారులు ఆ దిశగా అవగాహన కల్పిండంలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నట్లు తెలుస్తోంది.

**గోదాముల్లో నిల్వ చేసుకుంటే రూ. 2 లక్షలు**

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర అందని పక్షంలో రైతులు వ్యవసాయ మార్కెట్ గోదాముల్లో, కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకుని రశీదును మార్కెటి కమిటీలలో అందించాలి. సదరు రైతు నిల్వ చేసిన పంట మొత్తం మీద 75 శాతం రుణాన్ని అందిస్తారు. ఎంత పంటను నిల్వ చేసుకున్నప్పటికీ

తరువాయి 2లో

## మద్దతు అంశంపైన కొంత సమయం వేచి చూడాలి




ప్రజాపక్షం/హైదరాబాద్: సిపిఐ(ఎం) భువనగిరి లోక్‌సభ అభ్యర్థిగా ఎం.డి జహంగీర్‌ను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య ప్రకటించారు. మిగతా 16 స్థానాల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలనే అంశంపైన కొంత సమయం పాటు వేచి చూడాలని పార్టీ నిర్ణయించినట్టు తెలిపారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశ వివరాలను సిపిఐ (ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి,టి.జ్యోతితో కలిసి ఎస్.వీరయ్య హైదరాబాద్‌లోని ఎం.బి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు, రేవంత్ రెడ్డి వంద రోజుల పరిణామాలు, లోక్‌సభ ఎన్నికలు , పార్టీ వైఖరి తదితర అంశాలపై చర్చించామన్నారు. ఆరు గ్యారంటీలలో కొన్ని అమలు చేశారని, మిగిలిన హామీలను కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎం) కలిసి పనిచేస్తే బిజెపి ఓడిపోతుందన్నారు. కులాల ప్రతిపదికన కార్పొరేషన్లు ఏర్పాటు చేయాల్సింది కాదన్నారు. కనీస వేతనాల జిఒను సవరించాలని, విద్యార్థుల ఫీజు రియింబర్స్‌మెంట్ , స్కాలర్‌షిప్‌లు, ఒయు మెస్ బిల్లుల బకాయిలను విడుదల చేయాలని కోరారు. తమ సమస్యల పరిష్కారానికి ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు.

## రైతులను ఆదుకునేందుకు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి చిత్తశుద్ధితో ఉందన్నారు. పదేళ్ల కాలంలో ఏనాడూ రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వని వారు కూడా ఇప్పుడు విడ్డూరంగా మాట్లాడుతున్నారని, కేవలం ఎన్నికలకు ముందు రూ. 150 కోట్లు మాత్రమే పరిహారంగా ఇచ్చారని, రెండోమారు జిఒ మాత్రమే ఇచ్చి, చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. మూడో సారి కనీసం పంట నష్టాన్ని కూడా అంచనా వేయలేదన్నారు. గత ప్రభుత్వం విడుదల చేసిన మొదటి విడత రుణమాఫీ వడ్డీలకు కూడా సరిపోలేదని, రెండో విడత రుణమాఫీకి ఔటర్‌రింగ్ రోడ్డును కుదవ పెట్టి రూ.7 వేల కోట్లు మాత్రమే ఇచ్చి, మరో రూ. 13 వేల కోట్ల బకాయిలు పెట్టారని దుయ్యబట్టారు. నాగార్జునసాగర్ కింద మొదటి పంటకే నీరు ఇవ్వని నేతలు, ప్రస్తుతం రెండో పంటకు నీరు ఇవ్వలేదని తమను విమర్శించడం విడ్డూరమని మండిపడ్డారు.

### వర్షాలు.. అధికారులు అప్రమత్తం

వచ్చే రెండు మూడు రోజులూ వర్ష వాతావరణ పరిస్థితి ఉండే అవకాశాలు ఉన్నాయని, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి, వారికి తగిన సూచనలివ్వాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. మార్కెట్‌కు తీసుకొచ్చిన ధాన్యం, మిర్చి, ఇతర పంటలు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

## ఉచితాలపై విచారణ

(మొదటి పేజీ తరువాయి)

ఉంచుకుని ఉచితాలను అందజేస్తూ, ఓటర్లను ప్రభావితం చేసే రాజకీయ పార్టీల ధోరణి ప్రజాస్వామ్య విలువల మనుగడకే పెను ముప్పుగా పరిణమించిందని ఆ పిల్‌లో వ్యాఖ్యానించారు. అంతేగాక, ఈ విధానం రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తోందని వాదించారు. 'ఇది ఒక అనైతిక ఆచారం. అధికారంలో కొనసాగడానికి కొన్ని పార్టీలు ఖజానా ఖర్చుతో ఓటర్లకు లంచాలు ఇవ్వడం లాంటిదే. ప్రజాస్వామ్య సూత్రాలు, రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించడానికి ఈ ఉచితాల హామీలను నివారించాలి' అని పేర్కొన్నారు. అదే విధంగా, జాతీయ పార్టీగా గుర్తింపు, చిహ్నాల కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు, రిజర్వేషన్, అలాట్‌మెట్ ఆర్డర్ 1968లోని సంబంధిత నిబంధనలను ఇసిఐ పరిశీలించేలా ఆదేశాలు జారీ చేయాలని కూడా పిటిషనర్ కోరారు. ఎన్నికల ముందు అహేతుకమైన ఉచితాలను ప్రస్తావించకూడదని, వాగ్దానాలు చేయకూడదని ఆ నిబంధనల్లో ఉందని గుర్తుచేశారు. ఎన్నికలకు ముందు ప్రభుత్వ నిధుల నుండి ఉచితాలను ప్రకటించడం లేదా వాగ్దానాలు చేయడం లేదా పంపిణీ చేయడం వంటి చర్యలను రాజ్యాంగంలోని ఆర్టికల్ 14తో సహా, ఇతరత్రా అనేక అధికరణలను ఉల్లంఘించినట్లు ప్రకటించాలని పిటిషనర్ సుప్రీం కోర్టును కోరారు. ఎనిమిది జాతీయ రాజకీయ పార్టీలతోపాటు, 56 ప్రాంతీయ పార్టీలు ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందాయి. దేశంలో నమోదైన గుర్తింపు లేని రాజకీయ పార్టీల సంఖ్య దాదాపు 2,800 వరకూ ఉంటుందని అంచనా. 18వ లోక్‌సభకు ఏడు దశల్లో ఎన్నికలు ఏప్రిల్ 19న ప్రారంభమై జూన్ 1న ముగుస్తాయన్నది తెలిసిందే. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో తొలి దశలో పోలింగ్ జరగనున్న 102 పార్లమెంట్ నియోజకవర్గాలకు నామినేషన్ ప్రక్రియ బుధవారం నోటిఫికేషన్ జారీతో ప్రారంభమైంది.

## బాధ్యతల స్వీకరణ

(మొదటి పేజీ తరువాయి)



జార్ఖండ్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తెలంగాణతో పాటు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. రెండు చోట్లా పూర్తిస్థాయి గవర్నర్లను నియమించేంత వరకూ సిపి రాధాకృష్ణన్ బాధ్యతలు నిర్వర్తిస్తారని రాష్ట్రపతి కార్యాలయం మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఇప్పటి వరకు తెలంగాణ గవర్నర్లుగా పనిచేసిన ఈఎస్ఎల్ నరసింహన్, తమిళిసై సౌందరరాజన్‌తో పాటు ప్రస్తుతం బాధ్యతలు చేపట్టిన సిపి రాధాకృష్ణన్ ముగ్గురూ తమిళనాడు వారే కావడం గమనార్హం.

## భర్తీకి గ్రీన్‌సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా ఈ పోస్టులను నేరుగా భర్తీ చేపట్టాలని సూచించింది. స్థానికత ఆధారంగా ఉన్న ఖాళీలు, రోస్టర్ పాయింట్లు, అర్హతకు సంబంధించిన వివరాలను ఆయా విభాగాల అధిపతుల నుండి తీసుకోవాని, ఈ వివరాల ఆధారంగా నోటిఫికేషన్ జారీ చేసి, నేరుగా ఖాళీలను భర్తీ చేయాలని తెలిపింది.

## రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

ఎప్పుడూ సిద్ధమే' అని ఆర్‌జెడి నేత తేజ్‌ప్రతాప్ యాదవ్ అన్నారు. మరోవైపు రాష్ట్రంలో మొత్తం 40 లోక్‌సభ స్థానాలు ఉండగా.. అత్యధికంగా బిజెపి 17 స్థానాల్లో పోటీ చేయనుంది. సిఎం నీతీశ్ కుమార్‌కు చెందిన జెడియు 16 సీట్లలో పోటీ చేసేందుకు అంగీకారం కుదిరింది. మిగిలిన రెండు ఎన్‌డిఎ భాగస్వామి పార్టీలైన హిందుస్థానీ అవామ్ మోర్చా, ఉపేంద్ర కుష్వాహాకు చెందిన రాష్ట్రీయ లోక్ మంచ్ పార్టీ చెరో ఒక్కో స్థానాల్లో పోటీ చేస్తాయని బిజెపి బీహార్ రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛార్జి వినోద్ తాడ్వే వెల్లడించారు.

# ఆర్‌టిసి ఉద్యోగులకు వేతన సవరణ ఎందుకు చేయలేదు?

**ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాబు, ఇ.వెంకన్న**

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులకు 2018 వేతన సవరణ గత ప్రభుత్వం 30 శాతం ఫిట్‌మెంట్ జరిపిందని, అంతకుముందు 2017 ఆర్‌టిసి కార్మికులకు చేయడం విస్మరించిందని ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాబు, ఇ.వెంకన్న అన్నారు. 2018 వేతన సవరణ ప్రభుత్వ ఉద్యోగులకు 30 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చినప్పుడే ఆర్‌టిసి ఉద్యోగులకు వేతన సవరణ ఎందుకు చేయలేదని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వారు విమర్శించారు. మార్చి 2024లో ఆర్‌టిసి ఉద్యోగులకు 21 శాతంతో వేతన సవరణ చేయడం వల్ల ప్రభుత్వ ఉద్యోగుల కంటె 9 శాతం ఫిట్‌మెంట్ నష్టపోయారని బాబు, వెంకన్న ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతన సవరణ చేయకుండా వారికి తగ్గించి హెచ్‌ఐర్‌ఎను ఆర్‌టిసి ఉద్యోగులకు వర్తింపచేయడం తీవ్రమైన అన్యాయంగా భావిస్తున్నామన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులకు 21 శాతం వేతన సవరణ చేయడం వల్ల ప్రభుత్వ ఉద్యోగుల కంటె బేసిక్ పేలలో సుమారు 2000 రూపాయలు తగ్గిందన్నారు. అలాగే హెచ్‌ఎర్‌ఎలో కూడా సుమారు 1500 నుండి 2500 వరకు ఆర్‌టిసి ఉద్యోగులు నష్టపోయారని తెలిపారు. తగ్గించిన వేతన సవరణను చేయడం ఈ ప్రభుత్వం ఘనతేనని విమర్శించారు. ఆర్‌టిసి ఉద్యోగుల కు 2015లో వేతన సవరణతో పాటు ఫ్రింజ్ బెనిఫిట్స్, అలవెన్సెస్ జరిగాయని, దానికి సంబంధించి లేబర్ కమిషనర్ వద్ద 12 (3) అగ్రిమెంట్ జరిగిందన్నారు. ఆ ఒ ప్పందం ప్రకారమే ఉద్యోగుల సర్వీసు కండిషన్స్ ఉన్నాయన్నారు. యాజమాన్యం ఏదైనా సర్వీసు కండిషన్ మార్చాలంటే గతంలో జరిగిన 12 (3) ఒప్పందం ప్రకారం ముందుగా కార్మిక సంఘాలకు నోటీసు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అది జరపకుండా యాజమాన్యం ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం కార్మికవర్గానికి అన్యాయం చేయటమేనని అన్నారు. తగ్గించిన హెస్‌ఆర్‌ఎ ఆర్‌టిసి కార్మికులకు అమలు చేయడాన్ని బాబు, వెంకన్న ఖండించారు. ఒకవేళ యాజమాన్యానికి ఇదే అమలు చేయాలనే ఉద్దేశం ఉంటే ప్రభుత్వోద్యోగులకు చేసిన 30 శాతం ఫిట్‌మెంట్‌ను ఆర్‌టిసి కార్మికులకు కూడా తప్పకుండా అమలు చేయాలని బాబు, వెంకన్న డిమాండ్ చేశారు.

### కార్మిక వర్గానికి అందించాల్సిన సౌకర్యాలను దాటవేసిన యాజమాన్యం

ఆర్‌టిసి చరిత్రలో ట్రేడ్ యూనియన్‌లు లేకుండా వేతన సవరణ చేయటాన్ని బాబు, వెంకన్న తప్పు పట్టారు. కార్మిక వర్గానికి చేయాల్సిన అనేక సర్వీస్ కండిషన్‌లు, అలవెన్స్‌లు, ఫ్రింజ్ బెనిఫిట్స్ ఈ వేతన సవరణలో ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. చేసిన తప్పిదాన్ని కప్పిపుచ్చుకోవటానికి యాజమాన్యం ఓ ప్రకటన రూపంలో ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 30 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగులకు అమలులో ఉన్న కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం స్పెషల్ గ్రేడ్స్ 612182430 సంవత్సరాల మాదిరిగా మాస్టర్ స్కేల్‌లో ఫిక్స్ చేసి ఆర్‌టిసి ఉద్యోగులకు అమలు చేయాలన్నారు. ఇంక్రిమెంట్ కూడా 5 శాతం పెరుగుదల కావాలని బాబు, వెంకన్న డిమాండ్ చేశారు.

ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగుల కంటే 28 శాతం వేతన సవరణ ఆర్‌టిసి ఉద్యోగులకు తక్కువగా ఉందని, 2021 వేతన సవరణ చేస్తున్న సమయంలో ఈ తగ్గిన ఫిట్‌మెంట్‌ను కూడా ఆర్‌టిసి కార్మికులకు ఇచ్చి వేతన సవరణ జరపాలన్నారు. ట్రేడ్ యూనియన్‌ల ఉనికిలో లేవని ప్రభుత్వం, యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం, ఆర్‌టిసి ఉద్యోగులపై వివక్ష చూపించటమే అన్నారు. హెచ్‌ఐర్‌ఎను తగ్గించకుండా పాత పద్ధతినే కొనసాగించాలన్నారు. 30 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ చేయాలన్నారు. లేని పక్షంలో ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తుందని బాబు, వెంకన్న హెచ్చరించారు.

## అసెంబ్లీ ఎన్నికల కంటే రెట్టింపు మెజారిటీతో గెలుస్తాం




ప్రజాపక్షం/హైదరాబాద్ : పార్లమెంట్ ఎన్నికల్లో 17 స్థానాలను గెలవాలని టీమ్ గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పని చేస్తున్నారని టిపిసిసి సీనియర్ ఉపాధ్యాక్షుడు మల్లు రవి అన్నారు. గాంధీ భవన్‌లో బుధవారం ఆయన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యతో కలిసి మాట్లాడారు. ప్రజలు 17 స్థానాలలో అసెంబ్లీ ఎన్నికల కంటే రెట్టింపు మెజారిటీతో గెలిపిస్తారని విశ్వసం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి ఎక్కువ సీట్లు గెలిచి సెక్యూలర్, డెమోక్రసీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. వంద రోజుల్లోనే ఇచ్చిన హామీలను అమలు చేశామన్నారు. ప్రతిపక్ష పార్టీలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు ప్రజలను తప్పు దోవ పట్టించడానికి ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. బిజెపి నాయకులు ఈటల రాజేందర్, బిఆర్‌ఎస్ నేత కెటిఆర్ మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మీద నిలబడుతుందన్నారు. 10 ఏళ్ల నుండి పేరుకుపోయిన సమస్యలు మొత్తం పరిష్కారం దిశగా ప్రభుత్వం ముందుకు పోతుందని తెలిపారు. ధరణి సమస్యలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటుందన్నారు. ముఖ్యమంత్రిపై ఈటల రాజేందర్, కెసిఆర్, కెటిఆర్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రిపై వ్యాఖ్యాలు చేసేటప్పుడు ఆలోచించి మాట్లాడాలన్నారు. దేశ ప్రజలు తెలంగాణ మోడల్ ప్రభుత్వం కావాలని కోరుకుంటున్నారన్నారు.

## సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన కమ్మ సేవాసంఘాల సమైక్య నేతలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : కమ్మ సేవా సంఘాల సమైక్య తెలంగాణ ఆధ్వర్యంలో రాష్ట్రంలో 60 కమ్మ సంఘాల ప్రతినిధులు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, రాజ్యసభ సభ్యులు రేణుక చౌదరి నాయకత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో కలిసి, కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లో ఒక పెద్ద కృతజ్ఞత బహిరంగ సభను నిర్వహిస్తామని సిఎం చెప్పారు. ఈ బహిరంగ సభకు ముఖ్యమంత్రి ముఖ్యఅతిథిగా వస్తానని హామీ ఇచ్చారన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కమ్మ సామాజిక వర్గానికి ఒక ఎంపి సీటు ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో కమ్మ సేవా సంఘాల సమాఖ్య తెలంగాణ ప్రధాన్య కార్యదర్శి గంగవరపు రామకృష్ణ ప్రసాద్, కోశాధికారి కండపనేని రత్నాకర్ రావు, ఉపాధ్యక్షులు బొడ్డు రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



## రిటైర్డు ఉద్యోగులకు ఇహెచ్‌ఎస్ అమలు చేయాలి



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం

ప్రజాపక్షం / హైదరాబాద్: గత ఏడాది ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఎంప్లాయిస్ హెల్త్ స్కీం ట్రస్టు (ఇహెచ్‌ఎస్) ఏర్పాటు చేసి వెంటనే రిటైర్డు ఉద్యోగులకు ఇహెచ్‌ఎస్ అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సంఘం అద్యక్షులు జి.దామెదర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ సి.చంద్రశేఖర్ రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర రాజనరసింహాకు ఒక లేఖ రాశారు. గత ప్రభుత్వము ఎంప్లాయిస్ హెల్త్ స్కీం ట్రస్టు (ఇహెచ్‌ఎస్) ఏర్పాటు గురించి గత ఏడాది 186 జిఓ జారీ చేసినప్పటికీ ఇప్పటికీ ట్రస్టు సిఇ ఒ, ట్రస్టు సభ్యుల నియామకం జరగలేదని, ఇహెచ్‌ఎస్ సదుపాయం అమలుకావడంలేదన్నారు. ఇహెచ్‌ఎస్ ట్రస్టులో సభ్యులుగా ఇతర సంఘాలతో పాటు పెన్షనర్ల సంఘం నుండి ఇద్దరు సభ్యులను ట్రస్టు సభ్యులుగా నియమించనున్నట్లు ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్నటికీ అమలు చేయలేదన్నారు.



## మార్కెటింగ్ శాఖ పథకం

(మొదటి పేజీ తరువాయి)

రైతుబంధు పథకం క్రింద రూ. 2 లక్షలు మాత్రమే రుణాన్ని ఇస్తారు. ఇలా అందించిన రుణాన్ని 180 రోజుల్లో వడ్డీ లేకుండా చెల్లించాలి. రశీదు వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద ఉన్నందున అధికారులు వారి రుణాన్ని తీసుకున్న తర్వాతే సరుకుని విడుదల చేస్తుంటారు.

### జిల్లాలో ఏ ఒక్కరికీ అందని రైతుబంధు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వ్యవసాయ మార్కెట్ రైతుబంధు ఏ ఒక్క రైతు కూడా రెండేళ్లుగా తీసుకోలేదు. ఈ పథకంపై రైతులకు అవగాహన లేకపోవడంతో నీరుగారుతున్నట్లు తెలుస్తోంది. ప్రతీ ఏటా రైతులకు అవగాహన కల్పించాల్సిన అధికారులు పేపర్ ప్రకటనలకే పరిమితమవుతున్నారు తప్ప క్షేత్రస్థాయిల్లో ఆయా వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల ద్వారా అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 6 మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వీటి ప రిధిలో 63 గోదాములు ఉన్నాయి. అత్యధికంగా బూర్గంపాడు మార్కెటి కమిటీ పరిధిలో 12, ఇల్లెందు మార్కెట్ కమిటీ పరిధిలో 11 గోదాములు ఉన్నాయి. వీటి పరిధిలో వేలాది మంది రైతులు ఉన్నప్పటికీ ఏ ఒక్కరు కూడా రుణం తీసుకోకపోవడం గమనార్హం. గిట్టుబాటు ధర లేకున్నప్పటికీ వచ్చిందే చాలులే అనే ఉద్దేశ్యంతో పంటను తెగనమ్ముకునే అమాయక రైతులున్నారు. వీరికి మేలు చేసేందుకు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ రైతుబంధు పథకం ద్వారా కృషి చేయకపోవడం శోచనీయం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను ఆనుకుని ఉన్న ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో ఈ పథకం క్రింద రైతులకు రూ.5.75 లక్షల రైతుబంధు రుణాలను అక్కడి వ్యవసాయ మార్కెటింగ్ పథకం ద్వారా అందజేశారు. పొరుగు జిల్లాల్లో పథకం అమలువుతున్నప్పటికీ ఇక్కడి అందుకు విరుద్ధంగా ఉంది. కేవలం మార్కెటింగ్ శాఖాధికారుల అవగాహన కల్పించడంలో విఫలం అవుతున్నారనే విమర్శలు పెద్ద ఎత్తున వివవస్తున్నాయి.

### పథకంపై ప్రకటన చేస్తున్నాం : మహ్మద్ అబ్దుల్ అలీం

వ్యవసాయ మార్కెటింగ్ పథకంపై ప్రతీ ఏటా మీడియా ముఖంగా ప్రకటిస్తున్నాం.మార్కెట్ కమిటీల వద్ద వాల్ పోస్టర్లు అంటిస్తున్నాం. రెండేళ్లుగా రైతుబంధు కోసం రైతులెవ్వరూ ముందుకు రాలేదు. అంతకంటే ముందు బూర్గంపాడు, ఇల్లెందు మార్కెట్ కమిటీల్లో రైతులు ఈరకం రుణాన్ని తీసుకున్నారు. భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా పండించిన పంటలకు తగిన గిట్టుబాటు ధర లభిస్తున్నందు వల్లే రైతులు గోదాముల్లో పంటలు నిల్వ చేసుకోవడం లేదు. గోదాముల్లో పంటను దాచుకునేందుకు వస్తే వారికి రుణాన్ని ఇచ్చేంది సిద్ధంగా ఉన్నాం.

## మోడీ ముఖంలో ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

నివేదించగా, రాష్ట్ర రాజకీయ పరిణామాలను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వివరించారు. సమావేశంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి హాజరయ్యారు. అజీజ్‌పాషా ప్రారంభోపన్యాసం చేస్తూ గత లోక్‌సభ ఎన్నికల్లో గుజరాత్ రాష్ట్రంలోని మొత్తం 26 స్థానాలను బిజెపి గెలుచుకున్నదని, ఇక్కడ ఎంపి స్థానాలు పెరిగే అవకాశాలే లేవని, పైగా 'ఇండియా కూటమి' బలపడిందని, తద్వారా బిజెపి సిట్టింగ్ స్థానాలు కోల్పోయే పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. రాజస్థాన్‌లో నాలుగైదు స్థానాలు, బీహార్‌లో పది స్థానాలు ఇలా అనేక రాష్ట్రాల్లో బిజెపికి చెందిన సిట్టింగ్ స్థానాలు పోతున్నాయని, ఇటువంటి సమయంలో బిజెపికి 400లకు పైగా ఎంపి స్థానాలు ఎలా సాధ్యమని అజీజ్‌పాషా ప్రశ్నించారు. పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ(ను అమలు చేస్తున్న బిజెపి ప్రభుత్వం, ఆ తర్వాత నేషనల్ రిజిస్టర్ ఫర్ పాపులేషన్ (ఎన్ఆర్‌పి)ని తీసుకొచ్చి దేశంలోని ముస్లింల పౌరసత్వాన్ని తొలగించే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు.రైతుల తమ న్యాయమైన డిమాండ్ల కోసం పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారని, తమ డిమాండ్ల సాధనకు ఎంతదూరమైనా వెళ్లేందుకు సిద్ధపడ్డారని, లక్షలాది మందితో రైతులు చేసిన ఉద్యమానికి అజీజ్ పాషా కొనియాడారు. దేశ వ్యాప్తంగా 14 రాష్ట్రాలలో డబ్ల్యుటిఒ ఒప్పందాలను అమలు చేస్తున్నారని విమర్శించారు. రైతులకు కనీస మద్దతు ధరను కూడా అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. 52 శాతం రైతులు అప్పుల పాలయ్యారని, ప్రతి రోజూ 27 మంది మంది రైతులు ఆత్మహత్యచేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ రైతు ఉద్యమానికి మద్దతుగా ఉద్యమాలు, పో రాటాలు జరిగినా అక్కడ సిపిఐ అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా సిపిఐ 25 నుండి 30 స్థానాల్లో పోటీ చేస్తుందని, దీనికి సంబంధించి ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్‌తో సంప్రదింపులు జరుగుతున్నాయని, ఇప్పటికే కొన్ని రాష్ట్రాలలో సీట్ల సర్దుబాటుపైన స్పష్టత వచ్చిందని వివరించారు.తెలంగాణ రాష్ట్రంలో పెద్దపల్లి, నల్లగొండ, భువనగిరి, ఖమ్మం, వరంగల్ లోక్‌సభ స్థానాల్లో ఒక స్థానంలో సీట్ల సర్దుబాటు ఉండాలని, ఈ విషయమై ఇది వరకే తాము ప్రతిపాదించామని అజీజ్ పాషా తెలిపారు. సమావేశం ప్రారంభంలో ఇటీవల మరణించిన మాజీ మంత్రి పి.నర్సారెడ్డి, సిట్టింగ్ ఎంఎల్‌ఎ లాస్య నందితతో పాటు పలువురికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాలనర్సింహా సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, సమావేశం రెండు నిమిషాలు మౌనం పాటించింది.

## వారధిగా పనిచేయాలి

(మొదటి పేజీ తరువాయి)

కలిసి బిఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఓడించారన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రజలు సమస్యలను ఎలుగెత్తి చూపించేవే పత్రికలని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ముందుకు పోతున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు విశ్వసించారని పేర్కొన్నారు క్యాపిటల్ ఇన్‌ఫర్మేషన్ పత్రిక నేటితరంలో నడపడం చాలా కష్టమని, అయినా ఎన్నో ఒడిదొడుకులను తట్టుకుని మీడియాలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకుని ముందుకు వెళ్తున్న క్యాపిటల్ ఇన్ఫర్మేషన్ ఎడిటర్ శ్రీనివాసరావును మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

### ప్రభుత్వానికి ప్రజలే న్యాయ నిర్ణేతలు

స్థానిక ఎంఎల్‌ఎ మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రసంగిస్తూ గత పది సంవత్సరాలుగా పత్రికా ధర్మాన్ని విస్మరించిన బిఆర్‌ఎస్ పార్టీ ప్రజల పక్షాన పనిచేసే పత్రిక ధర్మాన్ని పాటించకుండా నియంతా పాలనకు ప్రజలు చరమగీతం పాడారని తీవ్రంగా ధ్వజమెత్తారు. ప్రజా క్షేత్రంలో ప్రజలే ముఖ్యపాత్ర వహిస్తారనే మాటకు నిఘంటువుగా తెలంగాణ ఎన్నికలే ముఖ్యపాత్ర పోషించాలని రంగారెడ్డి అన్నారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా ప్రజలే అన్యాయాన్ని ఎదుర్కొనే దిశగా న్యాయానికి పట్టం కట్టారని తెలిపారు. దేశ చరిత్రలో తెలంగాణ రాష్ట్రంలోనే తెలంగాణ నినాదంతో ప్రజలను మభ్యపెట్టి అధికారాన్ని అనుభవించిన బిఆర్‌ఎస్ ప్రభుత్వానికి నాంది పలుకుతూ ప్రజలు, కార్మికులుగా కర్షకులుగా, వ్యవస్థాపక నిర్దేశకులుగా పనిచేస్తూ తెలంగాణలో ప్రజాపక్షం, ప్రజాపాలన సమృద్ధి పరిచే ప్రభుత్వంగా కాంగ్రెస్ పార్టీని ప్రజల ఆశీర్వదించారని మల్ రెడ్డి రంగారెడ్డి వివరించారు. గత ప్రభుత్వంలో ప్రజలకు అనుసంధాన కర్తగా పనిచేసే పత్రికా విలేకరులు గత ప్రభుత్వాల నిరంకుశ, నియంతృత్వ పాలనకు ప్రజలు చరమగీతం పాడారన్నారు.

### కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో పత్రికలకు పూర్తి స్వేచ్ఛ

దేవరకొండ ఎంఎల్‌ఎ బాలు నాయక్, పత్రికా రంగాన్ని ఎప్పటికప్పుడు పెంపొందించే విధానాలను కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తుందని అన్నారు. పత్రికా రంగానికి ప్రజల పక్షాన ఎప్పటికప్పుడు సాక్షిగా నిలబడే పత్రికా ధర్మాన్నికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో పత్రికా స్వేచ్ఛకు విలువ నివ్వకుండా, పత్రికా ధర్మాన్ని తుంగలో తొక్కిన గత ప్రభుత్వ పాలన, ప్రస్తుతం ప్రజల ఆశీర్వదించిన ప్రజాపాలనలో ప్రజల పక్షాన ఎప్పటికప్పుడు నిఘంటువుగా నిలబడే పత్రికా రంగానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. తప్పును తప్పుగా చూపించే పత్రికా రంగానికి ప్రభుత్వపరమైన సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం సామాజిక రంగంలో దేశం అభివృద్ధి చెందిన పత్రికా రంగానికి భంగం కలగకుండా ప్రజలు ఎప్పటికప్పుడు పత్రికారంగాన్ని ఆదరిస్తున్నారని, ప్రజల పక్షాన ఎప్పటికప్పుడు నిలబడుతున్నారని తెలియజేశారు.

### సోషల్ మీడియా విప్లవంతో

సభకు అధ్యక్షత వహించిన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియూడబ్ల్యూజె) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విరాహత్ అలీ మాట్లాడుతూ సోషల్ మీడియా విప్లవంతో జర్నలిజం వృత్తి కత్తి మీద సాముల మారిందన్నారు. ఓవైపు మీడియా సంస్థలను కాపాడుకోవడం, మరోవైపు జర్నలిస్టుల సంక్షేమం కోసం టియుడబ్ల్యుజె అవిశ్రాంతంగా అహర్నిశలు కృషి చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర చిన్న, మధ్యతరగతి పత్రికలు, మెగజైన్స్ అసోసియేషన్ అధ్యక్షులు యూసుఫ్ బాబు, క్యాపిటల్ ఇన్‌ఫర్మేషన్ ప్రచురణకర్త ఎన్.శ్రీనివాస్ రావు , సౌజన్య, బ్యూరో ఇంచార్జ్ శ్రవణ్ కుమార్, కొండమల్లేపల్లి ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి, టిపిసిసి నాయకులు కొత్త కుర్మ శివకుమార్, తుర్క యంజాల్ కార్పొరేటర్ కొత్త కుర్మ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల సమరం షురూ

(మొదటి పేజీ తరువాయి)

జమ్ముకశ్మీర్, లక్షద్వీప్, పుదుచ్చేరిల్లో ఒక్కో స్థానానికి పోలింగ్ జరగనుంది. అయితే నామినేషన్ల పరిశీలన మార్చి 28న ఉండగా, బీహార్‌లో మాత్రం ఈ నెల 30న ఉంటుంది. అభ్యర్థులు ఏప్రిల్ 2 వరకు నామినేషన్లను ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది. ఇక ఈ 18వ లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 19 జరగనుండగా, ఆ తర్వాత ఆరు దశల్లో ఏప్రిల్ 26, మే 7, మే 13, మే 20, మే 25, జూన్ 1న ఎన్నికలు జరుగుతాయి. జూన్ 4న ఓట్లు లెక్కింపు ఉంటుంది. అయితే ఎలక్షన్ కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్‌లో తాజాగా కొన్ని మార్పులు చేసింది. అరుణాచల్‌ప్రదేశ్, సిక్కింలో కౌంటింగ్‌ను జూన్ 4 నుంచి జూన్ 2వ తేదీకి మార్చింది. దేశంలో మొత్తం 96.88 కోట్ల ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 49.7 కోట్ల మంది ఉండగా, మహిళలు 47.1 కోట్ల మంది ఉన్నారు. 85 ఏళ్ల పైబడిన ఓటర్ల సంఖ్య 82 లక్షలు. 2029 ఏళ్ల వయసు మధ్య ఉన్న ఓటర్లు 19.74 కోట్ల మంది ఉన్నారు. ఈసారి 18–19 వయసున్న 1.8 కోట్లు యువ ఓటర్లు కొత్తగా ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఇక ఈ ఎన్నికల కోసం 55 లక్షల ఇవిఎంలు వినియోగిస్తున్నారు. 10.5 లక్షల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ ఎన్నికల్లో 1.5 కోట్ల మంది పోలింగ్ అధికారులు, భద్రతా సిబ్బంది పాలు పంచుకోనున్నారు.

## సిఎఎను రద్దు చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

హామీ ఇచ్చింది. పుదుచ్చేరికి రాష్ట్ర హోదాను తొలగించే అధికారాన్ని కేంద్రానికి కల్పించే ఆర్టికల్ 356 రద్దుపై పోరాడుతామని పేర్కొంది. ఎంఎస్ స్వామినాథన్ కమిటీ సిఫార్సు మేరకు రైతులకు కనీస మద్దతు ధర నిర్ణయిస్తామని మేనిఫెస్టోలో తెలిపింది. నీట్ పరీక్ష, ఉమ్మడి పౌరస్మృతి, పౌరసత్వ సవరణ చట్టాలను తమిళనాడులో అమలు చేయమని మేనిఫెస్టోలో వెల్లడించింది. ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే 'అగ్నిపథ్' పథకాన్ని రద్దు చేస్తామని, భారత సాయుధ దళాల్లో శాశ్వత నియామకాల సర్వీస్‌ను తిరిగి ప్రవేశపెడుతామని కూడా మేనిఫెస్టోలో డిఎంకె పొందుపరిచింది. ఇప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రతి ఐదేళ్లకొకసారి కులాల వారీగా జనాభా గణన, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వ్యక్తులకు సంబంధించిన జనాభా గణన కూడా చేసేలా చూస్తామని పేర్కొంది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజ్వేషన్‌ను తక్షణమే అమల్లోకి తీసుకువస్తామని హామీనిచ్చింది. మేనిఫెస్టోలోని మరికొన్ని అంశాలను పరిశీలిస్తే... 'లింగ సమానత్వం వైపు ప్రయాణానికి ప్రాధాన్యతనిస్తూ, మహిళలకు రుతుక్రమ సెలవులు అందించే చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రూపొందించాలని డిఎంకె పట్టుబట్టనుంది'. పెట్రోలు, డీజిల్ ధరలు 'రూ. 75, రూ. 65 (లీటర్‌కు), వంట గ్యాస్ సిలిండర్‌లు రూ. 500 (సిలిండర్‌కు) అందుబాటులో ఉంచుతామని హామీనిచ్చింది. రాజ్యాంగ పీఠికలో పేర్కొన్న విధంగా భారతదేశ లౌకిక స్వభావాన్ని కాపాడేందుకు 'యూనిఫాం సివిల్ కోడ్ ప్రవేశపెట్టడాన్ని కచ్చితంగా నిరోధిస్తామని తెలిపింది. ఉద్యోగుల భవిష్య నిధి (ఇపిఎఫ్) ద్వారా కేంద్ర ప్రభుత్వం నెలకు కనీసం రూ.5,000 పెన్షన్‌ను అందజేస్తామని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద పని దినాలు 100 నుంచి 150 రోజులకు పెంచుతామని వాగ్దానం చేసింది. బిజెపి హయాంలో ఏర్పాటు చేసిన ప్రస్తుత నీతి ఆయోగ్‌ను రద్దు చేయడం, రాష్ట్ర ప్రభుత్వాల అభ్యర్థనల ఆధారంగా ప్రణాళికలను రూపొందించడానికి ప్రణాళికా సంఘాన్ని మళ్లీ ఏర్పాటు చేయడం డిఎంకె ఇచ్చిన మరో హామీ. భారతదేశ భద్రతను నిర్ధారించడానికి, మత్స్యకారుల సంక్షేమాన్ని పరిరక్షించడానికి కచ్చతీవును తిరిగి స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకుంటామని డిఎంకె ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చింది.

### లోకసభ అభ్యర్థుల జాబితా

మేనిఫెస్టోతో పాటు 21 లోక్‌సభ స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేస్తూ జాబితా విడుదల చేసింది. సిట్టింగ్ ఎంపిలైన కనిమొళి, టిఆర్ బాలు, ఎ.రాజాలకు మరోసారి అభ్యర్థిత్వం ఖరారు చేసింది. మిగిలిన 18 సీట్లను మిత్రపక్షాలు అయిన కాంగ్రెస్, వామపక్షాలు, విసికె తదితర పార్టీలకు కేటాయించింది. కాంగ్రెస్ 9 స్థానాల్లో బరిలోకి దిగనుంది. 21 మంది అభ్యర్థుల్లో 11 మంది కొత్తవారే ఉన్నారు.

## బిఆర్ఎస్‌కు వరుస షాక్

కాంగ్రెస్‌లో చేరిన జెడ్‌పి స్వర్ణ సుధాకర్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్‌కు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఒకరి తర్వాత మరొకరు ఆ పార్టీని వీడుతున్నారు. ఎంపిలు, ఎంఎల్ఎ, మాజీ ఎంఎల్ఎలు, జెడ్‌పిలు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. తాజాగా బిఆర్ఎస్‌కు చెందిన మహబూబ్‌నగర్ జిల్లా జెడ్‌పి ఛైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేసి, కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఎఐసిసి కార్యదర్శి వంశీచంద్ రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లో స్వర్ణ సుధాకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో బుధవారం చేరారు. ఆమెకు సిఎం రేవంత్ రెడ్డి పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. ఇటీవల ఎంపిలు పసునూరి దయాకర్,రంజిత్ రెడ్డి, ఎంఎల్ఎ దానం నాగేందర్, మాజీ ఎంపి జితేందర్ రెడ్డి తదితరులు కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. బిఆర్ఎస్‌కు చెందిన మరి కొందరు నేతలు త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశాలు ఉన్నట్టు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా మరి కొందరు ఎంఎల్ఎలు కూడా బిఆర్ఎస్‌ను వీడుతారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

## కాంగ్రెస్ నిర్లక్ష్య వైఖరి కారణంగా వ్యవసాయరంగం కుదేలు

కాంగ్రెస్ నేతలకు వ్యవసాయంపై అవగాహన లేదు
మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ :** కాంగ్రెస్ నిర్లక్ష్య వైఖరి కారణంగా వ్యవసాయరంగం కుదేలయ్యే ప్రమాదముందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎంఎల్ఎ గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. పంటలు ఎండిపోయి రైతులు బోరున విలపిస్తున్నా పట్టించుకోని అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని పాలిస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ నేతలకు వ్యవసాయ రంగంపై అవగహన లేదన్నారు. బుధవారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో మాజీ ఎంఎల్ఎ నల్లమోతు భాస్కర్‌రావుతో కలిసి ఎండిన పంట పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. మూసీ ప్రాజెక్టు కింద నీరు అందించే అవకాశం ఉన్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆగ్రహ వ్యక్తం చేశారు. సాగర్ ఆయకట్టులో కూడా ఎగువ ఉన్న నారాయణపురం, ఆల్మట్టి డ్యామ్‌ల నుంచి నీటిని తెప్పించి రైతులకు అందించాలన్నారు. తెలంగాణాలో ఏ గ్రామానికి వెళ్లినా ఎండిన పంట పొలాలే దర్శనమిస్తున్నాయని, పెట్టుబడులన్ని మట్టిలో కలిసిపోయి రైతులు విలపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డిలు ప్రగల్భాలు పలకడంతప్పా దేనికి పనికిరారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కరువుపై సర్వే చేయించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి మంకెన కోటిరెడ్డి, జిల్లా రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, టిఎస్ ఆగ్రోస్ మాజీ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, జడ్‌పి కోఆప్షన్ మెంబర్ మోసిన్‌అలీ, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మట్టపల్లి సైదయ్యయాదవ్, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, కంచర్ల కృష్ణారెడ్డి, జిల్లా రైతుసంఘం మాజీ అధ్యక్షుడు నామిరెడ్డి యాదగిరిరెడ్డి, నాయకులు అమరావతి సైదులు, చౌగాని భిక్షంగౌడ్, కట్టా మల్లేష్‌గౌడ్, హాతీరాంనాయక్, వీరకోటిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాములుగౌడ్, కుర్ర శ్రీను, రవి, వెంకటేశ్వర్లు, షోయబ్, రమణ, శివ, యాదగిరి, భిక్షానాయక్, లింగయ్య, చిన్యానాయక్, దుండిగాల శ్రీనివాస్, గౌరు శ్రీనివాస్, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలీ ఫైనాన్స్‌కార్పొరేషన్ ఏర్పాటు పట్ల హర్షం

**ప్రజాపక్షం / హైదరాబాద్:** పద్మశాలీల చిరకాల కోరిక 'పద్మశాలి ఫైనాన్స్ కార్పొరేషన్'ను ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ధన్యవాదాలు తెలియజేశారు. హైదరాబాద్‌లో సంక్షేమ సంఘం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సంఘం అధ్యక్షులు తుమ్మ సత్యనారాయణ మాట్లాడుతూ మానవాళికి వలువలు చేకూర్చి, నాగరికత నేర్పిన చేనేత నేడు సరియైన పెట్టుబడి లేక చితికి పోతున్నందున ఆదుకోవడానికి, అవస్థలు పడుతున్న పద్మశాలీలు జీవనోపాధి సమకూర్చుకోవడానికి, రాష్ట్ర జనాభాలో ఉన్న 12 శాతం పద్మశాలీల ఆర్థిక పరిపుష్టి కోసం పద్మశాలి ఫైనాన్స్ కార్పొరేషన్‌కు తగినన్ని నిధులు నిరంతరం ప్రభుత్వం సమకూర్చాలని కోరారు. సంఘ ప్రధాన కార్యదర్శి సూర్యపల్లి రవికుమార్ విజ్ఞానం, విద్యా పరిజ్ఞానంతో విలసిల్లే పద్మశాలీలు ఆర్థికంగా బలహీన పరిస్థితిలో ఉన్నందున చట్టసభలకు పోటీ చేయలేక రాజకీయంగా ఎదుగలేకపోతున్నారని, ముఖ్యమంత్రి సహృదయంతో కనీసం ఒక రాజ్యసభ స్థానం, నాలుగు ఎంఎల్‌సి స్థానాలతో పాటు, ఆరు కార్పొరేషన్‌లకు చైర్మన్లుగా నియమించి, పద్మశాలీల రాజకీయ అభ్యున్నతికి తోడ్పడాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు చేనేత దుస్తులను వారానికి ఒక రోజు విధిగా ధరించాలనే నిబంధన విధించి, కఠినంగా అమలు చేసి, చేనేత పారిశ్రామికులకు నిరంతరం పని కల్పించడానికి తోడ్పడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## గందరగోళంలో తెలంగాణ టిడిపి

శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు.. బిజెపితోనే దోస్తానా?



**ప్రజాపక్షం/ఖమ్మం:** తెలంగాణ తెలుగుదేశం పార్టీ చౌరస్తాలో నిలబడింది. పోగా పోగా మిగిలిన పార్టీ ఏవైపుకు నిలవాలో అర్థం కానీ స్థితిలో ఉంది. శాసనసభ ఎన్నికల్లో ఏం ఆశించకుండానే కాంగ్రెస్‌కు మద్దతు తెలిపిన టిడిపి ఇప్పుడు ఆంధ్రాలో బిజెపి, జనసేనలతో కలిపి ఫ్రంట్ కట్టింది. ఎలాగైనా ఈసారి ఆంధ్రాలో అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తుంది. అక్కడ గెలుపోటముల సంగతి అక్కడి ప్రజలకు వదిలేస్తే ఇక్కడ బిజెపి, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు సర్వశక్తులు ఒడ్డుతుంది. మోడీ, అమిత్‌షా తెలంగాణ చుట్టూ తిరుగుతున్నారు. ఎలాగైనా బిఆర్ఎస్ ను మట్టి కరిపించి కాంగ్రెస్ తర్వాత బిజెపినే అనే భావనను ప్రజల్లో కల్పించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తుంది. ఈ క్రమంలో తెలంగాణలోను బిజెపి, టిడిపి దోస్తీ కొనసాగుతుందా లేదా అన్న సందేహం వ్యక్తమవుతుంది. తెలంగాణలోను బిజెపి, టిడిపిలు మిత్రులుగా కొనసాగితే కాంగ్రెస్‌కు కొంత మేర నష్టమే. గత శాసనసభ ఎన్నికల్లో చాలా నియోజక వర్గాల్లో కాంగ్రెస్ గెలుపుకు టిడిపి దోహదపడింది అనడంలో సందేహం లేదు. దాదాపు 40 నియోజక వర్గాల్లో ఐదువేలకు పైబడి టిడిపి ఓట్లు ఉన్నట్లు అంచనా. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆంధ్రాకు వెళ్లి వైసిపి, టిడిపి కూటమిని ఓడించి కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రభావం కూడా తెలంగాణ టిడిపిపై చూపే అవకాశం ఉంది. చంద్రబాబు పాత ధోరణిలోనే ఎటు తేల్చకపోవడమో, సరైన నిర్ణయం అనుకుంటే మరింత బలహీనపడి తెలంగాణలో టిడిపి అదృశ్యం కావచ్చు. గతం మాదిరి కాంగ్రెస్‌కు మద్దతా, బిజెపికి మద్దతా లేక కొన్ని స్థానాల్లో పోటీ చేస్తారా ఏదో ఒకటి నిర్ణయించి గందరగోళానికి తెర దించాలని క్యాడర్ కోరుతుంది.

# విద్య కాషాయీకరణను వ్యతిరేకిద్దాం

శాస్త్రీయ విద్యా విధానం కోసం ఉద్యమించాలి
ఎఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాస్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహంతో బిజెపి అనుబంధ ఆర్ఎస్ఎస్ మతోన్మాద శక్తుల పై, విద్యా కాషాయీకరణ, విద్యా ప్రైవేటీకరణ, విద్యా కేంద్రీకరణ కోసమే తీసుకొచ్చిన నూతన విద్యా విధానం (ఎన్ఇపి) రద్దు కోసం విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాస్ రావు పిలుపునిచ్చారు. హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని రాజ్ బహదూర్‌గౌర్ హాల్లో బుధవారం ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో శ్రీనివాస్ రావు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి విద్యను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పాలని చూస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను నిర్వీర్యం చేసే కుట్రలో భాగమే విదేశీ విశ్వవిద్యాలయాలకు అనుమతి ఇచ్చిందన్నారు. స్వదేశంలో కూడా ఆదానీ, అంబానీ, టాటా లాంటి కార్పొరేట్ సంస్థలకు విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించిందన్నారు. ఈ విధానాలు ప్రభుత్వ విద్య వ్యవస్థను ధ్వంసం చేయడానికి తీసుకుంటున్న చర్యలని విమర్శించారు.

### వర్సిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బతీసే ప్రయత్నం

విద్యను కాషాయీకరణ వైపు తీసుకువెళుతూ శాస్త్రీయమైన ఆలోచనలను, శాస్త్రీయ విద్యను దూరం చేసేందుకే మత భావాల గల పాఠ్యాంశాలను జాతీయ నూతన విద్యా విధానం పేరుతో తీసుకొస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యా వ్యతిరేక సంస్కరణను విధానాలకు వ్యతిరేకంగా చైతన్యం ఎఐఎస్ఎఫ్ నాయకత్వంలో విద్యార్థులు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. నేడు దేశంలో నూతన విద్యావిధానం పేరుతో కేంద్ర ప్రభుత్వం యూనివర్శిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బతీసే ప్రయత్నం చేస్తుందన్నారు. యూనివర్శిటిలను మూడు, నాలుట గు రకాలుగా విభజన చేసి విద్యను మరింత కార్పోరేటీకరణ, ప్రైవేటీకరణ, కేంద్రీకరణ, కాషాయికరణ చేస్తుందన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో ఆర్ఎస్ఎస్ ఎజెండా అమలుకు బిజెపి ప్రయత్నం చేస్తుందని, ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్నవారినే యూనివర్శిటీలలో నియమాకాలు చేస్తుందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం10 శాతం బడ్జెట్ కేటాయింపులు చేయకుండా, జిడిపిలో 6 శాతం నిధులు కేటాయించకుండా ఎలా నూతన విద్యావిధానం అమలు చేస్తారని శ్రీనివాస్ రావు ప్రశ్నించారు. నూతన విద్యావిధానం, విశ్వవిద్యాలయాల ఫండ్‌కట్స్, ఫెలోషిప్స్ ఇవ్వకపోవడం, ఖాళీలు భర్తీ చేయకుండా ఉండటం, యూనివర్శిటీలలో ప్రజాస్వామ్య వాతావరణం లేకుండా చేయడంపై ఉద్యమించాలని శ్రీనివాస్ రావు విద్యార్థులకు పిలుపునిచ్చారు.

### నూతన విద్యావిధానానికి వ్యతిరేకంగా రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలి : స్టాలిన్

కేరళ, తమిళనాడు, కర్ణాటక మూడు రాష్ట్రాలు నూతన జాతీయ విద్యా విధానం తిరస్కరిస్తున్నట్లు తీర్మానం చేశాయని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా నూతన జాతీయ విద్యా విధానం అమలుకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు నద్దునూరి అశోక్ స్టాలిన్ డిమాండ్ చేశారు. బిజెపి తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం దేశంలోనే సుసంపన్నమైన, వైవిధ్య భరితమైన భిన్నత్వంలో ఏకత్వానికి బదులు విద్యాకాషాయికరణ హిందుత్వ ఆధారిత రాజ్యాన్ని, సమాజాన్ని స్థాపించడానికి బాటలు వేస్తుందని దుయ్యబట్టారు. ఈ విద్యా విధానంలో ప్రైవేట్ విశ్వవిద్యాలయలను, విదేశీ విశ్వవిద్యాలయాలను అనుమతిస్తారన్నారు. ఇలాంటి లోపాల పుట్టలతో ఉన్న నూతన జాతీయ విద్యా విధానాన్ని ప్రజలందరూ తిరస్కరించాలని కోరారు. ఎన్ఇపి రద్దుకై ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా సంతకాల సేకరణ కార్యక్రమం సుభాష్ చంద్రబోస్ జయంతి రోజైన జనవరి 23 నుండి భగత్ సింగ్ వర్ధంతి రోజైన మార్చి 23 వరకు చేపట్టడం జరుగుతుందన్నారు.

### రాష్ట్రం పట్ల కేంద్ర సర్కార్ కక్షపూరిత వైఖరి..

రాష్ట్ర విభజన హామీలను అమలు చేయకుండా, తెలంగాణ రాష్ట్రానికి విద్యా సంస్థలను కేటాయించకుండా బిజెపి ప్రభుత్వం కక్ష్య పూరితంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. విభజన హామీలను అమలు చేయడంలో విఫలమైన బిజెపి నేతలు ఏ ముఖం పెట్టుకొని లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రావాలని కలలు కంటున్నా ప్రధాని నరేంద్ర మోడీ ఆశలను విద్యార్థిలోకం అడ్డుకుంటుందని హెచ్చరించారు. బిజెపి అవలంభిస్తున్న విధానాలు అప్రజాస్వామికంగా ఉన్నాయని మండిపడ్డారు. ప్రజాస్వామిక పాలన కావాలంటే మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలన్నారు. ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర నాయకులు ఇటికాల రామక్రిష్ణ, బానొత్ రాఘురాం, గ్యార క్రాంతి, గ్యార నరేష్, బరిగెల వెంకటేశ్, నెల్లి సత్యా, సి.రాజు, సోతుకు ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యానికి మద్దతు ధర చెల్లించకుంటే మిల్లులు సీజ్

పంటనష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్టపరిహారం అందిస్తాం :
మంత్రి కోమటిరెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** రాష్ట్రంలో యాసంగి ధాన్యంను రైసు మిల్లర్లు మద్దతు ధర తో కొనుగోలు చేయాలని, లేదంటే బాధ్యులైన రైస్ మిల్లులు సీజ్ చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హెచ్చరించారు. బుధవారం మిర్యాలగూడలో ఆయన పలు దేవాలయాల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. మిల్లుల వద్ద ఆగి రైతుల ధాన్యం కొనుగోలు జరుగుతున్న తీరుతెన్నులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు తమకు మద్ద తు ధర మేరకు ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఫిర్యాదు చేశారు. స్పందించిన మంత్రి వెంకటరెడ్డి వెంటనే డిఎస్ఓ వెంకటేశ్వర్లుతో ఫోన్‌లో మాట్లాడారు. తక్కువ ధరకి ధాన్యం కొంటున్న మిల్లు యజమాన్యం పై ఫిర్యాదు చే శారు. గ్రేడ్ ఏ 2,203, సాధారణ రకం 2183 నిర్ణయించిందని, మిల్లర్లు 1900 నుంచి 2వేల వరకే కొనుగోలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారని, అలాగే సన్న రకం ధాన్యం 2500 వరకు కొనుగోలు చేయాలని వివరించారు. సన్న బియ్యం ఎక్కువ ధరకు అమ్ముకుంటున్న మిల్లర్లు సన్న ధాన్యానికి ఎందుకు మద్దతు ధర ఇవ్వరం టు మండిపడ్డారు.మద్దతు ధర మేరకు ధాన్యం కొనుగోలు చేయని మిల్లర్ల మిల్లులు సీజ్ చేయాలని ఆదేశించారు. మద్దతు ధర సమస్య, మిల్లర్ల తీరుపై తాను సిఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని స్పష్టం చేశారు. అవసరమైతే ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందన్నారు. ఇది ప్రజా ప్రభుత్వం,రైతు ప్రభుత్వమని,రైతులకు అన్యా యం జరిగితే సహించేది లేదన్నారు. సీనియర్ మంత్రిగా మిల్లర్లను హెచ్చరిస్తున్నానని, ప్రభు త్వం మిమ్మల్ని అన్ని రకాలుగా ఆదుకున్నప్పు డు రైతులకు మీరు మేలు చేయడానికి ప్రయత్నం చేయండని మిల్లర్లకు వెంకటరెడ్డి హితవు పలికారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ 1 నుండి తెరిచేందుకు ఏర్పాట్లు చేస్తుందన్నారు. సుమారుగా 60 నుంచి 70లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు పౌర సరఫరాల శాఖ సన్నద్ధమవుతుందన్నారు. గత ప్రభుత్వం ఎపి సిఎం జగన్ వద్ద మోకరిల్లి కృష్ణా, గోదావ రి నీళ్లను ఆంధ్రాకు తరలించిందని, అందుకే ఇప్పుడు నీళ్ల కొరత ఏర్పడిందన్నారు. దక్షి ణ తె లంగాణను మొత్తం నాశనం చేసింది నాటి కెసిఆర్ ప్రభుత్వమేనని, ఉమ్మడి నల్లగొండ జిల్లా పెండింగ్ ప్రాజెక్టులను ఒక్కటి పూర్తి చేయకుం డా ఈ ప్రాంత ప్రజలకు, రైతులకు కెసిఆర్ అన్యాయం చేశాడని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ బత్తుల లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు పాశం రాంరెడ్డి, సంపత్ రెడ్డి, లక్ష్మ య్య తదితరులు పాల్గొన్నారు.

## నారాయణకు రెండు వారాలు విశ్రాంతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణకు రెండు వారాలపాటు విశ్రాంతి అవసరమని హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజి ఆస్పత్రి వైద్యులు సూచించారు. ఈనెల 16వ తేదీన కామారెడ్డిలో జరిగిన వివాహానికి హాజరైన సందర్భంలో వివాహ వేదికపైకి వెళ్లుతున్న క్రమంలో నారాయణ జారిపడ్డారు. అనంతరం విశాఖపట్నం, చెన్నైలో జరిగిన పార్టీ సమావేశాల్లో పాల్గొన్నారు. ఆ సందర్భంలో నొప్పి ఎక్కువ కావడంతో వైద్యులను సంప్రదించగా రిబ్ ఎముక విరిగినట్లు నిర్ధారించారు. రెండు వారాలపాటు విశ్రాంతి అవసరమని వైద్యులు నారాయణకు సూచించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని తన నివాసంలో నారాయణ విశ్రాంతి తీసుకుంటున్నారు.

## మిమ్మల్ని అధ్యక్ష పదవి నుంచి.. ఎందుకు తొలగించారు?

బండికి సమాధానం చెప్పాలన్న పొన్నం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బండి సంజయ్‌ను అధ్యక్ష పదవి నుంచి ఎందుకు తొలగించారో చెప్పాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. బండి సంజయ్ అవినీతి పరుడని తెలంగాణ రాష్ట్రం కోడై కూస్తోందని ఆరోపించారు. కరీంనగర్ నుండి ఇప్పటి వరకు ఎవరికి అలాంటి పేరురాలేదన్నారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌లో మాట్లాడారు. కిషన్ రెడ్డిని కెసిఆర్ అపాయింట్ చేయించారని, ఆ విషయం బండి సంజయ్ చెప్పారన్నారు. బండి సంజయ్ అవినీతి పరుడుకాదని కిషన్ రెడ్డి చెప్పాలన్నారు. సిట్టింగ్ ఎంపిగా ఉండి ఎంఎల్ఎగా ఓడిపోయారన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్, బండి సంజయ్‌లు ఇద్దరూ లోపయకారంగా మిత్రులని ఆరోపించారు. కన్న తల్లిని అవమానించిన దుర్మార్గుడు బండి సంజయ్ అని మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ముందు కరీంనగర్ ప్రజలకు ఎం చేశావో సమాధానం చెప్పాలని బండి సంజయ్‌ని డిమాండ్ చేశారు. ఆస్కార్ అవార్డు పొందాలంటే ఎంత తాపత్రయం పడుతారో, నటనలో బండి సంజయ్ అంత తాపత్రయం పడుతున్నారని విమర్శించారు. కారణం లేకుండా తన మీద ఆభాండం వేశాడన్నారు. అందుకే తాను సజీవ దహనానికి సిద్ధం అన్నానని తెలిపారు. నిరూపించలేకపోయారు కాబట్టే సైలెట్‌గా ఉన్నారని మంత్రి అన్నారు. వర్షాలు పడాల్సింది సెప్టెంబర్‌లో అని అప్పుడు అధికారంలో ఉంది బిఆర్ఎస్ అన్నారు. తాము అధికారంలోకి వచ్చింది డిసెంబర్‌లో అది వర్షాకాలం కాదన్నారు. అయినా దానికి బాధ్యులు వాళ్లని తాము అనట్లేదన్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ టఫ్ నడుస్తోందని, కాంగ్రెస్‌తో కరువు వచ్చిందని అవగాహన లేకుండా బిఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట నష్టం గురించి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు.

### హైదరాబాద్‌కు తాగునీటి ఇబ్బందిలేదు..

హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలకు సింగూరు నుండి 18 శాతం, గోదావరి నుండి 35 శాతం కృష్ణా నుండి 45 శాతం, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌ల నుండి 4 శాతం నీటిని వినియోగిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నాగార్జున సాగర్‌లో 510 అడుగుల నీళ్లు ఉన్నాయని, అవసరమైతే బూస్టర్ పైప్‌ల ద్వారా నీటిని తరలిస్తామన్నారు. ఎల్లంపల్లి నుండి కూడా 3 టిఎంసిలు హైదరాబాద్ నగరానికి తరలిస్తున్నామని, ప్రకృతి కరువు ఎదుర్కొవడానికి ప్రతి పక్షాలు సహకరించాలని కోరారు. తన వాయిస్‌రికార్డ్ చేసిన ఎంఆర్ఒపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. పార్టీ, ప్రభుత్వానికి మధ్య గ్యాప్ గురించి పార్టీ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ చూసుకుంటారని అన్నారు.

## చేనేతకు 'కళాపునర్వి' చేయూత అమోఘం

కేంద్ర ఆర్మీ మేజర్ జనరల్ ఎకె సింగ్



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి పట్టణంలోని కళాపునర్వి చేనేత యూనిట్ యాజమాన్యం సోదరులు సాయిని భాస్కర్ భరత్‌లు చేనేత కళా నైపుణ్యంలో చేస్తున్న కృషి అమోఘమని, హ్యాండ్‌లూమ్ ఇండస్ట్రియలిస్టులకు స్ఫూర్తి అని ఇండియన్ ఆర్మీ 1 మేజర్ జనరల్ ఎకె సింగ్ ప్రసంశల జల్లు కురిపించారు. దేశంలో ప్రసిద్ధి గాంచిన వివిధ పారిశ్రామిక రంగాల అభివృద్ధి ఉత్పత్తులు లాభసాటి వ్యాపారం ప్రోత్సాహకం ప్రమోటింగ్ వంటి అంశాలపై ఢిల్లీ ప్రభుత్వానికి నివేదిక సమర్పణ కోసం బుధవారం క్షేత్ర స్థాయి పరిశీలనలో భాగంగా వివిధ రాష్ట్రాల, దేశాల ఎన్‌డిసి ఆర్మీ ఉన్నత అధికారులు 15 మంది బృందంతో కలిసి ఆయన పోచంపల్లిలోని కళాపునర్వి హ్యాండ్లూమ్ యూనిట్‌ను సందర్శించారు. క్షేత్రస్థాయిలో చేనేత ఇక్కత్ పట్టు వస్త్రాల తయారీ విధానం గురించి వివిధ దశల్లో కార్మికులు వేస్తున్న చేనేత కళాసృష్టిని అడిగి తెలుసుకున్నారు. మాల్బారి పట్టు పురుగు కాయల నుండి దారం ఒడికే యంత్రాల నుంచి మొదలుకొని పట్టు వస్త్రాల తయారీ వరకు ఉన్న అన్ని యూనిట్లను తిరిగి మగ్గంపై చీరలు నేసే పని విధానాన్ని స్వయంగా చూసి అందమైన చీరల డిజైన్లను స్వయంగా అడిగి చూసి మురిసిపోయారు. చేనేత పరిశ్రమలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు మరింత అభివృద్ధి సాధించాలంటే ఎలాంటి మార్కెటింగ్ సపోర్ట్ అందించాలి అని అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం చెబుతూ నిజంగా ఇక్కడి యువకులు ఎలాంటి సపోర్ట్ లేకుండా సొంత పెట్టుబడితో ఇంత పెద్ద చేనేత యూనిట్ నడపడం అంటే అంతా సాధ్యమయ్యే పని కాదని అది వారి క్రియేటివిటీకి ఒక మచ్చుతునక కాని అన్నారు. యువ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వాలు అండగా నిలిచి సబ్సిడీ రుణాలతో పాటు ఆర్థిక చేయూతను అందించాలన్నారు.రాష్ట్రంలోని పలు హ్యాండ్లూమ్ పరిశ్రమలను చేనే త కా ర్మికులు అనుభవిస్తున్న సమస్యలను కావలసిన ప్రభుత్వ సహకారాలను వస్త్ర ఉత్పత్తుల కోసం ప్ర భుత్వం అందించాల్సిన సహాయం వంటి తదితర అంశాలను అంశాలపై సేకరించిన సమగ్ర నివేదికను సిఎం రేవంత్ రెడ్డి ముందు ఉంచి చేనేత కార్మికుల ఆర్థిక స్వావలంబన కోసం తగు సూచనలు చేస్తామని చెప్పారు. హెచ్ఏఎల్ అభిషేక్ కందపాల్, బ్రింగ్ ఆర్ గులా టి, టామ్ జోనియా దేశానికి చెందిన అధికారి మే హెంగే అనంగే, ఎయిర్ ఫోర్స్ ఆర్మీ అధికారి మన్మీత్ సింగ్, తదితరులు ఆయన వెంట ఉన్నారు.

## కేజ్రీవాల్‌కు సమన్లపై సమాధానం చెప్పండి

ఇడిని ఆదేశించిన ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ :** ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో విచారణకు రావాలంటూ సిఎం కేజ్రీవాల్‌కు ఇడి తొమ్మిదో సారి సమన్లు జారీ చేసింది. దీనిని తీవ్రంగా తీసుకున్న ఆప్ అధినేత హైకోర్టును ఆశ్రయించారు. తనకు జారీ చేసిన అనేక సమన్లను సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఢిల్లీ ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. కేజ్రీవాల్ తరఫు సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, విక్రమ్ చౌదరిలు వాదించారు. పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ ఇడి సమర్పించిన సమన్లపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వాదనలు విన్న ధర్మాసనం సమన్లపై సమాధానం చెప్పాలంటూ ఇడిని ఆదేశించింది. తదుపరి విచారణను ఏప్రిల్ 22 కు వాయిదా వేసింది. కాగా.. మార్చి 21న విచారణకు హాజరుకావాలని ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు కేజ్రీవాల్ కు ఇడి తొమ్మిదో సారి సమన్లు జారీ చేసింది. సమన్ల దాటవేతపై ఇడి కేసు నమోదు చేసింది. పాలసీ రూపకల్పన, ఖరారు కాకముందే జరిగిన సమావేశాలు, లంచం తీసుకున్నారనే ఆరోపణలు సహా పలు అంశాలపై ఈ కేసులో ఆప్ చీఫ్ వాంగ్మూలాన్ని నమోదు చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కోరుతోంది. దీనిపై కేజ్రీవాల్ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన కోర్టు ఇడి సమాధానం చెప్పాలని కోరింది.

# నిలిచేదెవరు? గెలిచేదెవరు?

- ఆసక్తి రేపుతున్న కరీంనగర్ ఎంపి ఎన్నికలు
- బిజెపి, కాంగ్రెస్ మధ్యే పోటీ
- ఉద్యమ గడ్డపై ఢీలా పడ్డ బిఆర్ఎస్
- ఎంఎల్ఎ ఎన్నికల అనంతరం మారిన రాజకీయం

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** పార్లమెంట్ ఎన్నికల నగారా మోగడంతో రాజకీయాలు వేడెక్కాయి. ప్రధానంగా ఉద్యమ గడ్డ అయినటువంటి కరీంనగర్ పార్లమెంట్ పై ప్రధాన పార్టీలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఈ నియోజకవర్గంలో బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, ప్రస్తుత ఎంపి బండి సంజయ్, బిఆర్ఎస్ నుంచి కెసిఆర్‌కు అత్యంత సన్నిహితుడైన మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ బరిలో నిలవగా ఈ ఎన్నికను కాంగ్రెస్ పార్టీ నుంచి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో కరీంనగర్ ఎంపి ఎన్నిక ప్రాధాన్యత సంతరించుకుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ స్థానాల్లో 4 కాంగ్రెస్, 3 బిఆర్ఎస్ కైవసం చేసుకున్నాయి. కానీ కాంగ్రెస్ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన అనంతరం రాజకీయ పరిణామాలు పూర్తిగా మారిపోయాయి. కాగా బిఆర్ఎస్‌కు మూడు ఎంఎల్ఎ స్థానాలున్నా.. బిజెపి ఒక్క స్థానం గెలవకపోయినా.. పోటీ మాత్రం కాంగ్రెస్, బిజెపి మధ్యే ఉంటుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.



### గెలుపు ధీమాతో 'బండి'

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాల్లో బిజెపి పోటీ చేసినప్పటికీ కరీంనగర్, హుజురాబాద్‌లో గట్టి పోటీనిచ్చింది. మిగిలిన చోట ఓటు బ్యాంకును నిలుపుకుంది. పార్లమెంట్ ఎన్నికల్లో బండి సంజయ్ వ్యక్తిగత ఇమేజ్.. ప్రధాని మోడీ చరిష్మా కలుపుకుని బిజెపిలో మరింత ఉత్సాహం పెరిగింది. దీంతో పాటు గత కొంతకాలంగా ప్రజాహిత యాత్రతో నియోజకవర్గ వ్యాప్తంగా బండి సంజయ్ ప్రజల్లోకి వెళ్లడం ఆయనకు కలిసి వచ్చే అవకాశాలున్నాయి. బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి కోల్పోవడం, అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ నియోజకవర్గంలో అతి తక్కువ ఓట్లతో ఓడిపోవడం వంటి సానుభూతి సైతం ఓటర్లలో నెలకొంది. నియోజకవర్గ వ్యాప్తంగా మొదటి విడత ప్రచారాన్ని ముగించారు. దాదాపు అన్ని గ్రామాలను చుట్టి వచ్చిన బండి సంజయ్ గెలుపు ధీమాతో ఉన్నారు.

### కాంగ్రెస్ జోరు కొనసాగేనా..

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 4 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ విజయఢంకా మోగించింది. ఓడిన 3 నియోజకవర్గాల్లోనూ అతి తక్కువ శాతంతో ఓటమి పాలైనప్పటికీ మెజార్టీ ఓటు బ్యాంకును సాధించింది. గెలిచిన స్థానాల్లో అత్యధిక మెజార్టీతో పాటు ఓడి న తక్కువ ఓట్లను బట్టి చూస్తే పార్లమెంట్ పరిధిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధిక ఓటింగ్ శాతాన్ని కాంగ్రెస్ పార్టీ సాధించి జోరు మీద ఉందనే చెప్పవచ్చు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో బిఆర్ఎస్, బిజెపి నుంచి ద్వితీయ శ్రేణి నాయకత్వం, కార్యకర్తలు భారీగా కాంగ్రెస్ పార్టీ లో చేరారు. అదే విధంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రా తినిధ్యం వహిస్తున్నటువంటి హుస్నాబాద్ నియోజకవర్గం పార్లమెంట్ పరిధిలో ఉండడం, ఆయన ఈ ఎన్నిక ను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం కాంగ్రెస్ అభ్యర్థికి కలి సి వచ్చే అవకాశముంది. ఇప్పటి వరకు అభ్యర్థిని ప్రకటించనప్పటికీ ప్రధానంగా ముగ్గురు అల్గిరెడ్డి ప్రవీణ్ రె డ్డి, వెలిచాల రాజేందర్ రావు, రుద్ర సంతోష్ కుమార్‌లు టికెట్ రేసులో ఉన్నారు. ఇప్పటికే ప్రవీణ్ రెడ్డి నియోజకవర్గంలో ప్రచారాన్ని ప్రారంభించారు. అసెంబ్లీ ఎన్నికల హవాతో కాంగ్రెస్ గెలుపు ధీమాతో ఉంది.

### బిఆర్ఎస్ ఢీలా...

ఉద్యమ పార్టీగా పేరొందిన టిఆర్ఎస్‌కు ఆది నుంచి కరీంనగర్ జిల్లా కంచుకోటగా ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ మూడు నియోజకవర్గాల్లో విజయం సాధించింది. పదేళ్ల పాలనలో బిఆర్ఎస్ పట్ల ప్రజల్లో నైరాశ్యం, వ్యతిరేకత మూటగట్టుకుంది. రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోవడంతో బిఆర్ఎస్‌కు ప్రస్తుతం గడ్డు పరిస్థితి నెలకొంది. స్వయంగా ఆ పార్టీ నేతలే చెప్పకనే చెబుతున్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కెటిఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల మినహా బిఆర్ఎస్ గెలిచిన హుజురాబాద్, కరీంనగర్ నియోజకవర్గాల్లో అతి తక్కువ మెజార్టీతో బయటపడింది. అధికారం చేజారగానే బిఆర్ఎస్ రెండవ శ్రేణి నాయకత్వం, కార్యకర్తలు కాంగ్రెస్‌లోకి క్యూ కట్టారు. కరీంనగర్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ కార్పోరేటర్లు, నాయకులు చేసిన భూ ఆక్రమణలు, దందాలపై సిపి కొరఢా ఝులిపించి జైలుకు పంపిస్తుండడంతో ప్రజల్లో బిఆర్ఎస్‌పై వ్యతిరేకత పెరుగుతోంది. బిఆర్ఎస్ ఈ స్థానాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం, మాజీ ఎంపి వినోద్‌ను కెసిఆర్ బరిలో నిలపడం, మొట్టమొదటగా కదనభేరితో ప్రచారం ప్రారంభించి కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపే ప్రయత్నం చేశారు. ఇటీవలే అభ్యర్థి కుటుంబానికి చెందిన ఓ హోటల్‌లో రూ.6 కోట్లపైగా నగదును పోలీసులు స్వాధీనం చేసుకుని ఐటి అధికారులకు అప్పగించడం వంటి అంశాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. బిఆర్ఎస్ నాయకుల్లో విశ్వాసం కోల్పోయే పరిస్థితి కనిపిస్తోంది. మొత్తంగా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఢీలా పడిందనే చర్చ కొనసాగుతోంది. ప్రధానంగా బిజెపి , కాంగ్రెస్ మధ్యే ఉండబోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రజాపక్షం

గురువారం, మార్చి 21

# ఫార్మా కంపెనీల 'బాండ్ల' భాగోతం

ఎలక్టోరల్ బాండ్స్ స్కీమ్ (ఇబిఎస్) ఏ విధంగా పరస్పర ప్రయోజనం, 'క్విడ్ ప్రొకో'ను ప్రోత్సహించిందో బహిర్గతమవుతున్నది. ఈ రాజకీయ చదరంగంలో ఫార్మా కంపెనీలు కూడా ఉండడం ఆందోళనకరం. సుమారు 800 కోట్ల రూపాయల విలువ చేసే బాండ్లను కొనుగోలు చేసిన కంపెనీల్లో 35 కంపెనీలకు దేశంలో అత్యంత బలమైన రెండు ఫార్మా సంఘాల్లో సభ్యత్వం ఉంది. ఇండియన్ డ్రగ్స్ మానుఫాక్చరింగ్ అసోసియేషన్ (ఐడిఎంఎ), ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలియన్స్ (ఐపిఎ) దేశ ఫార్మా రంగాన్ని శాసిస్తున్నాయి. ఎలక్టోరల్ బాండ్లు కొన్న అత్యధిక శాతం కంపెనీలకు ఈ రెంటిలో కనీసం ఒక సంఘంలో సభ్యత్వం ఉంది. అందుకే, ఎలక్టోరల్ బాండ్ల వివరాల ప్రకటనను నిరోధించాలంటూ అసోచామ్, ఫిక్కీ, సిఐఐ వంటి పారిశ్రామికవేత్తల సంస్థల ద్వారా సుప్రీం కోర్టులో పిటిషన్లు వేయించగలిగాయి. సుప్రీం కోర్టు వాటిని తిరస్కరించకపోతే, వాస్తవాలు ఎప్పటికీ వెలుగు చూసేవికావు. కేంద్ర ప్రభుత్వం ఫార్మా పరిశ్రమ అభివృద్ధికి కేటాయించిన మొత్తంలో దాదాపు సగం ఈ ఎలక్టోరల్ బాండ్ల విలువతో సమానం. ఫార్మా రంగంలో ప్రభుత్వ విధివిధానాల రూపకల్పన, ఔషధ నియంత్రణ సహజంగానే ఫార్మా సంఘాల కనుసన్నల్లోనే జరుగుతుంటుంది. ఈ సంఘాల్లో సభ్యత్వం ఉన్న కంపెనీలే అత్యధిక బాండ్లను కొనుగోలు చేయడం కాకతాళీయం కానేకాదు. ఆసుపత్రులు, వాటిలో ఉపయోగించే పరికరాలను, వ్యాక్సిన్లను ఉత్పత్తి చేసే కంపెనీలను మినహాయించిన తర్వాతే వందల కోట్ల రూపాయలు బాండ్ల పేరుతో చేతులు మారాయంటే, వాటి చిట్టాను కూడా పరిశీలిస్తే, ఈ మొత్తం ఇంకెన్ని వందల కోట్లు పెరుగుతుందో? రూ.80 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేసిన డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌కు ఐడిఎంఎ, ఐపిఎలో సభ్యత్వం ఉంది. అదేవిధంగా, రూ. 69.25 కోట్లు ఖర్చు చేసిన నాట్కో ఫార్మా లిమిటెడ్‌కు కూడా ఈ రెండు కంపెనీల్లోనూ సభ్యత్వం ఉంది. టోరెంట్ ఫార్మాస్యూటికల్స్ (రూ. 77.5 కోట్లు), హెటెరో గ్రూప్ (రూ. 60 కోట్లు) సైతం ఈ సంఘాల్లో కీలక భూమిక పోషిస్తున్నాయి. పరోక్షంగా దేశ ఫార్మా రంగాన్ని శాసిస్తున్నాయి. మోడీ సర్కారు నుంచి తమకు అనుకూల నిర్ణయాల కోసమే ఈ కంపెనీలు కోట్లలో విరాళమిచ్చాయన్నది సత్యం. వైద్యులు, ఫార్మాస్యూటికల్ కంపెనీల మధ్య సంబంధాన్ని నియంత్రించే విధివిధానాలను నిర్దేశిస్తూ, 'యూనిఫాం కోడ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ మార్కెటింగ్ ప్రాక్టీసెస్' (యుసిపిఎంపి)ని కేంద్రం ప్రవేశపెట్టింది. వైద్యులను ఆకర్షించి, తమతమ ఉత్పత్తులను అమ్మేదానికి కంపెనీలు ప్రయత్నించకుండా నిరోధించడమే ఈ కోడ్ లక్ష్యం. కానీ, నిబంధనలను అతిక్రమించినట్టు ఫిర్యాదులు వస్తే విచారించే అధికారం ఐడిఎంఎ, ఐపిఎ సభ్యులతో కూడిన కమిటీకి మాత్రమే ఉంటుంది. అంటే తప్పు చేసేది.. విచారణ జరిపేది.. చర్యలు నిర్ధారించేది కూడా ఆ రెండు సంఘాలే. దేశ ఫార్మా రంగాన్ని తమ గుప్పిట్లో ఉంచుకొని, ప్రజలకు అత్యవసరమైన వైద్య సేవలను శాసించే ఫార్మా కంపెనీలకు, ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తున్నది. అందులో కనీసం సగభాగాన్ని ఎలక్టోరల్ బాండ్ల పేరుతో పాలక పార్టీ తిరిగి రాబడుతున్నది. ఈ పరిస్థితుల్లో ఫార్మా కంపెనీలు లాభాలపట్ల అత్యాశ తగ్గించుకొని, ప్రజలకు అందుబాటులో మందులను అమ్ముతాయని అనుకోవడం అత్యాశే. ఈనెల 21వ తేదీ గురువారంలోగా, ఎలక్టోరల్ బాండ్లకు సంబంధించిన సమస్త వివరాలు వెల్లడించాలని ఎస్‌బిఐని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీం కోర్టు ధర్మాసనం ఆదేశించిన నేపథ్యంలో, మరెన్ని సంచలన నిజాలు బయటపడతాయో? ఇంకెన్ని పరిశ్రమలు పరస్పర లాభాపేక్షతో కోట్లాది రూపాయలు బాండ్లను కొనుగోలు చేశాయో? అధికారాన్ని ఉపయోగించి బిజెపి ఎంతగా లాభపడిందో? నిజాలు నిగ్గుతేలుతాయని ఆశిద్దాం.

# ఎన్నికలకు నిధులపై చర్చ అవసరం

కె. రవీంద్రన్

మోడీ ప్రభుత్వం 2018లో ప్రవేశపెట్టిన ఎలక్టోరల్ బాండ్స్ పథకం (ఇబిఎస్) రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీం కోర్టు కొట్టివేసినప్పటికీ, ఈ స్కీమ్‌పై వివాదాలు, చర్చోపచర్చలు కొనసాగుతునే ఉన్నాయి. బాండ్ల వివరాలు భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ)కి సమర్పించాలని సుప్రీం కోర్టు ఆదేశించినప్పుడు, 'గోప్యత' పేరుతో దాట వేయడానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ప్రయత్నించింది. జూన్ 30వ తేదీ వరకూ గడువు ఇవ్వాలన్న బ్యాంక్ వినతిని సుప్రీం కోర్టు తిరస్కరించడంతో, బాండ్ల వివరాలు వెల్లడించక తప్పని పరిస్థితి. హడావుడిగా సమాచారాన్ని అందించింది. అయితే, బాండ్లకు కేటాయించే ప్రత్యేక నంబర్లను, ఇతర కీలక వివరాలను వెల్లడించకుండా దాచేసింది. 'గోప్యతా నిబంధనలు' అంటూ పాత పల్లవే ఎత్తుకుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీం కోర్టు ధర్మాసనం వివరాలు ఇచ్చి తీరాల్సిందేనని ఆదేశించడంతో, అరకొర సమాచారంతో సరిపుచ్చుకుంది. కానీ, పూర్తి వివరాలను ఇచ్చి తీరాల్సిందేనని ఎస్‌బిఐకి సుప్రీం కోర్టు మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈనెల 21వ తేదీ (గురువారం)లోగా పూర్తి సమాచారం ఇవ్వాలని, దానిని ఇసిఐ తన వెబ్‌సైట్‌లో ఉంచాలని స్పష్టం చేసింది. మొత్తం మీద దొంగ పోలీసు ఆట మాదిరి సాగుతున్న ఎలక్టోరల్ బాండ్స్ కథ ఎటువైపు తిరుగుతుందో, ఎవరెవరి గుట్టువిప్పుతుందో చూడాలి. ఒకవైపు ఇబిఎస్‌పై చర్చలు, వాదనలు జరుగుతుండగా, మరోవైపు రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఎన్నికల ఖర్చును కేంద్రమే భరించాలన్న ప్రతిపాదన కూడా వినిపిస్తున్నది. ఏదిఏమైనా ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా పాలక పక్షానికి నిరాటంకంగా నిధులు ఇవ్వడం, ప్రజాస్వామ్య ప్రక్రియలను విధ్వంసానికి దారితీస్తుంది. పరస్పర ప్రయోజనాలను ఆశించి, జరిగే ఈ 'విరాళాల' ప్రక్రియ గతంలో ఎన్నో చేదు అనుభవాలను రుచిచూపింది. ఆ పాఠాలను పరిగణనలోకి తీసుకుంటే, దేశంలో ప్రజాస్వామ్యం మనుగడ సాగించడానికి ఎన్నికలకు దేశ నిధులు వినియోగించాలన్న అంశంపై పునరాలోచన అవసరం స్పష్టమవుతుంది. ఎలక్టోరల్ బాండ్ల పథకం చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు నేపథ్యంలో, ఎన్నికల ఖర్చు భారం ఎవరిదనే విషయాన్ని చర్చించాల్సిన అవసరం ఉందని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాస్వామ్య సంస్థలు అంటున్నాయి. వాస్తవానికి గత ఏడాది నవంబర్‌లోనే ఈ బాండ్లపై ధర్మాసనం ఒక నిర్ణయానికి వచ్చినప్పటికీ, తీర్పు వెల్లడించడంలో జరిగిన జాప్యం సహజంగానే ప్రజాస్వామ్య అనుకూల కార్యకర్తలు, ఔత్సాహికులను నిరుత్సాహపరచింది. అయితే, సుప్రీం కోర్టు అర్థవంతమైన జోక్యం చివరికి ఆ బాండ్ల రద్దు ప్రక్రియను పూర్తి చేసింది. విరాళాల పేరుతో అక్రమాలకు చట్టబద్ధత కల్పించడాన్ని సంపూర్ణంగా నిరోధించి, పరోక్షంగా ఎన్నికల సంస్కరణలను ప్రతిపాదించింది. ఇప్పుడు ఉన్న విధానాలకు న్యాయపరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సూచించడం ద్వారా, పొరపాట్లను సుప్రీం కోర్టు సరిదిద్దుతుందన్న ఆశాభావం కూడా సర్వత్రా వ్యక్తమవుతున్నది. అయితే, ప్రజాభిప్రాయాన్ని దృష్టిలో ఉంచుకొని ఇలా చేయాలంటే, కోర్టు వివిధ పిటిషన్లలో చేర్చిన అంశాల కంటే అధికంగా ఆలోచించాల్సి ఉంటుంది. ఆయా పిటిషన్ల పరిధిని దాటాలి. కానీ, కోర్టు స్వచ్ఛందంగా స్పందించి, కీలకమైన తీర్పులు ఇవ్వడం చాలా అరుదు. ఒక రకంగా చెప్పాలంటే, అలాంటి విధానం మన ప్రజాస్వామిక దేశంలో వేళ్లానుకోలేదు. ఎలక్టోరల్ బాండ్స్ స్కీమ్ అనేది అధికార బిజెపికి నిరాటంకంగా రాజకీయ నిధులను సమకూర్చడాన్ని సులభతరం చేస్తుందని సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్ల సారాంశం. దీనితో ఎలక్టోరల్ బాండ్ల ద్వారా ఏఏ పార్టీలకు ఎంతెంత సొమ్ము వచ్చి చేరిందనే వివరాల పరిశీలన మొదలైంది. మొత్తం బాండ్లలో అధికార బిజెపి 90 వాతం వాటాను కొల్లగొడితే, ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌సహా ఇతర పార్టీలన్నిటికీ కలిపి కేవలం 10 శాతం మాత్రమే మిగిలింది. భారీగా వచ్చి చేసిన విరాళాలతో, అసమానమైన ధనబలాన్ని సంపాదించుకున్న బిజెపి, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టిందని ఇటీవలి సంవత్సరాల్లో చోటు చేసుకున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఆయా ప్రభుత్వాలను అస్థిరపరచే ప్రయత్నాలను బిజెపి చేసింది. అందుకోసం పటిష్టమైన ప్రణాళికలను సిద్ధం చేసుకొని, అమలు చేసింది. కొన్ని రాష్ట్రాల్లో, చట్టబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను గద్దెదించడంలో, అత్యంత హేయమైన రీతిలో ఫిరాయింపులను ప్రోత్సహించడంలో సఫలమైంది. మరికొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కీలుబొమ్మలుగా మార్చింది. కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్ తదితర రాష్ట్రాల్లో బిజెపి విధ్వంసకర రాజకీయాలకు పాల్పడింది. రాజకీయ పార్టీలకు ఏదో ఒక రూపంలో భారీగా డబ్బు అందితే, ఎన్నికల సమయంలో అక్రమాల బెడద పెరుగుతుంది. ప్రజలను ఏదో ఒక రకంగా మభ్యపెట్టి ఓట్లు సంపాదించుకునే దుష్ట సంప్రదాయం బలపడుతుంది. ఎన్నికల ఖర్చుపై నియంత్రణ ఉండడమేగాక, ఆ మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వమే భరిస్తే, చాలా వరకు సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. చారిత్రక దృక్కోణాలను పరిశీలిస్తే, 1998 నాటి ఇంద్రజిత్ గుప్తా కమిటీ నివేదిక, 1999 నాటి లా కమిషన్ ఆఫ్ ఇండియా నివేదికలు ఎన్నికల కోసం భారత సంఘటిత నిధి (కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియా) నుంచే సొమ్మును ఖర్చు చేయాలని సూచించాయి. అంటే, రాజ్యమే ఎన్నికల ఖర్చులు భరించాలనే ఆలోచన కొత్తగా పుట్టుకొచ్చినది కాదు. అయితే, ఈ నిధులు జాతీయ, ప్రాంతీయ పార్టీలకు మాత్రమే ఇవ్వాలి. స్వతంత్ర అభ్యర్థులకు కాదు. అంతేగాక, స్వల్పకాలిక నిధులు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు, వాటి అభ్యర్థులకు కొన్ని సౌకర్యాల రూపంలో అందించాలి. నివేదిక తయారు చేసే సమయంలో దేశ ఆర్థిక పరిస్థితి ఎన్నికల ఫండింగ్‌కు పాక్షికంగానే సరిపోతుందని, పూర్తిస్థాయిలో నిధులు ఇవ్వడం సాధ్యం కాదని గుప్తా కమిటీ పేర్కొంది. ఈ నివేదికతో 1999 లా కమిషన్ ఏకీభవించింది. రాజకీయ పార్టీలు ఇతర వనరుల నుండి నిధులు తీసుకోకుండా నిషేధించినంత కాలం ఎన్నికలకు మొత్తం ఖర్చును ప్రభుత్వమే భరించాలని తన నివేదికలో చెప్పింది. అయితే, ఆ సమయంలో నెలకొన్న ఆర్థిక పరిస్థితుల కారణంగా పాక్షికంగా మాత్రమే ఫండింగ్ సాధ్యమవుతుందని లా కమిషన్ సైతం అంగీకరించింది. అదే సమయంలో దేశ ఖజానా నుంచి ఎన్నికల ఫండింగ్‌ను పొందేందుకు అవసరమైన కొన్ని నిబంధనలను ప్రతిపాదించింది. రాజకీయ పార్టీలు అంతర్గత ప్రజాస్వామ్యాన్ని అనుసరించి, అంతర్గత నిర్మాణాలు, ఖాతాలను నిర్వహించాలని, ఆడిటింగ్‌ను పూర్తి చేయించాలని స్పష్టం చేసింది. ఈ వివరాలను ఎన్నికల కమిషన్‌కు పంపాల్సి ఉంటుందని సూచించింది. సముచిత నియంత్రణ ఫ్రేమ్‌వర్క్‌కు లోబడి ఎన్నికల ఫండింగ్ జరగాలని తన నివేదికలో సిఫారసు చేసింది. కానీ, దురదృష్టవశాత్తు ఇలాంటి సిఫార్సులేవీ కార్యరూపం దాల్చలేదు. ఎన్నికలకు దేశ ఖజానా నుంచి సొమ్ము ఇవ్వాలన్న ప్రతిపాదనను రాజ్యాంగ పనిని సమీక్షించే జాతీయ కమిషన్ తోసిపుచ్చింది. లా కమిషన్ నివేదికతో కొంత వరకూ ఏకీభవించింది. అయితే, ముందుగా అందులో సూచించిన నియమ నిబంధనలను పాటించాలని, రాజకీయ పార్టీల నియంత్రణకు తగిన ఫ్రేమ్‌వర్క్‌ను తయారు చేసుకోవాలని స్పష్టం చేసింది. ఏదిఏమైనా, నికర ఫలితం ఏమిటంటే, ఈ సిఫార్సులు ఉన్నప్పటికీ, రాజ్య కోశాగారం నుంచి ఎక్కువ నిధుల కేటాయింపులు సంస్కరణల పరంగానే ఉన్నాయి. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, సమానత్వం, నిజాయితీ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చేవారు. లా కమిషన్ నివేదికకు సుమారు దశాబ్దం ముందు 'పాలనలో నైతిక విలువలు' (ఎథిక్స్ ఇన్ గవర్నెన్స్) పేరుతో పరిపాలనా సంస్కరణ కమిషన్ ఒక నివేదికను విడుదల చేసింది. అందులో ఎన్నికల్లో చట్టవిరుద్ధమైన, అవమానకరమైన నిధులను పరిమితం చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించింది. ఇందుకుగాను, ఎన్నికలకు పాక్షిక నిధులను దేశం అందించాలని సూచించింది. ఈ పాక్షిక నిధుల అంశం కూడా అమల్లోకి రాలేదు. బిజెపి ప్రభుత్వం ఎలక్టోరల్ బాండ్లను ప్రవేశపెట్టిన తర్వాత, కొన్ని రాజకీయ పార్టీల అక్రమ వసూళ్లకు రాజముద్ర పడింది. అధికార దుర్వినియోగం పెరిగింది. ఎలక్టోరల్ బాండ్లను సుప్రీం కోర్టు రద్దు చేయడంతో పరిస్థితి కొంతైనా చక్కబడుతుంది. బిజెపి ధనబలం కొంతవరకైనా తగ్గుతుంది. సుప్రీం కోర్టు తీర్పునేపథ్యంలో, మన దేశంలో ఎన్నికల నిధులపై పారదర్శకమైన విధానాలకు ప్రయత్నాలు జరగాలి. అన్ని రాజకీయ పార్టీలు ఈ విషయంలో చర్చించి, ఒక అవగాహనకు రావాలి. ఎన్నికల ఖర్చును కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియా భరించడం వల్ల ఒక స్పష్టత వస్తుంది. అధికారాన్ని అడ్డుపెట్టుకొని, అడ్డగోలు వసూళ్లకు బ్రేక్ పడుతుంది. ఒక్కసారిగా పరిస్థితి మారుతుందని చెప్పలేకపోయినా, ఎలక్టోరల్ బాండ్స్‌తో పోలిస్తే వెయ్యి రెట్లు సత్ఫలితాలను అందిస్తుంది.

(ఐపిఎ సౌజన్యంతో)




**బిజెపి ప్రభుత్వం ఎలక్టోరల్ బాండ్లను ప్రవేశపెట్టిన తర్వాత, కొన్ని రాజకీయ పార్టీల అక్రమ వసూళ్లకు రాజముద్ర పడింది. అధికార దుర్వినియోగం పెరిగింది. ఎలక్టోరల్ బాండ్లను సుప్రీం కోర్టు రద్దు చేయడంతో పరిస్థితి కొంతైనా చక్కబడుతుంది. బిజెపి ధనబలం కొంతవరకైనా తగ్గుతుంది. సుప్రీం కోర్టు తీర్పునేపథ్యంలో, మన దేశంలో ఎన్నికల నిధులపై పారదర్శకమైన విధానాలకు ప్రయత్నాలు జరగాలి.**

# కరువు కోరల్లో గాజా

ఇంటిగ్రేటెడ్ ఫుడ్ సెక్యూరిటీ ఫేజ్ క్లాసిఫికేషన్ (ఐపిసి) 18 మార్చి 2024న విడుదల చేసిన నివేదిక ప్రకారం గాజాలో మారణహోమం ఆగకపోతే మే 2024 నాటికి పాలస్తీనాలోని గాజా ఉత్తర ప్రాంతం కరువుకోరల్లో చిక్కు కుంటుందని, అలాగే మిగిలిన ప్రాంతం కూడా ప్రమాదకరంగా మారబోతుందని హెచ్చరించింది. ఐపిసి ప్రకటన గాజా ప్రజలు ఎదుర్కొంటున్న భయంకరమైన పరిస్థితిని ఎత్తిచూపింది. సంక్షోభానికి ముందు గాజాలో జనాభాకు సరిపోయినంత ఆహారం ఉండేది. 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో 0.8% మంది మాత్రమే తీవ్రమైన పోషకాహార లోపంతో ఉండేవారు. ఉత్తర ప్రాంతాలలో ఈ ఫిబ్రవరి నాటికి ఆ సంఖ్య 12.4%, 16.5% మధ్య ఉంది. ఇప్పుడు ప్రజలు చనిపోతున్నారు. ఇంకా చాలా మంది అనారోగ్యంతో ఉన్నారు. బయట నుండి ఎక్కువ ఆహారాన్ని అనుమతించకపోతే మిలియన్ మందికి పైగా ప్రజలు ఆకలి విపత్తు ఎదుర్కొంటారు. గాజాలో సగం మంది సుమారు 10 లక్షల ప్రజలు ఆహార భద్రతను కలిగిలేరు. ఉత్తర భాగం జనాభాలో 70 శాతం అంటే సుమారు 2,10,000 మంది కరువు విపత్తులో భాగం అవుతారు. మానవతా సంస్థలు పంపించే ఆహారంతో కూడిన ట్రక్కులను గాజాలోకి పంపించకుండా మోకాలడ్డుతున్న ఇజ్రాయిల్ దళాలు ఈ విపత్తుకు కారకులవుతారు. ఇప్పటికీ ఈ ప్రాంతాలలో సరిపడినంత తాగునీరు లభ్యంకావడం లేదు. పిల్లలు తినడానికి పెద్దలు తమ భోజనాన్ని తగ్గిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితి వేలాది మంది జీవితాలు, ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావాలను చూపుతుంది. తీవ్రమైన పోషకాహార లోపం వలన ఇతరేతర అంటువ్యాధులు సోకి పిల్లలు మరణిస్తున్నారు. పరిశుభ్రత, పారిశుద్ధ్య సేవల లోపం దీర్ఘకాలిక ప్రభావాలు చూపి పిల్లల మొత్తం ఎదుగుదలను నిరోధిస్తుంది. కరువు పరిస్థితులలో గాజా ప్రాంతంలో ప్రాణాలను రక్షించే శస్త్రచికిత్సలు లేకపోవడం, అవయవాలను కోల్పోయే జనాలు, క్యాన్సర్, డయాబెటిస్‌తో బాధపడుతున్న రోగులు, జన్మనిచ్చిన తల్లులు, నవజాత శిశువులు, అందరూ ఆకలితో బాధపడటం, దానిని వెంటాడే వ్యాధుల నుండి కోలుకోవడానికి ప్రయత్నించడం కరువు పరిస్థితులలో కలగొచ్చు. గాజాలో కరువు రాకుండా ఉండాలంటే ప్రపంచ దేశాలు దృష్టి పెట్టాలి. అన్ని కీలకమైన ఆసుపత్రులలో మరింత పోషకాహారం, స్థిరీకరణ కేంద్రాలను జోడించాల్సిన అవసరం ఉంది. స్థానికంగా పోషకాహార లోపాన్ని నివారించడానికి స్వచ్ఛంద కమ్యూనిటీలకు మద్దతు అవసరం. గాజా స్ట్రిప్‌కు మానవతావాద అందుబాటు పునరుద్ధరించేందుకు కృషి చేయాలి. అన్నింటికీ మించి యుద్ధం ఆగడానికి ఐక్యరాజ్యసమితితో పాటు ప్రాపంచిక దేశాలు ప్రయత్నించాలి.

— జనక మోహనరావు దుంగ
8247045230

# 'పేరిణి శివతాండవం'లో జీవించిన డాక్టర్ నటరాజ్ రామకృష్ణ

తెలుగువారి నాట్యకళల్లో నేడు విశ్వవ్యాప్తంగా ఖ్యాతిగాంచినది పేరిణి శివతాండవం. పేరిణి నృత్యం లేదా పేరిణి శివతాండవం అనేది తెలుగు వారి అందులో తెలంగాణ ప్రాంతం వారి ఒక ప్రాచీన, ఖ్యాతిగాంచిన నృత్యం. పూర్వ కాలంలో యుద్ధానికి వెళ్ళబోయే ముందు శివుడి ముందు ఈ నాట్యాన్ని ప్రదర్శించి, శివుని ఆశీస్సులు పొందేవారని చరిత్ర చెబుతోంది. ఓరుగల్లును పాలించిన కాకతీయుల కాలంలో ఈ కళ ఒక వెలుగు వెలిగింది. ఈ పేరిణి నృత్యరూపకం 3వ శతాబ్దంలో ప్రారంభమై, 12,13వ శతాబ్దాల నాటికి అనేక మార్పులు చెందుతూ కాకతీయుల కాలంలో మంచి ఆదరణ పొందింది. నేడు ఈ కళకు సంబంధించిన ఆధారాలు వరంగల్ దగ్గర లోని రామప్పదేవాలయ శిల్పకళలో, శిథిలావస్థలో ఉన్న అప్పటి కట్టడాలలో సజీవంగా చూడవచ్చు. కాకతీయుల తరం ముగియగానే ఈ కళ దాదాపుగా కనుమరుగై పోయింది. మళ్ళీ ఆంధ్ర నాట్య పితామహులుగా పిలవబడే 'ఆచార్య నటరాజ రామకృష్ణ' కృషితో మళ్ళీ వెలుగులోకి వచ్చింది. మార్చ్ 21 నటరాజ్ రామకృష్ణ జయంతి సందర్భంగా వారిని ఒకసారి గుర్తుకు తెచ్చుకుందాం.

పదవశతాబ్దంలో కాకతీయ సామ్రాజ్య కాలంలో ప్రాచుర్యంలో ఉన్న పేరిణి శివతాండవం నాట్యాన్ని పునరుద్ధరించిన గొప్ప కళాకారుడు రామకృష్ణ. రామకృష్ణ తల్లిదండ్రులు ఇండోనేషియాలోని బాలి ద్వీపానికి వలస వెళ్ళారు. రామకృష్ణ అక్కడే 1933 మార్చి 21న జన్మించాడు. తర్వాత వారి కుటుంబం నాగపూరుకు తిరిగివచ్చి స్థిరపడ్డారు. నటరాజ రామకృష్ణకు చిన్నప్పటి నుంచి నాట్యం పట్ల ఉన్న ఆసక్తి వల్ల తండ్రికి ఇష్టంలేనప్పటికి, ఎంతో కష్టపడి నాట్యం నేర్చుకొని, తాను రచించిన నాట్యకళా చరిత్ర పుస్తకానికి కేంద్ర ప్రభుత్వ పురస్కారాన్ని రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకునే ఉన్నత స్థితికి ఎదిగాడు. నటరాజ రామకృష్ణ ఎన్నో కష్ట పరిస్థితులను ఎదుర్కొని కళా సాధన చేసి, కుటుంబాన్నీ, సంపదల్నీ వదిలి నాట్యంకోసం జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు. రామకృష్ణ తన నాట్యకళ పరిణతి కోసం ఎందరో గురువులను కలుసుకొని, వారి నుండి ఎన్నో నాట్యరీతుల్ని నేర్చుకొని తనలోని తపనను నాట్య కళపట్ల ఉన్న ఆసక్తిని తెలియచేశాడు. 18 ఏళ్ళ వయసులో నాగపూరులో 'నటరాజ' అనే బిరుదును అందుకున్నప్పటి నుండి ఆయన పేరు నటరాజ్ రామకృష్ణగా శాశ్వతంగా ఉండి పోయింది.



కళాతరంగం

రామకృష్ణ రామప్ప దేవాలయంలోని శిల్పాలను చూసి ఉత్తేజితుడై, పేరిణి శివతాండవ నృత్యాన్ని పునరుద్ధరించాలని, జయపసేనాని రాసిన నృత్య రత్నావళి గ్రంథాన్ని ఇందుకు మార్గదర్శినిగా ఎంచుకుని అహర్నిశలు కష్టపడి నేటి పేరిణి శివ తాండవం రూపొందించాడు. ఈ నృత్యాన్ని రూపొందించడంలో ఆనాటి వీరశైవ సాంప్రదాయ పద్ధతులను పొందుపరుస్తూ, నాట్యంలో ప్రదర్శించే భంగిమలు, ముద్రలు అన్నీ కూడా యుద్ధ సన్నాహక సూచకంగా సైనికులను సన్నద్ధం చేసే విధంగా ఉండేలా చూసాడు.

పేరిణి నృత్యంలో పురుషులు చేసేదానికి 'పేరిణి తాండవ' మని, స్త్రీలు చేసే నృత్యాన్ని 'పేరిణి లాస్యం' అని అంటారు. కాకతీయుల కాలంలో ఆదరణను చూరగొన్న పేరిణి నృత్యం కాకతీయరాజుల సామ్రాజ్యం అనంతరం క్రమక్రమంగా కనుమరుగవుతూ వచ్చింది. కేవలం రామప్ప దేవాలయ 'నాగిని' శిల్ప భంగిమలలో నిక్షిప్తమై వుండిపోయింది. నటరాజ్ రామకృష్ణ దేశవిదేశాల్లో ఎన్నో నాట్య ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకులను మెప్పించారు. నటరాజ రామకృష్ణ రాసిన నలభై పైగా పుస్తకాలలో ఆరింటికి భారత ప్రభుత్వ పురస్కారం లభించింది. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీకి చైర్మన్‌గా ఉండి డాక్టర్ నటరాజ రామకృష్ణ యాభై ఏళ్ళ పాటు నాట్యకళను ముందుకు నడిపించాడు. నటరాజ రామకృష్ణ ఆంధ్రనాట్యం, పేరిణి నృత్యాల పురోగతికి, కళాకారులకు తోడ్పాటునందించాడు. నటరాజ రామకృష్ణ విశేష కృషి ఫలితంగా కొందరు శిష్యులు తయారు అయినా, ఆ శిష్యులకు మళ్ళీ శిష్యులు రూపొందక పోవడంతో పేరిణి నృత్యానికి అనుకున్నంత ఆదరణ లభించనప్పటికి, రాష్ట్ర ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలల్లో పేరిణి శివతాండవాన్ని పాఠ్య పుస్తకాలలో సిలబస్‌గా మాత్రం చేర్చారు. నటరాజ రామకృష్ణ రచించిన నాట్య పుస్తకాలు నృత్యకళాభివృద్ధికి తోడ్పడడమేకాక, నాట్య ప్రతిభకు ఎన్నో అవార్డులు, రివార్డులు పొంది 2011, జూన్ 7 న హైదరాబాదు లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. నాట్యకళామతల్లి ఉన్నన్ని రోజులు డాక్టర్ నటరాజ్ రామకృష్ణ పేరు చిరస్మరణీయం.

— గడప రఘుపతిరావు
9963499282

# జీవకోటి ఆరోగ్య ప్రదాతలు అడవులు

అడవులు, హరితవనాల వనరులు భూతవర్తమాన భవిష్యత్ తరాల సంపూర్ణ ఆరోగ్యానికి, వాతావరణ సానుకూల మార్పులకు, జీవవైవిధ్య పరిరక్షణకు, ప్రపంచ సుస్థిరాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఐరాస చేపట్టిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలైన పేదరిక నిర్మూలన, వాతావరణ సమతుల్యత, ఆర్థిక ప్రగతి, సామాజిక వికాసం, ఆరోగ్య ప్రయోజనాలు వంటి అంశాల సాధనకు అడవులు ప్రధాన భూమికను నిర్వహిస్తున్నాయి. అడవుల నరికివేత, హరిత సంపద తరుగుదల వల్ల విశ్వ మానవాళి ఉనికే ప్రమాదంలో పడనుంది. భూమాతకు ఊపిరితిత్తులుగా, కర్బన షోషణ (కార్బన్ సింక్‌లు) కేంద్రాలుగా అడవులు సకల జీవకోటికి ఎనలేని సేవలను అందిస్తున్నాయి. అడవుల పరిరక్షణ పట్ల సామాన్యులకు అవగాహన కల్పించే ప్రయత్నాలలో భాగంగా ప్రతి ఏటా 21 మార్చి రోజున ఐరాసలోని 'ఆహారం, వ్యవసాయ సంస్థ (ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్)' విభాగం నేతృత్వంలో 2013 నుంచి 'అంతర్జాతీయ అడవుల పరిరక్షణ దినం' జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ ఏడాది అంతర్జాతీయ అడవుల పరిరక్షణ దినం వేడుకలకు 'ఫారెస్ట్ అండ్ హెల్త్' అనే అంశాన్ని నినాదంగా తీసుకున్నారు. ఐరాస తీర్మానం ప్రకారం 2021– 2030 దశాబ్దాన్ని 'ఐరాస పర్యావరణ లేదా జీవావరణ వ్యవస్థ పునరుద్ధరణ దశాబ్దం'గా కూడా ప్రకటించడం జరిగింది. ఐరాస చోరవతో 2011 సంవత్సరాన్ని 'అంతర్జాతీయ అడవుల పరిరక్షణ సంవత్సరం'గా పాటించడం జరిగింది.

ప్రపంచవ్యాప్తంగా 1.6 బిలియన్ల గిరిజన ప్రజలు ప్రత్యక్షంగా ఆహారం, గృహాలు, శక్తి, ఔషధాలు, ఆదాయ వనరుల కోసం అడవులపై ఆధారపడి ఉన్నారు. ప్రపంచ అడవుల వల్ల 80 శాతం భూసంబంధ జీవవైవిధ్యం ఫలిస్తున్నది. విశ్వవ్యాప్తంగా ప్రతి ఏటా 13 మిలియన్ హెక్టార్ల (32 మిలియన్ ఎకరాలు) అడవులను నరికి వేయడం, దాదాపు 20 శాతం వరకు హరితగృహ వాయు ఉద్గారాలు వెలువడుతున్నాయి.

భూగోళంపై ఉన్న నేలలో కనీసం 30 శాతం అడవులు ఆక్రమించి ఉండాలి. ప్రతి ఏటా 2 బిలియన్ టన్నుల కార్బన్‌ను తొలగించవలసిన బృహత్ కార్యం అడవులు నిర్వహించాలి. అడవులు నరికివేసిన ఫలితంగా కరువు తాండవం చేస్తున్నది. ప్రభుత్వ యంత్రాంగం, పౌరుల ప్రమేయంతో నేడు దాదాపు 50 శాతం అడవుల నరికివేత తగ్గడం గమనించారు. అడవుల విస్తీర్ణం తగ్గిన ఫలితంగా ఏనుగులు, పులులు, ఎలుగుబంట్లు లాంటి క్రూరమృగాలు జనావాసాల్లోకి రావడం, ప్రజల పశువుల/మేకల/గొర్రెల ప్రాణాలు తీయడంతో జునోటిక్ వ్యాధులు సంక్రమించడం జరుగుతోంది.

**అడవుల పరిరక్షణ చర్యలు:**

అడవుల పరిరక్షణకు తీసుకోవలసిన చర్యల్లో భాగంగా ప్రణాళికాబద్ధంగా అడవుల నరికివేత, నరికిన చోట తిరిగి వనాలు పెంచడం, అడవులు కాలిపోవడాన్ని కట్టడి చేయడం, అడవులను పెంచడం, మానవ ఆవాసాలలో చెట్లు పెంచడం, ఇంటింటా హరిత తివాచీలు పరచడం, పోడు వ్యవసాయాన్ని నిషేధించడం, అడవుల రక్షణ, అక్రమ కలప/గంధం రవాణాను కట్టడి చేయడం, ప్రతి ఏటా పెద్ద ఎత్తున మొక్కలు నాటడం, వన్యప్రాణులను రక్షించుకోవడం, అటవీ ఉత్పత్తులతో ఆదాయం పెంచుకోవడం, అడవులను పర్యాటక స్థలాలుగా మార్చడం, కలప ఫర్నీచర్ వాడకం తగ్గించడం, పేపర్ వాడకాన్ని తగ్గించడం, ఒక చెట్టును నరికే ముందు 10 మొక్కలు నాటి పరిరక్షించడం లాంటివి వస్తాయి. మనిషి లేకుండా అడవులు మనగలుగుతాయి, కాని అడవులు లేకుండా మనిషి మనుగడ అసాధ్యమని మనందరికీ తెలుసు. అడవులను, హరిత తివాచీలను పరిరక్షించుకుందాం, పచ్చని సంసారాలను ప్రేమగా నిర్మించుకుందాం.

**(21 మార్చి 'అంతర్జాతీయ అడవుల పరిరక్షణ దినం')**

# డౌన్ సిండ్రోమ్‌తో మేధో వైకల్యం

డౌన్ సిండ్రోమ్ అనేది భౌతిక, మేధో అభివృద్ధిలో జాప్యం కలిగించే జన్యుపరమైన పరిస్థితి. ఇది ప్రతి 792 సజీవ జననాలలో ఒకరిలో సంభవిస్తుంది. డౌన్ సిండ్రోమ్ ఉన్న వ్యక్తులు సాధారణ 46కి బదులుగా 47 క్రోమోజోమ్‌లను కలిగి ఉంటారు. ఇది చాలా తరచుగా సంభవించే క్రోమోజోమ్ డిజార్డర్. డౌన్ సిండ్రోమ్ జాతి, జాతీయత, మతం లేదా సామాజిక ఆర్థిక స్థితికి సంబంధించినది కాదు. ఈ వ్యాధిగ్రస్తులలో 21వ క్రోమోజోములో రెండు ఉండాల్సిన పోగులు మూడు వుంటాయి. అందువలన దీనిని ట్రైసోమీ 21 అని కూడా పిలుస్తారు. దీనిమూలంగా పిల్లలలో భౌతికమైన పెరుగుదల మందగిస్తుంది. వీరి ముఖంలోని మార్పుల ఆధారంగా వ్యాధిని గుర్తించవచ్చును. వీరికి తెలివితేటలు చాలా తక్కువగా వుంటాయి. వీరి ఐక్యూ సుమారు 50 మాత్రమే (సగటు ఐక్యూ 100). 1866లో పూర్తిగా సిండ్రోమ్‌ను వర్ణించి వ్యాధిని కనుగొన్న బ్రిటీష్ వైద్యుడు జాన్ లాంగ్డన్ డౌన్ పేరు మీద ఈ వ్యాధిని డౌన్ సిండ్రోమ్‌గా పిలుస్తారు. డౌన్ సిండ్రోమ్ ఉన్న వారు దాదాపు భౌతిక, మేధో వైకల్యాలు కలిగి ఉంటారు. పెద్దలు, వారి మానసిక సామర్థ్యాలు సాధారణంగా 8 లేదా 9 ఏళ్ల వయస్సుతో పోలి ఉంటారు. వారు సాధారణంగా తక్కువ రోగనిరోధక పనితీరు కలిగి ఉంటారు. పుట్టుకతో వచ్చే హృదయ లోపం, మూర్ఛరోగం, లుకేమియా, థైరాయిడ్ వ్యాధులు, మానసిక రుగ్మతలు వంటి అనేక ఇతర ఆరోగ్య సమస్యలకు గురవుతారు. డౌన్ సిండ్రోమ్ కలిగే అవకాశాలను తగ్గించడానికి సరైన వయసులో వివాహం చేసుకోవడం, పిల్లల కోసం తగిన సమయంలో ప్లాన్ చేసుకోవడం ఎంతో కీలకం. మహిళల్లో పద్దెనిమిది ఏళ్లలోపు, 35 ఏళ్లు దాటిన తర్వాత వివాహాలైన సందర్భాల్లో పుట్టబోయే పిల్లలకు జన్యుపరమైన ఇతర లోపాలు తలెత్తే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ వ్యాధిపట్ల అవగాహన కల్పించుటకు ఏటా మార్చి 21న ప్రపంచ డౌన్స్ సిండ్రోమ్ దినోత్సవం జరుపబడుతోంది.

— సుధాకర్.ఎ.వి
రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి
స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్
9000674747

# టెట్ తెలుగు పేపర్ 3 నిర్వహించాలి

లేఖ

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే టెట్ లోపాలను సవరించాలని డిఇడి, బిఇడి, అభ్యర్థులకు అభ్యర్థులకు న్యాయం చేయాలి. టెట్ పేపర్ 2 తెలుగు భాషా పండితులకు సంబంధంలేని సోషల్ సబ్జెక్టు టెట్ లో 60 మార్కులు ఉండటంవల్ల చాలా నష్ట పోతున్నారు.. ప్రతిసారి టెట్ విషయంలో నష్టం జరుగుతుంది. భాషా పండితుల కోసం స్పెషల్ టెట్ తెలుగు పేపర్ 3 నిర్వహించాలి. పేపర్ 1 నుంచి 8వ తరగతి లోపు పేపర్ 2లో 10వ తరగతి లోపు ఉండేలా చూడాలని కోరుతున్నాము. టెట్ లోపాలు సవరించి న్యాయం చేయాలి. తెలంగాణ ప్రభుత్వం ఎస్ జి టి వారి కోసం పేపర్ 1 స్కూల్ అసిస్టెంట్ వారి కోసం పేపర్ 2 నిర్వహిస్తుందన్నారు. ఈ పరీక్ష విధానం వల్ల తెలుగు, హిందీ, ఉర్దూ భాషా పండితులకు అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. లాంగ్వేజ్ పండిట్ ల కోసం మన పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్, టెట్ తెలుగు పేపర్ 3 నిర్వహిస్తున్నది. అదేవిధంగా మన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా అవలంబించాలి. లాంగ్వేజ్ పండిట్ పేపర్ 2లో సంబంధం లేని సోషల్ స్టడీస్, మాథ్స్, సబ్జెక్టుకు సంబంధించి 60 మార్కులు ఉంటాయి. దీనితో టెట్ క్వాలిఫైకా లేకపోతున్నామని భాషా పండితుల కోసం ప్రత్యేకంగా టెట్ తెలుగు పేపర్ 3 నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం.

— దేవులపల్లి రమేశ్
ఉస్మానియా యూనివర్సిటీ,
9963701294

## తెలంగాణ రాష్ట్ర రోడ్లు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన సిపిఐ నాయకులు



**ప్రజాపక్షం/వనస్థలిపురం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా కార్పొరేషన్ చైర్మన్‌ను ప్రకటించడంతో ఎల్‌బి నగర్ నియోజకవర్గంకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి సభ్యులు మల్‌రెడ్డి రాంరెడ్డిని తెలంగాణ రాష్ట్ర రోడ్లు డెవలప్‌మెంట్ చైర్మన్‌గా ప్రకటించడంలో సిపి ఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహా బుధవారం వాని నివాసంలో మ ర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.



## ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆదిలాబాద్ పురపాలక సంఘం కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం కోరారు. ఈ మేరకు మున్సిపల్ పరిపాలన శాఖ డైరక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుంచి చాలిచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్న కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. డైరక్టర్‌ను కలిసిన వారిలో యూనియన్ నాయకులు వి.జైపాల్ రెడ్డి, ఎం.కాంతారావు, మెరుగు చిరంజీవి తదితరులు ఉన్నారు.

## చెత్త సేకరణకు నల్ల కవర్లు ఉపయోగించాలి



**ప్రజాపక్షం/ రాజేంద్రనగర్ :** కాలనీల్లో, బస్తీలల్లో ఊడ్చే సమయంలో చెత్త సేకరించేందుకు నల్ల కవర్లను ఉపయోగించాలని జిహెచ్ఎంసి చార్మినార్ జోనల్ కమీషనర్ వెంకన్న అధికారులను అదేశించారు. బుధవారం జిహెచ్ఎంసి రాజేంద్ర నగర్ సర్కిల్ 11 యందు శాస్త్రీ పురం డివిజన్‌లోని వట్టేపల్లి రోడ్‌లో శానిటేషన్ పనులను పరిశీలించేందుకు ఆయన డిప్యూటీ కమీషనర్ కె.రవి కుమార్‌తో కలసి ఆకస్మీక తనిఖీలు చేశారు. ఈసందర్భంగా జోనల్ కమీషనర్ వెంకన్న మాట్లాడుతూ శానిటేషన్ పనుల్లో ఊడ్చిన చెత్తను సేకరించేందుకు నల్ల కవర్లు ఉపయోగిస్తే కంటి చూపు నివారణకు దోహద పడుతుందన్నారు. నల్ల కవర్లను ఉపయోగించిన చెత్తను తప్పని సరిగా రామ్‌కి వాహనాలకు మాత్రమే అన్‌లోడ్ చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.ఈకార్యక్రమంలో పలువురు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాలనీల అభివృద్ధిల్లో సంక్షేమ వాసులదే కీలపాత్ర:లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/వనస్థలిపురం :** కాలనీల అభివృద్ధిల్లో కాలనీ వాసులదే కీలప్రాత అని బిఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బుధవారం డివిజన్‌లోని శ్రీరాం నగర్ కాలనీ సంక్షేమ సంఘం వాసులు కార్పొరేటర్‌కు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కోసం కృషి చేస్తామని, కాలనీల్లో నెలకొన్న సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని కాలని వాసులకు సూచించారు. త్వరలో కాలనీలో పర్యాటించి, కాలనీ సమస్యలు పరిష్కారం చేస్తామన్నారు. కాలనీ వాసుల సమాకారంతో కాలనీ అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం కాలనీ నూతన కార్యవర్గంను అభినంధించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఉపేందర్‌రెడ్డి, కోశాధికారి రవీందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి వెంకట్‌రెడ్డి, భూపతిరెడ్డి, రంగారెడ్డి, రాధకృష్ణ, కృష్ణ, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు సన్మానం



**ప్రజాపక్షం/ రాజేంద్రనగర్ :** తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ కో అపరేటివ్ ఫేడరేషన్ చైర్మేన్‌గా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి,రాజేంద్ర నగర్ సీనియర్ నాయకులు బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కట్ట జగన్ మాదిగ,కార్యదర్శి పుట్లగారి గణేష్ మాదిగ మ ర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారంత జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను శాలుతో ఘనంగా సత్కరించి పూల బొక్కెను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు గుండాడ రవి మాది గ, ఎద్దకాడి రాజు,తరుణ్ మాదిగలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లోనే బాలింతలకు పౌష్టికాహారం



**ప్రజాపక్షం/వనస్థలిపురం :** గర్బిణీ బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల్లోనే పౌష్టికాహారం లభిస్తుందని ఐసిడిఎస్ సైపర్వైజర్ నారాయణమ్మ అన్నారు. బుధవారం హస్తినాపురంలోని భూపేష్ గుప్తా నగర్ అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోషణ కార్యక్రమంను స్థానిక మాజీ వార్డు మెంబరు సయ్యద్ పాష, కమిటీ సభ్యులు నాగేశ్వరరావుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళలు గర్బిణీ, బాలింతలు, కిషోర బాలికలకు ప్రభుత్వం అందించే పోషకాహారం తీసుకోవాలని సూచించారు. వాటిలోనే విటమిన్‌తో కూడిన పదార్థాలు ఉన్నాయని, వాటి ద్వారా రక్తహీనత రాకుండా ఉంటాయని, పండ్లు, ఆకుకూరలు చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా చిన్నాపిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు అనంతలక్ష్మి, రేణుక, వరలక్ష్మి, రేణుక, భాగ్యలక్ష్మి, ఆశా వర్కర్లు ధనమ్మ,తదితరులు ఉన్నారు.

## సూర్యప్రకాష్‌కు పిహెచ్‌డి ప్రదానం

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో పరిశోధనాపత్రం సమర్పించిన ఎస్.సూర్యప్రకాష్‌కు పి.హెచ్.డి పట్టా ప్రదానం జరిగింది. 'సర్వీస్ క్వాలిటీ ఇన్ ఇన్సూరెన్స్ కంపెనీస్ ఇన్ తెలంగాణ' అనే అంశంపై పరిశోధనా పత్రం సమర్పించినందుకు ఆయనకు పి.హెచ్.డి ప్రదానం జరిగిందని బుధవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఒక ప్రకటనలో ఈ విషయాన్ని తెలియజేసింది. ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ ఐ.ఆనంద్ పవార్ పర్యవేక్షణలో ఈ పరిశోధనా పత్రాన్ని సమర్పించినట్లు వెల్లడించారు.

## చేపల వేటకు వెళ్లి ఇద్దరు దుర్మరణం

కొత్తూర్ మండలం గూడూర్‌లో ఘటన..

**ప్రజాపక్షం/కొత్తూర్ :** చేపల వేటకు వెళ్లి ఇద్దరూ దుర్మరణం చెందిన సంఘటన కొత్తూర్ మండల పరిధిలోని గూడూర్‌లో జరిగింది. స్థానికులు, కుటుం బ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గూడూర్ గ్రామానికి చెందిన కిష్ట య్య, వెంకటేష్‌లు ఇద్దరు కలిసి గ్రామ శివారులో ఉనన ఉప్పరోని కుంట ద గ్గరకు చేపలను పట్టేందుకు వెళ్లి నీటిలో మునిగి మరణించారు. సమచారం తె లుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి మృత దేహాలను వెతికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమితం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం విడుదల చేసిన నేపథ్యంలో ఆయా రాజకీయ పార్టీ నాయకులు ఎన్నికల కమిషన్ నిబంధనలను కచ్చితంగా పాటించి ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం (09) రిటర్నింగ్ అధికారి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కోరారు. బుధవారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎఆర్ఒలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 16న ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్ జారీచేసిందని, ఏప్రిల్ 18న నోటిఫికేషన్ జారీ, 25న నామినేషన్ స్వీకరణకు చివరి తేదీ కాగా, 26న నామినేషన్ల స్క్రూటినీ, 29న నామినేషన్ల ఉపసంహరణ, మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ జరుగనున్నదని తెలియజేశారు. హైదరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్స్‌లో 3 ఫ్లయింగ్ స్క్వాడ్స్ మూడు షిఫ్టలలో ఎస్.ఎస్.టి, వి.ఎస్.టి, వ్యయ పరిశీలన టీమ్స్ పనిచేస్తాయని కలెక్టర్ అనుదీప్ వివరించారు. నగదు రవాణా, అక్రమ మద్యం అరికట్టేందుకు ఆర్‌టిఎ, ఆదాయపు పన్ను శాఖ, ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, జిఎస్‌టి, కస్టమ్స్, నార్కోటిక్స్ అధికారులు, పోలీస్ అధికారులను ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉంచినట్లు తెలియజేశారు. రాజకీయ పార్టీలకు, నాయకులకు వారు ఏర్పాటు చేసే సమావేశాలకు 'సువిధ' యాప్ ద్వారా అనుమతులు అందజేస్తామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చినందున కులం, మతం, ప్రాంతంపై విద్వేషాలు రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం నిషేధమన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, తప్పుడు ప్రచారం చేయడంపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అడ్వర్టైజ్‌మెంట్లు, ప్రకటనల కోసం ఎం.సి ఎం.సి దరఖాస్తు చేసుకుని అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎన్నికలలో అక్రమాలు జరిగితే 1950 నెంబర్ ద్వారా , సి విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, ఫోటోలు ప్రభుత్వ కార్యాలయంలో 24గంటల వ్యవధిలో, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, పెట్రోల్ బంక్‌ల వద్ద ఉన్నవి 48గంటల వ్యవధిలో తొలగిస్తామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం 1951ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగేలా వివిధ రాజకీయ పార్టీలు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ అనుదీప్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు జి.నిరంజన్ (కాంగ్రెస్), సయ్యద్ ముషీర్ అహ్మద్ (ఏఐఎంఐఎం), పి.అజయ్‌సింగ్, వి.ఎస్ భరద్వాజ,టి.యమన్‌సింగ్, కొల్లూరు పవన్‌కుమార్, బిఆర్ఎస్‌కె.వాసుదేవరెడ్డి, ఎస్.రవీందర్, కళ్యాణి నందేష్, జి.శివరాజ్‌సింగ్ (బిఎస్‌పి), అబ్బాస్, విఠల్ (సిపిఐఎం), పి.రాజేష్‌కుమార్ (తెలుగుదేశం), ఎఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

# క్రిడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట






**ప్రజాపక్షం/హైదరాబాద్ :** క్రిడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని, స్వాతంత్ర్య సమర యోధుడు భగత్ సింగ్ పేరిట టోర్నమెంట్ నిర్వహిస్తున్న ఎఐవైఎఫ్ నేతలను హైదరాబాద్ జిల్లా యువజన, క్రిడల శాఖ కార్యదర్శి సుధకార్ రావు అభినందించారు. ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని క్రికెట్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన భగత్ సింగ్ మెమోరియల్ టోర్నమెంట్‌కు సుధాకర్ రావు ముఖ్య అతిధిగా, అతిధులుగా ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ఉస్మానియా విశ్వవిద్యాలయ ఫిజికల్ డైరెక్టర్ రాజేష్ కుమార్ హాజరయ్యారు. మూడవ రోజు జరిగిన ఫైనల్స్‌లో గెలుపొందిన క్రిడాకారులకు ట్రోఫీ, సర్టిఫికెట్‌లు, మెడల్స్ బహూకరించారు. ఈ సందర్భంగా సుధాకర్ రావు మాట్లాడుతూ క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం పూర్తిగా ఉంటుందన్నారు. గ్రామీణ స్థాయి నుండే క్రిడలను ప్రోత్సహించి, అధిక నిధులు కేటాయిస్తామన్నారు. విజేతగా గెలుపొందిన శంషాబాద్ ఇంఫాంట్ కళాశాల క్రిడాకారులను అభినందించారు. రన్నరప్‌గా గౌతమి కళాశాల విద్యార్థులు గెలుపొందారన్నారు. వలి ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ క్రికెట్‌ను వ్యాపారమయం చేస్తున్న ఐపిఎల్‌ను రద్దు చేయాలన్నారు. కేవలం డబ్బులు ఉన్న బడా వ్యక్తులకు మాత్రమే అవకాశాలు వచ్చేలా ఉన్న వ్యవస్థను రూపుమాపాలన్నారు. ఎఐవైఎఫ్ ద్వారా క్రిడాకారుల సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర, ఉపాధ్యక్షులు టి. సత్య ప్రసాద్, హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్. బాలకృష్ణ, నెర్లకంటి శ్రీకాంత్, జిల్లా నాయకులు నేతలు మాజీద్, కళ్యాణ్, అనిల్, మహేష్‌లతో పాటు 12 జట్ల క్రిడాకారులు పాల్గొన్నారు.

# రాష్టంలో టిఆర్‌ఎస్ ఖాళీ ఖాయం

షాద్‌నగర్ ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** రాష్టంలో టిఆర్ఎస్ పార్టీ ఖాళీ కావాడం ఖాయం అని షాద్‌నగర్ ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం షాద్‌నగర్‌లో పట్టణంలో వి కన్వెషన్ హాల్‌లో ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎంఎల్‌సి అభ్యర్థిగా జీవన్ రెడ్డిని తప్పని సరిగా గెలిపించాలని పేర్కొన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో 171 ఎంఎల్‌సి ఓట్లు ఉన్నాయని వివరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో తప్పని సరిగా ఎంపి గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్టంలో టిఆర్ఎస్ పార్టీ, బిజెపి పార్టీలను ప్రజలు నమ్మవద్దని చెప్పారు. టిఆర్ఎస్ పార్టీ అబ్ధాలు చెప్పి తెలంగాణను అప్పుల పాలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు దక్కుతుందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉన్న నిరుపేదలకు ఎలాంటి న్యాయం చేయలేదని వివరించారు. దేశ సంపదను ఇతరులకు విక్రహించేందుకు కృషి చేస్తున్నట్లు ధ్వజమెత్తారు. దేశం అర్థికంగా అభివృద్ధి చెందాలంటే కేంద్రంలో తప్పని సరిగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం, జెడ్‌పిటిసిలు విశాల్, శ్రావణ్, మాజీ జెడ్‌పిటిసి శ్యామ్ సుదర్ రెడ్డి, అలిఖాన్, బాబర్, వివిధ గ్రామాల ఎంపిటిసిలు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

### వంశీ చందర్ రెడ్డిని గెలిపించేందకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**ప్రజాపక్షం/కొత్తూర్ :**ఎంపి అభ్యర్థి వంశీ చందర్ రెడ్డిని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని షాద్‌నగర్ ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరుక్‌నగర్ మండల పరిధిలోని కొండన్నగూడ గ్రామానికి చెందిన టిఆర్ఎస్ నాయకులు మల్లేష్ యాదవ్, మహిపాల్ రెడ్డి మండల రైతు సమన్వయ కమిటి సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ కార్యకర్త సైనికునిలా ప్రజలకు పని చేయాలని చెప్పారు. పార్టీలో చేరిన వారు మాజి సర్పంచ్ విజయలక్ష్మి, యశోద, రాములు, మాజి సర్పంచ్ వెంకట్‌రాం రెడ్డి , కేతవత్ శంకర్, అంజిరెడ్డి, బూపాల్ రెడ్డి, సురేందర్ రెడ్డి, హరిష్ రెడ్డి, కృష్ణారెడ్డి, యాదిరెడ్డి, సత్తయ్య గౌడ్, రవీందర్ నాయక్‌లతో పాటు 65 మంది వరకు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

# కాసాని జ్ఞానేశ్వర్ గెలుపునకు కంకణబద్ధులై పని చేయాలి

మాజీ మంత్రి, మహేశ్వరం ఎంఎల్‌ఎ పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :**బిఆర్ఎస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపు లక్ష్యంగా ప్రతి కార్యకర్త కంకణ బద్ధులై పని చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎంఎల్‌ఎ పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం శంషాబాద్ లోని బిఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి అధ్యక్షతన రానున్న ఎంపి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి,ఎంఎల్‌ఎ సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కెసి ఆర్ ప్రకటించిన అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ఒక్కతాటిపైకి వచ్చి కృషి చేస్తున్నట్లు తెలిపారు.పదేళ్లు పాలించి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్న బిజె పి,మూడు నెలల్లోనే ప్రజల్లో నమ్మకం కోల్పోయి విమర్శలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు ఓటుతో తీర్పు చెప్పటానికి సిద్ధంగా ఉన్నారన్నారు.కెసిఆర్ ని నేరుగా ఎదుర్కొనలేక మోడీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తు,అక్రమ కేసులు బనాయిస్తుందన్నారు. న్యాయ వ్యవస్థ మీద మాకు ప్రగాఢ నమ్మకం ఉందని,ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందని సబితా ఇంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు.నల్లధనం తెచ్చి ప్రతి ఒక్కరి అకౌంట్ లో 15 లక్షలు ఇస్తానని, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మొత్తం 20 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా కొత్తవి ఇవ్వక పొగ,ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటు పరం చేస్తూ ఉన్న ఉద్యోగాలు తీసేశారన్నారు. నల్లా చట్టాలు వ్యతిరేకించినందుకు, మోటర్లకు మీటర్లు గొంతులో ప్రాణము ఉన్నంత వర కు పెట్టబోనని కెసిఆర్ చెప్పినందుకు కక్ష పెంచుకొని,నాడు కేంద్రం రాష్టానికి ఒక రూపాయి కూడా ఇవ్వలేదన్నారు.కాంగ్రెస్ పార్టీ ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. అందరూ రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ఎంపి అభ్యర్థులను గెలిపించుకుని సత్తా చాటాలన్నారు. రాజేంద్ర నగర్ నియోజకవర్గంలోని రంగారెడ్డి బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో చేవెళ్ల బిఆర్ఎస్ పార్టీ ఎంపి అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌తో కలిసి జరిగిన సమావేశం లో ఎంఎల్‌సిలు సురభి వాణిదేవి,దయనంద్ గు ప్తా, ఎంఎల్‌ఎలు ఆరెకపూడి గాంధీ ,ప్రకాష్ గౌడ్, కాలే యాదయ్య, మాజీ ఎంఎల్‌ఎ అంజయ్య యాదవ్ ,డిసిఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి , యువ నేత కార్తీక్ రెడ్డి, పాల్గొన్నారు.

## టెట్ అర్హత పరీక్షపై టి-సాట్ ప్రత్యేక లైవ్ కార్యక్రమం

టి-సాట్ సిఇఒ వేణుగోపాల్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం నిర్వహించబోయే టెట్ (టీచర్స్ ఎలిజిబిలిటి టెస్ట్) పరీక్షపై అవగాహన కల్పించేందుకు టిసాట్ నెట్‌వర్క్ ఛానళ్లు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు సిఇఒ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీ గురువారం మధ్యాహ్నం 3 గంటల నుండి 4 గంటల వరకు టిసాట్ నిపుణ ఛానల్‌లో ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అనుభవం కలిగిన ఫ్యాకల్టీచే నిర్వహించే లైవ్ కార్యక్రమాల్లో మొదటి రోజు కెమిస్ట్రీ సబ్జెక్ట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 10 రోజుల పాటు 10 సబ్జెక్టులపై జరిగే ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాల్లో టెట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ అనుమానాలను నివృత్తి చేసుకోవాలన్నారు. లైవ్ ప్రసారాలతో పాటు రికార్డింగ్ పాఠ్యాంశాలు టిసాట్ నిపుణ ఛానళ్లతో పాటు టిసాట్ యాప్, యూట్యూబ్‌లోనూ అందుబాటులో ఉంటాయని తెలిపారు. అభ్యర్థులు తమ తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు 040 23540326, 726, టోల్ ఫ్రీ 1800 425 4039 నెంబర్‌లకు కాల్ చేయాలని వేణుగోపాల్ రెడ్డి సూచించారు.

క్రిస్టియన్ పేరుతో ఫోటో ఉన్నది

## 'దళితక్రైస్తవ రిజర్వేషన్ బిల్లు' ఎన్నికల ప్రణాళికలో పొందుపర్చాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు క్రిస్టియన్ డెమోక్రటిక్ మూవ్‌మెంట్ ప్రతినిధులు విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** క్రైస్తవుల సమస్యల పరిష్కార అంశాన్ని కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల ప్రణాళిక అంశంలో పొందపర్చేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని క్రిస్టియన్ డెమోక్రటిక్ మూవ్‌మెంట్ ప్రతినిధులు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావును విజ్ఞాప్తి చేశారు. జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ సూచన మేరకు దళిత క్రైస్తవులకు ఎస్‌సి రిజర్వేషన్ అవకాశాన్ని కల్పించేలా ''దళితక్రైస్తవ రిజర్వేషన్ బిల్లు'' అంశాన్ని పొందుపర్చాలని, క్రైస్తవులకు దాడుల నుండి రక్షణ కల్పించేలా చట్టం చేయాలని, మత మార్పిడి నిరోధక బిల్లును రద్దు చేయాలని వారు కోరారు. ఈ మేరకు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కె.ఏసురత్నం, క్రిస్టియన్ డెమోక్రటిక్ మూవ్‌మెంట్ అధ్యక్షుడు పి.ఎ.మెల్కిసెడెక్, ఉపాధ్యక్షులు టి.సి.క్రిస్టఫర్ సుధాకర్, కో ఆర్డినేటర్లు ఇ.అల్‌బర్ట్ కురేష్ తదితరుల బృందం హైదరాబాద్‌లోని మగ్ధుంభవన్‌లో కూనంనేని సాంబశివరావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రైస్తవులకు చర్చి నిర్మాణ సమయంలో నియమ, నిబంధనలు సులభతరం చేయాలని, ప్రభుత్వ బంజరు భూమిని పేద క్రైస్తవ పాస్టర్ల ఇంటి స్థలాలు కేటాయించాలని, వారి కుటుం బ సభ్యులకు ఆరోగ్య బీమా సౌకర్యాన్ని కల్పించాలని కోరారు.

## ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత : శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/ రాజేంద్రనగర్ :** ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత కల్గుతుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎంఎల్‌ఎ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన అత్తపూర్ డివిజన్‌లో శ్రీఎం మిత్ర మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణ భగవానుడి పూజ యాత్ర ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహాకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దైవ చింతనకు కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. ఈకార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు విజయ్ కుమార్,పవన్,జగదీష్,పాండు యాదవ్,శంకర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

**ప్రజాపక్షం :** 1974లో అంటే ఇప్పటికీ సరిగ్గా 50 సంవత్సరాల క్రితం పదవ తరగతి చదివిన విద్యార్థులు బుధవారం తాము చదివిన ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల సుల్తాన్ బజార్‌లో కలుసుకొని పాఠశాలలో తమ అనుభవాలు అనుభూతులు పంచుకున్నారు. తాము చదివినప్పటి భవనం లేనందుకు బాధను వ్యక్తపరచారు. తమకు పాఠం చెప్పిన బ్రహ్మయ్య(లెక్కలు), వరదాచార్యులు(తెలుగు), రాజారత్నం(జీవ శాస్త్రం), దామోదర్(సైన్స్), సింగనాచార్య(ఆంగ్లం), సర్దార్ సింగ్(హిందీ), శ్రీరాములు(సామాజిక శాస్త్రం) మొదలైన గురువుల బోధన గురించి విశేషంగా చెప్పుకున్నారు. ఈ పూర్వ విద్యార్థుల సంఘానికి కొత్తగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా డాక్టర్ రాపోలు సుదర్శన్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ జి.రహీం, బి మధుసూదన్, ఏం సేతుపతి, ప్రధాన కార్యదర్శిగా సి. వెంకటేష్, సహాయ కార్యదర్శులుగా ఆర్.ఎం ద్వారకనాథ్, బి. రుశిరాజ్, కోశాధికారిగా వై మురళి గారలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



## ఉచిత వైద్యశిబిరాలు అభినందనీయం



ప్రజాపక్షం/చర్లపల్లి: ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించడం అభినందనీయమని ఉప్పల్ ఎంఎల్ఎ బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని నాగార్జుననగర్ కాలనీలోని సన్‌సీడ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఎంఎల్ఎ ప్రారంభించారు. పేదవారు ఉచితంగా నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, సామాజిక బాధ్యతతో సేవలందిస్తున్న యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఆసుపత్రి నిర్వాహకులు అన్వేష్, డాక్టర్లు భానుచందర్, స్వాతి, పావనీ, లయన్స్ ప్రతినిధులు హరీష్‌రెడ్డి, శ్రీదేవి,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు



ప్రజాపక్షం/నాగారం : ప్లాస్టిక్‌ను వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో పర్యటించారు. నాలా వద్ద పేరుకుపోయిన చెత్తను పరిశీలించి మున్సిపల్ సిబ్బందితో క్లీనింగ్ చేయించారు. షాపులలో తనిఖీలు నిర్వహించి 120 మైక్రాన్ కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ వినియోగిస్తున్న షాపులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డోర్ టు డోర్ వద్దకు వచ్చే ఆటోలలో చెత్త వేయాలని, షాపుల్లో ప్లాస్టిక్‌ను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలి : క్రిస్టినాచోంగ్తు



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: మేడ్చల్ జిల్లాలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు కోసం అవసరమైన ఖచ్చితమైన ప్రణాళికలు రూపొందించి ప్రతిపాదనలు పంపాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ వైద్య కళాశాల స్థాపనకు సంబంధించి ఏర్పాట్ల విషయమై డిఎంఇ డా. వాణి, జిల్లా కలెక్టర్ గౌతం, అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్యలతో కల్సి సమావేశం నిర్వహించారు. అనంతరం ఆల్వాల్‌లో నిర్మాణంలో ఉన్న టిమ్స్ హాస్పిటల్ నిర్మాణ పనులను వారంతా కల్సి పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులు ఎప్పటి వరకు పూర్తి చేస్తారని ప్రశ్నిస్తూ త్వరితగతంగా పూర్తి చేయాలంటూ వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు సంబంధిత అధికారులను ఆదేశించారు.

## ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్‌కు శ్రీనివాస్‌రెడ్డి శుభాకాంక్షలు



ప్రజాపక్షం/పోచారం : తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ప్రీతమ్‌ను పోచారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీఅధ్యక్షులు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ మెట్టు గణేష్ యాదవ్, పోచారం మున్సిపాలిటీ ఎస్సీసెల్ అధ్యక్షుడు ఎర్ర రాజు, పలువురు సినియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పనులు ప్రారంభం



ప్రజాపక్షం/శామీర్‌పేట : మూడుచింతలపల్లి మండలం అనంతారంలో డిఆర్‌డివొ సాంబశివరావు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామి పనులను బుధవారం ప్రారంబించారు. అలాగే శామీర్‌పేట మండల కేంద్రంలోని నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉపాధిహామీ కూలీలకు పనిదినాలను కల్పించాలని అన్నారు. జాబ్‌కార్డులు లేని వారిని గుర్తించి జాబ్‌కార్డులు ఇప్పించాలని అన్నారు. వేసవికాలం కావడంతో ఉపాధిహామీ పనులు చేసే కూలీలకు మంచినీరు. టెంట్ సదుపాయాలు కల్పించాలని చెప్పారు. నర్సరీల్లో అవసరమైన మేరకు మొక్కలను నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో మమతబాయి, ఈసి సూర్య, టిఏ ఖాదీర్, వెంకట్, ఫీల్డ్ అసిస్టెంట్ గురువేష్, తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మైనంపల్లి



ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి: మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు బుధవారం నాడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ మల్కాజ్‌గిరి పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం సమిష్టిగా కృషి చేస్తామని సిఎం తెలిపామని అన్నారు. మైనంపల్లి తోపాటు మల్కాజ్‌గిరి కాంగ్రెస్ నాయకులు చెన్నారెడ్డి కూడా సిఎంను కలిశారు.

### టీ సెంటర్ ప్రారంభించిన మైనంపల్లి

గౌతమ్‌నగర్ డివిజన్‌లోని సంజయ్‌నగర్‌లో జామ్దర్స్ టీ సెంటర్‌ను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, నిర్వాహకులు సురేష్, ఈశ్వర్, సునందరావు, లక్ష్మి, రేవతి, నాయకులు వెంకటేష్ యాదవ్, జివిఎస్ సతీష్ కుమార్, వైనాల ప్రవీణ్, ఫరీద్, రాంచందర్, బికె శ్రీనివాస్, పిట్టల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి 23న చివరితేదీ

ప్రజాపక్షం/బంట్వారం : తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 6,7,8,9 తరగతులలో మిగిలిన సీట్లను భర్తీ చేయుటకు 2024–25 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ ద్వారా ధరఖాస్తూ చేసుకునేందుకు చివరి తేది మార్చి 23 వరకు ధరఖాస్తూ చేసుకునేందుకు అవకాశం ఉందని, బంట్వారం (తొలుకట్ట) గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉషరాణి ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల ప్రవేశ పరీక్ష తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సూచించిన పరీక్ష కేంద్రాల్లో ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాల కోసం tswries,inలో వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ తప్పక వినియోగించుకోవాలని తెలిపారు.

# స్వేచ్ఛాయుత వాతావరణంలో పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాట్లు

### కలెక్టర్ నారాయణరెడ్డి



ప్రజాపక్షం :వికారాబాద్ ప్రతినిధి : పార్లమెంటు ఎన్నికలను జిల్లాలో పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను అదేశించారు. బుధవారం ఐడిఓసి, సెక్టరియల్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వలేయన్, వీడియో వివింగ్‌సర్వేలైన్స్ బృందాలతో కలెక్టరేట్‌లో కలెక్టర్ సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. పార్లమెంటు ఎన్నికల షెడ్యుల్ ఈనెల 16న విడుదల అయిందున, అప్పటి నుండి జున్ 6వరకు ఎన్నికల కోడ్ నిబంధనలు అమల్లోకి వచ్చినందున జిల్లాలో వికారాబాద్, కొడంగల్, పరిగి, తాండూర్ నియోజకవర్గలలో ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. ఎన్నికల కోడ్‌ప్రతి పార్టీకి సమానంగా వర్తిస్తుందన్నారు. నిఘా బృందాలు తమకు కేటాయించిన ప్రదేశాల్లో పకడ్బంధీగా విధులు నిర్వహించాలన్నారు. ఏఆర్‌ఓలు, పోలీస్‌అధికారులు తమ పరిధిలోని ప్రతి ఒక్క పోలింగ్ కేంద్రాన్ని సందర్శంచి, మౌలిక సదుపాయాల పరంగా, భద్రతా పరంగా చేపట్టాల్సిన చర్యల గురించి కార్యాచరణ రూపొందుచుకోవాలన్నారు. ఎవరి పరిధిలోనైన ఫర్మిషన్ లేకుండా ర్యాలీలు, సభలు, సమావేశాలు జరగడానికి వీలులేదన్నారు. 85 సంవత్సరాలు పైబడిన వారికి, దివ్యంగులకు హోం ఓటింగ్ నిమిత్తం ఫారం 12డిలను ఇంటింటికి అందజేసి రసీదు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్‌పి కోటిరెడ్డి మాట్లాడుతూ స్వేచ్ఛా, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ నగదు రవాణా, లిక్కరు రవాణా నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో 6ఎఫ్ఎస్టి, 6ఎస్ ఎస్ఎస్టి , 2టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 24గంటలు నిఘా ఉంచినట్లు తెలిపారు. సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. అన్ని నిబంధనలు పాటించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యానాయక్, ఆర్‌డిఓ వాసుచంద్ర, జెడ్పి సిఇఓ సుధీర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### 'పది' పరీక్షలో పొరపాట్లు జరగొద్దు

గత అనుభవాలను దృష్టిలో పెట్టకొని ఎలాంటి పొరపాట్లుకు తావ్వికుండా పదో తరగతి పరీక్షలు సజావుగా జరగేలా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ అదేశించారు. ముఖ్యంగా తహసీల్దార్లు పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని, సిసిరోడ్లుకు సంబంధించిన పెండింగ్ ఉన్న పనులన్ని పూర్తిచేయాలని, ఎన్ఆర్‌జిఎస్ వ్యవస్థను బలోపేతం చేయించాలని కలెక్టర్ తెలిపారు.

### మీడియా సెంటర్ ప్రారంభం

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నారాయణరెడ్డి మీడియా సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. ఎన్నికల సంఘం అదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియాలో సర్టిఫకేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎన్నికలు పారదర్శకంగా నిష్పక్షపతంగా నిర్వహించడానికి మీడియా సహకరం అందించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా పౌరసంబందాల అధికారణి చెన్నమ్మ, ప్రభాకర్ సిబ్బంది పాల్గొన్నారు.



## మేయర్‌ను కలిసిన బిఆర్‌ఎస్ ఎంపి అభ్యర్థి లక్ష్మారెడ్డి



ప్రజాపక్షం/బోడుప్పల్: ఫిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గం బిఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఫిర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పార్లమెంటు ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఏంపల్ల అనంతరెడ్డి, నాయకులు లేతాకుల రఘుపతిరెడ్డి, బండారి రవీందర్, జావిద్‌ఖాన్, మల్లం వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ సరఫరా చేసే ముఠాలను అణచివేస్తాం

### రాచకొండ సిపి తరుణ్ జోషి



ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి: నిషేధిత మత్తు పదార్థాల వాడకం అనేది సమాజానికి పట్టిన చీడపురుగు వంటిదని, డ్రగ్స్ వినియోగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని రాచకొండ సిపి తరుణ్ జోషి అన్నారు. డ్రగ్స్ సరఫరా, రవాణా, వినియోగంపై ఉక్కు పాదం మోపుతామని తెలిపారు. డ్రగ్స్ కేసుల దర్యాప్తులో అనుసరించాల్సిన విధానాల మీద రాచకొండ పోలీసు సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ మత్తు పదార్థాల బారిన తెలిసీ తెలియక పడిన యువత వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. నిషేధిత డ్రగ్స్ వాడకం వల్ల ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. తమ పిల్లల జీవితం నాశనం కాకుండా తల్లిదండ్రులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్‌డిపిఎస్ చట్టం అమలు తీరు పట్ల దర్యాప్తు అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. దర్యాప్తు విధి విధానాలను పాటించి నేరస్తులకు గరిష్ట స్థాయి శిక్షలు పడేవిధంగా చూడాలని అన్నారు. చెక్‌పోస్టుల వద్ద క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని, ప్రత్యేక ఎస్ఓటి బృందాలను ఏర్పాటు చేసి చేపడుతున్న ఆపరేషన్ల ద్వారా ఎన్నో గంజాయి, ఓపియం, హెరాయిన్ వంటి నిషేధిత మత్తు పదార్థాలను సరఫరా చేసే ముఠాలను పట్టుకుని కేసులు నమోదు చేయడం జరిగిందని పేర్కొన్నారు. మత్తు పదార్థాలను సేవించడం వల్ల కలిగే అనర్థాలను కళాశాలల్లో ప్రచార కార్యక్రమాల ద్వారా వివరించాలని సూచించారు. సమావేశంలో డిసిపి క్రైమ్ అరవింద్‌బాబు, కస్టమ్స్ అండ్ ఎక్సైజ్ అప్పీలెట్ ట్రిబ్యునల్ ప్రతినిధి రంగనాథం, ఏసిపి సిసిఆర్బీ రమేష్, ఐటి సెల్ ఏసిపి నరేందర్‌గౌడ్, ఇన్‌స్పెక్టర్లు, రాచకొండ స్టేషన్ రైటర్లు పాల్గొన్నారు.

# ఉపాధి అవకాశాల కల్పనకు కృషి



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: తెలంగాణా ఉద్యమకారుడిగా, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రిగా మల్కాజిగిరి ప్రాంతవాసులతో మమేకమై ఉన్న తనను రానున్న పార్లమెంటు ఎన్నికల్లో గెలిపిస్తే ఉపాధి అవకాశాల కల్పనకు కృషిచేస్తానని, కేంద్రంలో మరోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసే బిజెపికి మద్దతివ్వాలంటూ మల్కాజిగిరి ఎంపి అభ్యర్థి ఈటెల రాజేందర్ కోరారు. బుధవారం ఈటెల జన్మదినోత్సవ సందర్భంగా ఘట్కేసర్ ఎంపిపి ఏనుగు సుదర్శనరెడ్డి నేతృత్వంలో పలువురు నేతలు, కార్యకర్తలతో కల్సి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఈటెల మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సంఘటితంగా ప్రణాళికాయుక్తంగా పని చేస్తూ మల్కాజిగిరిలో విజయానికి కృషి చేయాలన్నారు. తన జన్మదిన సందర్భంగా శామీర్‌పేటలోని ఆయన నివాసంలో మల్కాజిగిరి పార్లమెంటు ఎన్నికల ప్రచార వివరాలు, బిజెపి పథకాలతో కూడిన క్యూఆర్ కోడ్‌తో పాటు అక్కడ మోడి గ్యారంటీ ఇక్కడ ఈటల ష్యూరిటీ పేరిట మానిఫెస్టో విడుదల చేశారు. అతి పెద్దదైన మల్కాజిగిరి పార్లమెంటు ప్రాంతంలో ప్రధాన సమస్యగా ఉన్న నిరుద్యోగాన్ని పారదోలడానికి భారత ప్రభుత్వ సహకారంతో స్కిల్ డెవలప్‌మెంట సంస్థలతో మేక్ ఇన్ ఇండియా నినాదంతో ఉపాధి అవకాశాలు కల్పిస్తానన్నారు. అదే విధంగా మరో ప్రధాన సమస్యగా ఉన్న సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు కేంద్ర ప్రభుత్వ నిర్మించిన 2 లక్షల 37 వేల ఇళ్లను పేదలకు మంజూరు చేయటంలో గత రాష్ట్ర ప్రభుత్వం విఫమైందని, దీని కోసం తాను ఎంపిగా కృషి చేసి అర్హులైన వారందరికి ఇళ్లను ఇప్పిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంటు కన్వీనర్ ఆర్కె శ్రీనివాస్, అసెంబ్లీ కో కన్వీనర్ బోడ శ్రీనివాసరావు, కీసర మండల ప్రధాన కార్యదర్శి బాలరాజ్ యాదవ్, మేడ్చల్ రూరల్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరెడ్డి, అశోక్ ముదిరాజ్, జిల్లా అధికార ప్రతినిధి సత్యనారాయణ, కోల మల్లేష్, కీసర గ్రామ అధ్యక్షుడు ఆంజనేయులు, రాముల ముత్యం, శ్రీశైలం, దుర్గేష్, రాములు చారి, చంద్రశేఖరగౌడ్, నరసింహ వెంకటేష్ యాదవ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా ఈటల జన్మదినం



ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి: బిజెపి మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థి ఈటల రాజేందర్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం మల్కాజ్‌గిరి పరిధిలోని మౌలాలీ డివిజన్‌లో ఆర్‌కెహెచ్ కాలనీలోని అష్టలక్ష్మి ఆలయం లో గణేశుడు, సరస్వతి అమ్మవారు, పంచముఖి ఆంజనేయ స్వామి, శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి నేతలు మోహన్ యాదవ్, జగదీష్‌గౌడ్, గణేష్ ముదిరాజ్, ఆర్‌కెహెచ్ కాలనీ అధ్యక్షుడు పోశెట్టి, ఆలయ కార్యదర్శి శ్రీనివాస్, దివాకర్, మహేష్ యాదవ్, శివకుమార్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



మల్కాజ్‌గిరి పార్లమెంటు బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్ పుట్టిన రోజు సందర్భంగా ఓల్డ్ సఫిల్‌గూడ భజనమండలి, షఫీనగర్, గాంధీనగర్ లలో అన్నదానం నిర్వహించారు. మౌలాలీ కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ అన్నదానం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోహన్ యాదవ్, శివ, బిజెపి శ్రీను, జహంగీర్, నటరాజ్, శివ పాల్గొన్నారు.

**శామీర్‌పేట** : హుజురాబాద్ మాజి ఎంఎల్ఎ, మేడ్చల్ మల్కాజ్‌గిరి బిజెపి ఎంపి అభ్యర్థి ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలు ఉమ్మడి శామీర్‌పేట మండలంలో బిజెపి రాష్ట్ర నాయకులు ఈశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జగ్గంగూడలోని హోమ్ ఫర్ డిసబిలిటి ఆశ్రమంలో అనాధలకు అన్నదానం చేశారు. అలాగే శామీర్‌పేట మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు,



బ్రెడ్‌లు బిస్కెట్‌లు పంపిణి చేశారు. కార్యక్రమంలో కాసుల ఈశ్వర్‌గౌడ్, మాధవరెడ్డి, కాసుల కరుణాకర్‌గౌడ్, పార్టీ జిల్లా మెడికల్ సెల్ కన్వీనర్ మంచినీళ్ల లక్ష్మ న్ పాల్గొన్నారు.

## శ్రామికనగర్‌లో సమస్యలు పరిష్కరిస్తాం

### ఎంఎల్ఎ రాజశేఖర్‌రెడ్డి



ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి: మౌలాలీ డివిజన్‌లోని శ్రామికనగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. శ్రామికనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రతినిధులు బుధవారం ఎమ్మెల్యేను కలిశారు. శ్రామికనగర్ కాలనీలో నెలకొన్న అంతర్గత రోడ్లు, డ్రైయినేజీ పార్కు స్థలాన్ని శుభ్రం చేయాలని, కమిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని, మౌలిక వసతులు కల్పించాలని కోరారు.కార్యక్రమంలో శ్రామికనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మొహమ్మద్ గౌస్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హమీద్, శ్రీనివాస్, బాగ్యానందరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కోడ్ వచ్చినా..

### మేడ్చల్ జిల్లాలో తొలగించని పోస్టర్లు, వాల్ రైటింగ్‌లు




ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: దేశ వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా నిబంధనల ప్రకారం మేడ్చల్ జిల్లాలో వెలసిన పలు రాజకీయ పార్టీల ప్రచార సంబంధింత పోస్టర్లు, వాల్ రైటింగ్‌లను తొలగించటంలో అధికారులు విఫలమయ్యారు. మల్కాజిగిరి పార్లమెంటరీ స్థాన రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్ గౌతం భారత ఎన్నికల కమిషనర్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన గత శనివారం నుండే ఎన్నికల కోడ్ జిల్లాలో అమలులోకి వచ్చిందని, నిబంధనల మేరకు జిల్లాలో రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ రైటింగ్‌లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, ఫొటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో 24 గంటల వ్యవధిలో, బస్ స్టాండ్, రైల్వే స్టేషన్లు, పెట్రోల్ బంకు మొదలైన పబ్లిక్ స్థలాల్లో 48 గంటల వ్యవధిలో, అనుమతి లేని ప్రయివేటు స్థలాల్లో 72 గంటల వ్యవధిలో తొలగిస్తామంటూ ప్రకటించారు. ఆయన ఆదేశాల మేరకు వీటిని తొలగించే బాధ్యత చేపట్టాల్సిన పురపాలక సంఘాలు, జిహెచ్ఎంసి, గ్రామ పంచాయతి అధికారులు నామ మాత్రంగా కొన్ని ప్రాంతాల్లో మాత్రమే తొలగించటం వల్ల మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలోని దాదాపు అన్ని సెంగ్మెంట్లలోనూ పోస్టర్లు, వాల్ రైటింగ్‌లు పెద్ద సంఖ్యలో కనిపిస్తున్నాయి. ఏప్రెల్, మే నెలల్లో పార్లమెంటు ఎన్నికలు జరుగనున్నాయన్న సమాచారంతో ముందస్తుగానే వివిధ రాజకీయ పార్టీల ఆశావహులు పోస్టర్లు, వాల్ రైటింగ్‌లతో ముందస్తు ప్రచారం ప్రారంభించారు. దీంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో వందల సంఖ్యలో పోస్టర్లు, వాల్ రైటింగ్‌లు ఆయా పార్టీల గుర్తులు, కీలక నేతల ఫొటోలతో ఆశావహులు తమ వంతుగా ప్రజలకు చేరువవ్వాలన్న ఉద్దేశంతో చేపట్టారు. ఇప్పటికైనా అధికారులు ఈ విషయంలో నిబంధనల మేరకు పూర్తి స్థాయిలో జిల్లాలో వెలసిన పోస్టర్లు, వాల్ రైటింగ్‌లను యుద్ధ ప్రాతిపదికన తొలగించాల్సి ఉంటుంది.

## పార్వతీ పరమేశ్వరుల రథోత్సవం



ప్రజాపక్షం/నవాబుపేట్: హర హర మహాదేవ శంభో శంకర అంటూ నామస్మరణలతో ఎల్లకొండ గ్రామం పులకించింది. పార్వతీ పరమేశ్వరుల వారోత్సవాలలో భాగంగా బుధవారం వేద పండితుల మంత్రోచ్చారణలు...డప్పువాయిద్యాల మధ్య శ్రీ పార్వతి పరమేశ్వర నేత్ర పర్వం కొనసాగింది. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన పార్వతీ పరమేశ్వరుల దివ్య రథోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. రథోత్సవ కార్యక్రమంలో కళాకారుల ఆటపాటలు ఆకర్షణగా నిలిచాయి. ఉదయం స్వామివారి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా తీసుకువచ్చారు. పార్వతీ పరమేశ్వరులను రథంపై గ్రామంలో నడిబొడ్డు నుండి దేవాలయం వరకు ఊరేగించారు. రథాన్ని లాగితే శుభం కలుగుతుందన్నది భక్తుల నమ్మకం, ఎల్లకొండ గ్రామస్తులు పార్వతీ పరమేశ్వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవం చూడడానికి గ్రామస్తులే కాకుండా చుట్టుపక్కల గ్రామస్తులు వారి బంధువులు భారీగా తరలి వచ్చారు. భక్తుల రద్దీతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. రథోత్సవంలో ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా నవాబ్‌పేట ఎస్ఐ భరత్ భూషణ్ సిబ్బందితో కలిసి బందోబస్తు చర్యలు చేపట్టారు. ఆలయ ధర్మకర్త మండలి పట్లోళ భరత్ రెడ్డి,గ్రామ పెద్దలు, భక్తులు, దేవాలయ ప్రధాన అర్చకులు దేవాలయ ప్రధాన అర్చకులు శ్రీశైలం స్వామి, శివకుమార్‌శాస్త్రి, చంద్రమౌళి స్వామి, ప్రవీణ్ కుమార్, అర్చకులు సంతోష్ స్వామి, పూర్ణచందర్ స్వామి, శివ ప్రసాద్, మణికంఠ స్వామి, శశి స్వామి, ఆనందం స్వామి, పెద్ద ఎత్తున భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వివక్షకు గురైన మహబూబ్‌నగర్



## ఎంబిసి జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం లోని ఎంబిసి ఒకేషనల్ జూనియర్ కళాశాలను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి, కళాశాల ప్రిన్సిపాల్ తిమ్మోతిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ ప్రిన్సిపాల్ ఆంద్రూ ఎలియాస్, ఎంబిసి హైస్కూల్ హెడ్ మాస్టర్ జగదీశ్వర్ రెడ్డి, చిన్నరాజు పాల్గొన్నారు.




## మహిళలు స్వశక్తితో ఎదగాలి

**ప్రజాపక్షం /జడ్చర్ల :** మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని నవజీవన్ రూలర్ డెవలప్‌మెంట్ సొసైటీ రోజులు పూర్తి అధ్యక్షులు ఫాదర్ రాజారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని నవజీవన్ రూలర్ డెవలప్‌మెంట్ సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టైలరింగ్, మగ్గం వర్క్ 45 రోజులు శిక్షణ పూర్తి చేసుకుని, ముగింపు సందర్భంగా సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయం కృషితో తమ కాళ్ళ పై తాము నిలబడి ఆర్థికంగా ఎదిగి ఇతరులకు ఉపాధి కల్పించే దిశగా అడుగులు వేయాలన్నారు. మహిళలు ఉన్నతమైన లక్ష్యం వైపు దృష్టి సారించాలన్నారు. నేటి సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా వ్యాపార, ఉద్యోగాల్లో సత్తా చాటుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి కె.మర్రిరెడ్డి, కోఆర్డినేటర్ మర్తదేవిడ్, శిక్షకులు రఫియా, శ్రీలత మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో విద్యుత్ సమస్యలు రానీయొద్దు

**ప్రజాపక్షం/అచ్చంపేట :** వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండాచూడాలని , 24గంటలు విద్యుత్ సరఫరా అయ్యేలాచర్యలు చేపట్టాలని జిల్లా విద్యుత్ ఎస్ఇ లీలావతి అన్నారు. బుధవారం ఉప్పునుంతల మండలకేంద్రంలో ఉన్న సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు, రైతులకు ఎలాంటి విద్యుత్‌కొరతలేకుండా నాణ్యమైన విద్యుత్ 24గంటలు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. విద్యుత్‌పై ఎలాంటి అపోహలు నమ్మవద్దన్నారు. తెల్లరేషన్‌కార్డు కలిగి ఉండి 200ల యూనిట్లు వినియోగిస్తున్నట్లు నిర్ధయమైతే వారివద్ద విద్యుత్‌బిల్లు తీసుకోవద్దన్నారు. అక్రమవిద్యుత్ వాడుతున్నవారిపై చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఏఇ అమరేందర్‌సింగ్, లైన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఏడి కామేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## మల్లురవికి సన్మానం



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** రానున్న పార్లమెంట్ ఎన్నికలలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ మల్లు రవిని ప్రకటించడంతో కాంగ్రెస్‌పార్టీ నాయకులు రాధాకృష్ణ, శ్రీనివాస్‌లు హర్షం వ్యక్తంచేశారు. అదేవిధంగా ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికలలో నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌జెండా ఎగురవేయడంతోపాటు అధిక మెజార్టీతో డాక్టర్ మల్లురవి విజయం సాధిస్తారని వారు ఆశాభావం వ్యక్తంచేశారు.

### ఘనస్వాగతం పలికిన నాయకులు



**ప్రజాపక్షం/వెల్దండ :** నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా మల్లురవిని ప్రకటించిన సందర్భంగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మల్లురవిని మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, కిసాన్‌సెల్ తాలుకా అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తక్కళ్లపల్లి శేఖర్, సేవాదల్‌జిల్లా ఉపాధ్యక్షులు పుల్లయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎర్రశ్రీను, సీనియర్ నాయకులు కృష్ణముదిరాజ్, ఎస్సిసెల్ మండల అధ్యక్షులు ముదిగొండ రమేష్, యువజనకాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు శేఖర్‌లు ఘనస్వాగతం పలికి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా దుగ్గివిశ్వనాథం జయంతి



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** చారకొండ మండలకేంద్రానికి చెందిన మాజీసర్పంచ్ కామ్రేడ్‌దుగ్గి విశ్వనాథం 71వజయంతి వేడుకలను సిపిఐ నాయకులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. మండలకేంద్రంలోని చెర్కుపల్లి చౌరస్తాలో దుగ్గి విశ్వనాథంస్థూపం వద్ద సిపిఐ జిల్లానాయకుడు డాక్టర్ చిలివేరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ దుగ్గివిశ్వనాథం 1981లో సర్పంచ్‌గా ఉన్న సమయంలో చారకొండకు చేసిన సేవలు మరువలేనివని 14 సంవత్సరాలు గ్రామాభివృద్ధికి ఎనలేని కృషిచేసి ప్రజల మన్ననలు పొందాడన్నారు. విశ్వనాథం కమ్యూనిస్టు ఉద్యమంలోచేరిన సమయంలో కల్వకుర్తిప్రాంతంలో భూస్వాములకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేసి పేదప్రజల పక్షాన నిలిచాడన్నారు. కార్యక్రమంలో దుగ్గి అనిల్, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రాంగౌడ్, నాయకులు మద్దినారాయణరెడ్డి, పాండు, బ్రహ్మం, శంకరయ్య, బాబు, విష్ణు, వేణుగోపాల్‌రెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు.

## చెక్కు అందజేత



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** స్వచ్ఛ సర్వేక్షన్‌లోభాగంగా పట్టణంలోని వ్యాపారస్తులకు షాపులవద్ద చెత్తను వేయుటకు చెత్తబుట్టలు పంపిణీ చేయుటకొరకై ఆశాదీపరెడ్డి కల్వకుర్తి పురపాలకసంఘం చైర్‌పర్సన్ ఎడ్మసత్యం సమక్షంలో కమీషనర్ ఆశిత్‌కుమార్‌కు రూ.80వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మహ్మద్‌షాహెద్, 21వ వార్డు సభ్యులు సైదుబాబు, నాయకులు మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను కలిసిన ఉప్పల

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** బిఆర్ఎస్‌లో చేరిన మాజీ పోలీసు ఉన్నతాధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ని బిఆర్ఎస్‌పార్టీ రాష్ట్ర నాయకులు మిషన్‌భగీరథ మాజీవైస్‌చైర్మన్ ఉప్పలవెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిసి పార్లమెంట్ ఎన్నికల గురించి చర్చించారు.

### ప్రజాసంక్షేమం కోసం పనిచేస్తున్న కాంగ్రెస్‌కు పట్టం కట్టాలి : ఎంఎల్ఎ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

### భారీ ఎత్తున కాంగ్రెస్‌లో చేరిన బిజెపి, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు





**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** గతంలో వివక్షకు గురైన మహబూబ్‌నగర్‌ను ఇకనైనా అభివృద్ధి చేసుకుందామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని క్రౌన్ ఫంక్షన్ హాల్‌లో చేరికల కమిటీ కన్వీనర్ సత్తూరు చంద్రకుమార్ గౌడ్, కో కన్వీనర్ మహమ్మద్ సిరాజ్ ఖాద్రి ఆధ్వర్యంలో హన్వాడ మండలానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తాజా మాజీ సర్పంచులు ఏఐసిసి కార్యదర్శి, మహబూబ్‌నగర్ ఎంపి అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బిజెపితో మాత్రమే పోటి ఉంటుందని, బిఆర్ఎస్ అసలు పోటీ ఇవ్వదని, ప్రజల అవసరాలు గుర్తించి, పేదల అభ్యున్నతి కోసం, సంక్షేమం కోసం పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని, టివిలో కనిపించే మోడీ ఏ అభివృద్ధి చేయదని ఏ కార్యకర్తకు, ఏ నాయకునికి సైతం మోడీ దర్శనం దొరకదని ఇంకా సామాన్యుడి సమస్యలు ఎలా పరిష్కారం ఇస్తారని, ఇక అభివృద్ధి ఏమి చేస్తారని ఆయన ప్రశ్నించారు.

సంక్షేమం మీద ధ్యాస ఉన్న నాయకుడు మన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని, అందుకే మూడు నెలల కాలంలోనే ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలు దిశగా ఉచిత బస్సు 500 లకే గ్యాస్ సిలిండర్ల, 200 యూనిట్ల విద్యుత్ రాజీవ్, ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లు లాంటి పథకాల తో పాటు సామాన్యుడికి సంక్షేమం అందుబాటులో ఉండేందుకు 16 కార్పోరేషనులను ఏర్పాటు చేశారని, 30 వేల పైచిలుకు ఉద్యోగాలు ఇచ్చారని, అలాగే పాలమూరు యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కాలేజ్, లా కళాశాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చారని ఆయన స్పష్టం చేశారు. సంగం బండ తొలగిస్తే 25వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని మన పార్లమెంటు అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, ఒప్పించి సంగం బండ తొలగించేందుకు కేవలం మూడు నెలల్లోనే నిధులు మంజూరు చేయించుకుని వచ్చి ఆ సంగం బండను తొలగించారని ఆయన తెలిపారు. చల్లా వంశీచంద్‌రెడ్డి, ఢిల్లీలో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారని జాతీయ స్థాయిలో నాయకులందరితో మంచి సంబంధాలు కలిగి ఉండడం చేత మన మహబూబ్‌నగర్ జిల్లాకు ఎక్కువ మొత్తంలో నిధులు మంజూరు చేయించుకుని తీసుకొచ్చి జిల్లా అభివృద్ధి చేసుకునేందుకు ఇదే గొప్ప అవకాశం అని ఆయన తెలిపారు.

అనంతరం వివిధ పార్టీలకు చెందిన నాయకులు, తాజా మాజీ సర్పంచులు, కార్యకర్తలకు ఎంపి అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి తో కలిసి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో చల్లా వంశీచంద్‌రెడ్డి, మైనార్టీ కార్పోరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, చేరికల కమిటీ కన్వీనర్ సత్తూరు చంద్రకుమార్ గౌడ్, కోకన్వీనర్ మహ్మద్ సిరాజ్ ఖాద్రి, మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, నాయకులు ఎన్పి వెంకటేష్, హనీఫ్ అహ్మద్, మారేపల్లి సురేందర్‌రెడ్డి, మైనార్టీ సెల్ చైర్మన్ ఫయాజ్, సుధాకర్ రెడ్డి, డిసిసి కార్యదర్శి కృష్ణయ్య, మహబూబ్‌నగర్ మండల అధ్యక్షులు మహేందర్, లక్ష్మణ్ యాదవ్, అజ్మత్ అలి, పెద్ద విజయ్‌కుమార్, నవనీత, వసంత, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## మండలి ఉప ఎన్నిక ఏర్పాట్లపై రాజకీయ పార్టీలతో సమావేశం



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసన మండలి ఉప ఎన్నిక నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ , ఉప ఎన్నిక రిటర్నింగ్ అధికారి జి.రవి కుమార్ అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలో సమావేశ మందిరం లో మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ ఉప ఎన్నిక నిర్వహణ ఏర్పాట్లపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఉప ఎన్నిక రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ ఈ నెల 28న పోలింగ్‌కు మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ పరిధిలో 10 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఎంపిడిఓ కార్యాలయంలో కొడంగల్‌లో ఎంపిడిఓ కార్యాలయంలో , వనపర్తి లో, నారాయణపేటలో ఎంపిడిఓ కార్యాలయం లో వనపర్తిలో ఆర్‌డిఓ కార్యాలయం సమావేశం మందిరంలో జోగులాంబ గద్వాల లో జడ్పి సమావేశ మందిరంలో కొల్లాపూర్‌లో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, రూం నెంబర్ 5 లో, నాగర్‌కర్నూల్ లో ప్రభుత్వ జడ్పి బాలుర ఉన్నత పాఠశాల లో అచ్చంపేటలో ప్రభుత్వ జడ్పి బాలికల ఉన్నత పాఠశాల, 10వ తరగతి బిసెక్షన్ తెలుగు మీడియం గదిలో, కల్వకుర్తిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షాద్‌నగర్ లో ఎంపిడిఓ కార్యాలయం సమావేశం మందిరంలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పోలింగ్ రోజున ఓటరు గుర్తింపుకు జడ్పిటిసి, ఎంపిటిసి, కౌన్సిలర్ , ఎక్స్ అఫిషియో సభ్యులు గుర్తింపు కార్డు చూపించాలని లేదా ఎన్నికల కమిషన్ సూచించిన 12 ఫోటో గుర్తింపు కార్డులలో ఏదైనా ఫోటో గుర్తింపు కార్డు తీసుకురావాలని తెలిపారు. ఆధార్‌కార్డు, ఎంజిఎన్ , అర్.జి.ఎ జాబ్ కార్డు , బ్యాంకు లేదా పోస్టు ఆఫీస్ పాస్ బుక్ ఫోటోతో ఉన్నది, కార్మిక శాఖ ద్వారా జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్సు స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, పాన్‌కార్డు, భారత రిజిస్ట్రార్ జనరల్, ఎన్‌పిఆర్ కింద జారీ చేసిన స్మార్ట్ కార్డు, ఇండియన్ పాస్ పోర్టు, ఫోటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్స్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన గుర్తింపు కార్డులు, భారత ప్రభుత్వ సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ వికలాంగులకు జారీచేసిన యూనిక్ డిస్ అబిలిటీ గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటి గుర్తింపు కు చూపించాలని అన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, బిఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి ఏజెంట్ రాజేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుండి ఏజెంట్ వినోద్‌కుమార్ అభ్యర్థి తరపున ప్రతినిధి, రవీందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## న్యూలైఫ్ క్లినిక్ లైసెన్స్ రద్దు చేయాలి : ఎఐటియుసి




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పట్టణంలోని న్యూలైఫ్‌క్లినిక్ ఆస్పత్రిని రద్దుచేసి వెంటనే ఆర్ఎంపి డాక్టర్ సమీపై కఠిన చర్యలుతీసుకోవాలని ఎఐటియూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్ డిమాండ్ చేశారు. బిజినేపల్లి మండలం గుడ్లనర్వ గ్రామానికి చెందిన వట్టెపు అరవింద్ కిడ్ని సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్నటువంటి వ్యక్తిని బుధవారం పరామర్శించారు. గతనెల 15న ఆర్‌ఎంపి క్లినిక్‌కి వచ్చారు. టెస్టులుచేసిన అనంతరం ఆరునెలలు మందులువాడాలని, ప్రతివారం చెకప్ అవసరమని మందులు ఇచ్చారు. ఆమందులువాడిన మూడువారాలకు శరీరబరువు 65కిలోలనుండి 45నుంచి 30కిలోలకు తగ్గి చర్మం అంతాపొడిబారి నడిచే 19ఏళ్ల యువకుడు మంచానికే పరిమితమయ్యేలా వైద్యం వికటించిందని పేర్కొన్నారు. క్లినిక్ నిర్వహించేందుకు ఎలాంటి అర్హతలులేకున్న కేవలం ఆర్ఎంపి హోదాతో క్లినిక్ నిర్వహించడం ఏంటని ప్రశ్నించారు. క్లినిక్‌లో ప్రతి మూడునెలలకు , ఆరునెలలకు ఏదో ఒక పేషెంట్‌కు సరైన ట్రీట్‌మెంట్ అందకచావు అంచులదాక వెళుతున్న సంఘటనలు నిరంతరం పునరావృత్తమవుతున్న ఆక్లినిక్‌ను ఎందుకు కొనసాగిస్తున్నారో అర్థంకావడంలేదన్నారు. తక్షణమే ఆక్లినిక్ లైసెన్స్ రద్దుచేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్, ఎస్‌పిలనుకలిసి క్లినిక్ లైసెన్స్ రద్దయ్యేవరకు ఎఐటియూసి ఆధ్వర్యంలో ఉధృతంగా ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎఐటియూసి జిల్లా సహాయ కార్యదర్శి చిన్నపాగ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## పుతిన్‌కు మోడీ అభినందనలు

**న్యూఢిల్లీ:** రష్యా అధ్యక్షుడిగా ఐదోసారి ఎన్నికైన వ్లాదిమీర్ పుతిన్‌ను భారత ప్రధాని నరేంద్ర మోడీ అభినందించారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి కృషి చేస్తామని ప్రకటించారు. 'రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఫోన్‌లో మాట్లాడాను. అధ్యక్ష పదవికి మరోసారి ఎన్నికైనందుకు ఆయనను అభినందించాను. భారత్, రష్యా సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్ల డానికి కలసికట్టుగా కృషి చేయాలని నిర్ణయించాం. ఇరు దేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యాల గురించి మాట్లాడుకున్నాం' అని మోడీ తన 'ఎక్స్' పోస్టులో తెలిపారు. చర్చలు, సంప్రదింపులు, దౌత్యపరమైన సహకారంతోనే రష్యా, ఉక్రేన్ యుద్ధానికి ఒక పరిష్కారం లభిస్తుందన్న భారత్ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని మోడీ స్పష్టం చేశారు. ఈ విషయంలో తరచు అందుబాటులో ఉండాలని తామిద్దరం అనుకున్నామని చెప్పారు. కాగా, రష్యా అధికారులు కూడా పుతిన్‌కు మోడీ ఫోన్ అంశాన్ని ధ్రువీకరిస్తూ, రెండు దేశాల మధ్య ఎంతోకాలంగా పటిష్టమైన స్నేహసంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్థిక, వాణిజ్యాది రంగాల్లో పరస్పర సహకారం అవసరమని ఇరువురు నేతలు పునరుద్ఘాటించారని చెప్పారు. రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి ఇరువురు నేతలు కృతనిశ్చయంతో ఉన్నారని తెలిపారు.

## ఫ్యాక్ట్ చెక్ యూనిట్‌ను నోటీఫై చేసిన కేంద్రం

**న్యూఢిల్లీ:** ప్రభుత్వానికి సంబంధించిన ఆన్లైన్ కంటెంట్‌లో ఖచ్చితత్వాన్ని పర్యవేక్షించడానికి ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి) ఆధ్వర్యంలోని ఫ్యాక్ట్ చెక్ యూనిట్‌కు కేంద్రం బుధవారం నోటిఫై చేసింది. ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ద్వారా ఐటి రూల్స్ 2021 ప్రకారం ఫాక్ట్ చెక్ యూనిట్‌ను నోటిఫై చేశారు. కేంద్ర ప్రభుత్వ పని, ఇతరత్రా అంశాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న సమాచారం సరైనదా? కాదా? అని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన పిఐబి కింద పని చేస్తున్న ఫ్యాక్ట్ చెక్ యూనిట్‌ను కేంద్రం వాస్తవ తనిఖీ యూనిట్‌గా ప్రకటించింది. ఈ ఫ్యాక్ట్ చెక్ అనేది కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన అన్ని రకాల నకిలీ వార్తలు లేదా తప్పుడు సమాచారాన్ని నిరోధించడానికి, నిజానిజాలు తెలియచేస్తూ, దీనిపై అప్రమత్తం చేయడానికి నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది. యూనిట్‌కు నోటిఫై చేయకుండా కేంద్రాన్ని నిరోధించడాన్ని బాంబే హైకోర్టు ఇటీవలే నిరాకరించింది. ఆ తర్వాత ఈ నోటిఫికేషన్ వెలువడడం విశేషం.

## కాంగ్రెస్‌లో పప్పు యాదవ్ పార్టీ విలీనం

**న్యూఢిల్లీ :** లోక్ సభ ఎన్నికల వేళ బీహార్ కాంగ్రెస్ పార్టీ బలం మరింత పెరగనుంది. ప్రాంతీయ పార్టీ అయిన జన్ అధికార్ పార్టీ కాంగ్రెస్ పార్టీలో విలీనం అయ్యింది. కాంగ్రెస్ ముఖ్యనేత ప్రియాంక గాంధీ హామీ మేరకు పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశామని జన్ అధికార్ పార్టీ అధినేత రాజేశ్ రంజన్ అలియాస్ పప్పు యాదవ్ ప్రకటించారు. కాంగ్రెస్, ఆర్‌జెడి కలిసి పోటీ చేయడం వల్ల లోక్ సభ ఎన్నికల్లో విజయం సాధించడం ఖాయం అని పప్పు యాదవ్ విశ్వాసం వ్యక్తం చేశారు. లోక్ సభ ఎన్నికల తర్వాత బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆర్‌జెడి కూటమి విజయం సాధిస్తోందని ధీమా వ్యక్తం చేశారు. పప్పు యాదవ్‌ను లోక్ సభ ఎన్నికల బరిలో నిలుపాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. కాంగ్రెస్ పార్టీలో చేరక ముందు ఆర్‌జెడి అధినేత లాలు ప్రసాద్ యాదవ్, అతని కుమారుడు తేజస్వి యాదవ్‌తో పప్పు యాదవ్ సమావేశం అయ్యారు. తమకు ఒకరిపై మరొకరికి శత్రుత్వం లేదని పప్పు యాదవ్ స్పష్టం చేశారు. బీహార్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తానని పప్పు యాదవ్ ప్రకటించారు. తేజస్వి యాదవ్‌పై ప్రశంసలు కురిపించారు. గత 17 నెలల బీహార్ పాలనలో తేజస్వి యాదవ్ మార్క్ కనిపించిందని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం తేజస్వి యాదవ్ నిరంతరం పని చేశారని పప్పు యాదవ్ తెలిపారు. ఆర్జేడీని తేజస్వి మరింత బలోపేతం చేశారని వివరించారు.

## నీట్ పరీక్ష తేదీల్లో మార్పు

**న్యూఢిల్లీ :** నేషనల్ ఎలిజిబిలిటీకమ్ఎంట్రన్స్ టెస్ట్‌పోస్ట్ గ్రాడ్యుయేట్ పరీక్షల షెడ్యూల్‌ను లోక్‌సభ ఎన్నికల కారణంగా సవరించారు. నేషనల్ మెడికల్ కమిషన్ ఈ విషయాన్ని బుధవారంనాడు ప్రకటించింది. తాజా షెడ్యూల్ ప్రకారం నీట్ పిజి 2024 పరీక్ష తేదీని మే 5వ తేదీ నుంచి జూన్ 23వ తేదీకి మార్చారు. నీట్ పిజి 2023 ఫలితాల తేదీని, నీట్ పిజి 2024 కౌన్సిలింగ్ షెడ్యూల్‌ను కూడా సవరించారు. అయితే ఇంటర్న్‌షిప్ చివరి తేదీల్లో ఎలాంటి మార్పు లేదు. మెడికల్ కౌన్సిలింగ్ కమిటీ, డెరెక్టరేట్ జనరల్ ఫర్ హెల్త్ సైన్సెస్, నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఫర్ మెడికల్ సైన్సెస్‌తో కలిసి ప్రోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ బోర్డు, నేషనల్ మెడికల్ కమిషన్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు.

**నీట్ పిజి 2024 కొత్త తేదీలు..**

సవరించిన తేదీల ప్రకారం నీట్ పిజి 2024 పరీక్షలను జూన్ 23వ తేదీన నిర్వహించనున్నారు. అడ్మిషన్లకు కౌన్సిలింగ్ ఆగస్టు 5–15వ తేదీల మధ్య జరుపుతారు. నీట్ పిజి 2024కు హాజరయ్యేందుకు అర్హతకు సంబంధించి కట్ ఆఫ్ డేట్ ఆగస్టు 15న ప్రకటిస్తారు. కొత్త సంవత్సరం అకడమిక్ సెషన్ సెప్టెంబర్ 16 నుంచి మొదలవుతుంది. సంబంధిత కాలేజీల్లో చేరేందుకు అక్టోబర్ 21 చివరి తేదీ

## పాలిసెట్ వాయిదా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పాలిసెట్ ప్రవేశ పరీక్ష వాయిదా పడింది. మే 17న జరగాల్సిన పరీక్షను మే 24కు వాయిదా వేశారు. ఈ మేరకు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ, శిక్షణ మండలి కార్యదర్శి ఎ.పుల్లయ్య బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాగా పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు గత నెలలో పాలిసెట్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలల్లోని డిప్లొమా(ఇంజినీరింగ్, నాన్‌ఇంజినీరింగ్/ టెక్నాలజీ, అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ, ఫిషరీస్) సీట్లను పాలిసెట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా భర్తీ చేస్తారు.

## ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

### సిఐ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/మక్తల్ :** ఆటో డ్రైవర్లు, ఆటోలను నడిపే సమయంలో తప్పకుండా ట్రాఫిక్ నిబంధ లు పాటించాలని మక్తల్ సిఐ చంద్రశేఖర్ అన్నారు. మక్తల్ టౌన్‌లో ఆటోలు, జీప్‌లు నడిపే డ్రైవర్లను బుధవారం ఉదయం మక్తల్ పోలీస్ స్టేషన్ పిలిపించి రోడ్డు ప్రమాదాల నివారణ కోసం డ్రైవర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిఐ సూచించారు. ఈ సందర్భంగా సిఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా ఆటోలను, జీప్‌లను నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. తమ వెనక కుటుంబ సభ్యులు ఆధారపడి ఉన్నారిన గుర్తు పెట్టుకొని వాహనాలు సురక్షితంగా నడుపుకోవాలన్నారు. లైసెన్సులు తప్పకుండా తీసుకోవాలన్నారు. తాగి వాహనాలు నడపవద్దని, రాష్ డ్రైవింగ్ చేయరాదని, ట్రాఫిక్ నిబంధనల ప్రకారం ఆటోలను నడపాలని, ఆటో రిజిస్ట్రేషన్ నంబర్ కనబడేలా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసమే అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి, ఆటో, జీప్ డ్రైవర్లు పోలీసు సిబ్బంది, యూనియన్ నేతలు పాల్గొన్నారు.

## బిజెపి వనపర్తి జిల్లా అధ్యక్షుడిగా నారాయణ

**ప్రజాపక్షం/కొత్తకోట :** బిజెపి వనపర్తి జిల్లా అధ్యక్షుడిగా నారాయణను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కొత్తకోట మండల అధ్యక్షుడు సరెడ్డి కోటేశ్వర్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన నారాయణ పరిచయ సన్మాన కార్యక్రమం బిజెపి కార్యాలయంలో నిర్వహించారు. నరేంద్రమోడీ సంక్షేమ పథకాలను ఇంటింటికి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సెలవుల్లో విద్యార్థులకు సాంస్కృతి కార్యక్రమాలు



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** వేసవి సెలవుల సమయంలో తల్లిదండ్రులు విద్యార్థులకు ఆటలు , పాటలు డాన్సులు వంటి సాంస్కృతి కార్యక్రమాలను నేర్పించడం అలవాటు చేయాలని వీపనగండ్ల ఎస్ఐ నందికర్ అన్నారు. మండల కేంద్రంలోని డాఫోడిల్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నూతన విద్యా సంవత్సరం క్యాలెండర్‌ను స్థానిక ఎస్ఐ నందికర్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బి.రాముడు , ఉపాధ్యాయులు లక్ష్మీ, కళ్యాణి, రాజేశ్వరి, మాసుంబి, మౌనిక, పార్వతి తల్లిదండ్రులు నాగరాజు, సత్యనారాయణ, చిన్నయ్య పాల్గొన్నారు.

## మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలకు వినతి



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** గ్రామంలో మంచినీటి సమస్య రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పుల్గర్ చర్ల గ్రామ యువకులు పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ప్రతి రోజు మిషన్ భగీరథ పథకం ద్వారా సరపర అయ్యే మంచినీరు సరిగ్గా రావటం లేదని, క్రమం తప్పకుండా ప్రతి రోజు నీటిని వదిలేలా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే గ్రామంలోని పలు వాడల్లో మిషన్ భగీరథ పైప్లైన్ ద్వారా నీరు సరిగ్గా రావటం లేదని, పరిస్థితి ఇదే విధంగా ఉంటే గ్రామంలో నీటి సమస్య జటిలం అవుతుందని వినతి పత్రంలో పేర్కొ న్నారు. గ్రామంలో నీటి సమస్య రాకుండా చూడాలని గ్రామ యువకులు కోరారు.

## స్వయం ఉపాధిలో యువత రాణించాలి



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** యువత తమతమ నైపుణ్యంతో స్వయం ఉపాధిలో రాణించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు కాయితి ఆశాదీప్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో మహబూబ్‌నగర్ రోడ్డు ఎంపిడిఓ కార్యాలయం ఎదురుగా శ్రీబాలాజి ఎంటర్‌ప్రైజేస్ ఫర్నిచర్ ఎలక్ట్రానిక్స్ నూతన దుకాణానికి రిబ్బన్‌కట్‌చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జావీద్, అశోక్, మహేష్, బాబా, పరుషరామ్ పాల్గొన్నారు.

## సిఎంఆర్ బియ్యం తక్షణమే అప్పగించాలి

### అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.సీతారామారావు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ప్రభుత్వానికి చెల్లించాల్సిన సిఎంఆర్ బియ్యాన్ని తక్షణమే అప్పజెప్పాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.సీతారామారావు మిల్లర్లకు సూచించారు. బుధవారం జిల్లాలోగల సమీకృత కలెక్టరేట్ భవనంలోని సమావేశమందిరంలో రైస్‌మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2020–2021, 2021–2022 సంవత్సరాలకు సంబంధించి ప్రభుత్వానికి చెల్లించాల్సిన సిఎంఆర్ బియ్యాన్ని తక్షణమే అప్పజెప్పాలని ఆదేశించారు. 2023–24కు సంబంధించి సిఎంఆర్ బియ్యాన్ని ఏప్రిల్ 30లోగా ప్రభుత్వానికి అప్పజెప్పాలని లేనియెడల రైస్‌మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మళ్లీ బిజెపిలో చేరిన తమిళిసై..



**న్యూఢిల్లీ :** తెలంగాణ, పుదుచ్చేరిల మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మళ్లీ బిజెపిలో చేరారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, తమిళనాడు బిజెపి అధ్యక్షుడు అన్నామలై ఆధ్వర్యంలో ఆమె బిజెపి కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా తమిళిసైకి బిజెపిలోకి కిషన్ రెడ్డి, అన్నామలై సాదర స్వాగతం పలికారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయనున్న నేపథ్యంలో గవర్నర్ పదవికి రాజీనామా చేసిన ఆమె.. మళ్లీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఎంటరయ్యారు.

## అతుల్ కుమార్ అంజాన్‌కు వ్యవసాయ కార్మిక సంఘం నేతల పరామర్శ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు, అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి అతుల్‌కుమార్ అంజాన్‌ను వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, జాతీయ నాయకులు బ్రీజ్ లాల్ భారతి, సతీష్, ఫుల్‌చంద యాదవ్ తదితర బృందం మంగళవారం లక్నో ఆసుపత్రిలో పరామర్శించారు. కొంత కాలం గా అంజన్‌కుమార్ క్యాన్సర్ వ్యాధితో పోరాడుతున్నారు. మరికొంతకాలం క్యాన్సర్‌తో నేను పోరాడగలనని ఆయన ఆత్మవిశ్వాసంతో మాట్లాడినట్లు వెంకట్ చెప్పారు. ఆయన అంత అనారోగ్యంతో ఉన్నా ప్రజా ఉద్యమాల పట్ల ఆయన చూపిన ఆసక్తి స్ఫూర్తివంతంగా ఉందని వెంకట్ అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమాలు, వామపక్ష ఉద్యమాల గురించి వారిని పరామర్శించిన సందర్భంలో మాట్లాడారు. ప్రత్యేకంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న ఉద్యమాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారని, తాను గతంలో ఆ ప్రాంతాల్లో పాల్గొన్న అనుభవాలను అంజాన్‌కుమార్ గుర్తు చేసుకున్నారని వెంకట్ తెలిపారు.

## అర్హులైన వారందరికీ ఇండ్లు, ఇంటి స్థలాలు : సిపిఐ



**ప్రజాపక్షం/ఆలేరు :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను పేద ప్రజలకు అందేలా అదేవిధంగా, అర్హులైన పేదలకు ఇండ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆలేరు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలకు రూ.5లక్షలు ఇచ్చి ఇల్లు కట్టేయాలని, మహిళలకు రూ.2500 చొప్పున ఇవ్వాలని, రేషన్‌కార్డు లేని పేదవారికి రేషన్ కార్డు ఇప్పించాలని కోరారు. జాతీయ గ్రామీణ ఉపాధి పనిని ఆధార్ కార్డు అనుసంధానంగా చేయాలని పనిచేస్తున్న ప్రాంతాలలో కూలీలకు టెంట్లు వేయాలని నీళ్లు అందించాలని పనిముట్లు ఇవ్వాలని, రోజుకు 600 రూపాయలు కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో శ్రీనివాసపురం గ్రామానికి చెందిన నమిలస్వామి సిపిఐలో చేరారు. నాయకులు చౌడబోయిన పరశురాం, గొట్టిపాముల శ్రీనివాసరాజు, కిష్టయ్య పాల్గొన్నారు.

## విద్యార్థి లోకానికి స్ఫూర్తి భగత్‌సింగ్

ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** భగత్‌సింగ్ జీవితం విద్యార్థి లోకానికి స్ఫూర్తిదాయకమని, అటువంటి మహనీయుడి త్యాగాలను నేటి సమాజానికి తెలపాల్సిన బాధ్యత ప్రభుత్వాలదని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ అన్నారు. ఎఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 93వ వర్ధంతిని విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం సంఘ కార్యాలయంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ భగత్‌సింగ్ జయంతి, వర్ధంతులను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, అదే విధంగా దేశం కోసం ప్రాణాలర్పించినటువంటి భగత్‌సింగ్‌కి భారతరత్న అవార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భగత్‌సింగ్ జీవిత చరిత్ర పాఠ్యాంశాల్లో చేర్చాలన్నారు. ట్యాంకు బండ్‌పై భగత్‌సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నాయకులు కసిరెడ్డి సందీప్, వినయ్, సాయి, అనిరుద్, అశోక్, శ్రావణ్ తదితరులున్నారు.

### పాఠ్యాంశాల్లో భగత్‌సింగ్ చరిత్ర : ఎఐవైఎఫ్ డిమాండ్

**మోటకొండూర్ :** భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లంకి మహేష్, పేరబోయిన మహేందర్ డిమాండ్ చేశారు. బుధవారం మోటకొండూర్ మండల కేంద్రంలోఎఐవైఎఫ్ మండల కమిటీ సమావేశానికి హాజరై వారు మాట్లాడుతూ భగత్‌సింగ్ జీవితం భారత దేశ యువతకు స్ఫూర్తిదాయకమని, అటువంటి మహనీయుని త్యాగాలను నేటి సమాజానికి తెలపాల్సిన భాధ్యత పాలకులదేనన్నారు. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్ దేవ్‌ల వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించాలని వారు డిమాండ్ చేశారు. సిపిఐ మండల కార్యదర్శి గాదెగాని మాణిక్యం మాట్లాడుతూ దేశ ప్రధాని ప్రభుత్వ రంగ సంస్థలను, దేశ వనరులను యథేచ్ఛగా కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేశారని ఆరోపించారు. మోసాల మోడీని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని యువతకు పిలుపునిచ్చారు. భగత్ సింగ్ దేశానికి బ్రిటిష్ ముష్కరులతో పోరాడి స్వాతంత్ర్యం తీసుకువస్తే, మోడీ ప్రజలను మోసం చేయడంలో, ప్రజల మధ్య చీలికలు తేవడంలో సిద్ధహస్తుడయ్యాడన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా భీరకాయల మధు,ప్రధాన కార్యదర్శి గా బొలగాని అశోక్, మండల ఉపాధ్యక్షులుగా మారబోయిన దేవరాజు,హాజీ మస్తాన్, సహాయ కార్యదర్శిగా గట్టికొప్పుల శ్రీదర్,దామరి నర్సింహ్మా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మహ్మద్ నహీమ్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజు, జిబిలీకపల్లి పాండు, పిట్టల కర్నాకర్, రేగు పాండు, బీరకాయల పరిశురాం, కట్కూరి దయాకర్, మారబోయిన నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు

## బీడీ కార్మికులకు వేతనాలు పెంచండి

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు డిమాండ్

**ప్రజాపక్షం/కోరుట్ల :** బీడీ కార్మికులకు వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని బీడీ వర్కర్స్ ఫెడరేషర్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బోగా గోవర్దన్, సుతారి రాములు డిమాండ్ చేశారు. బీడీ వర్కర్స్ ఫెడరేషన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో బుధవారం జగిత్యాల జిల్లా కోరుట్ల డివిజన్‌లోని సి.ప్రభాకర్ భవన్‌లో మాట్లాడుతూ నిజామాబాద్ కరీంనగర్ మెదక్ ఆదిలాబాద్ వరంగల్ ఉమ్మడి జిల్లాల పరిధిలోని బీడీ పరిశ్రమలలో పనిచేస్తున్న ఏడు లక్షల మంది బీడీ కార్మికులు చాటన్ ప్యాకింగ్ నెలసరి ఉద్యోగులకు రెండు సంవత్సరాల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీడీ కమిషన్‌దార్ల గౌరవ సలహాదారులు బోగా గోవర్దన్ ఎండీ ముఖ్రం, భాను ప్రసాద్, డి. శ్రీనివాస్, అదే రంగారెడ్డి, కె వి అనసూయ , కొక్కుల శాంత, శంకర్, మల్లారెడ్డి, రవి, వెంకన్న, సాంబయ్య, నర్సయ్య, భూమయ్య, రాజేశం, లక్ష్మణ్ పరంధామం, రమేష్, లింగం బాపురపు శంకర్, లక్ష్మీ నారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు మాధ్యమంలో సింగరేణి పరీక్షలు

యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం : ఎఐటియుసి




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణిలో పని చేస్తున్న కార్మికులకు వివిధ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేందుకు పరీక్షలను తెలుగు మాధ్యమంలో నిర్వహించాలని, అందుకు గుర్తింపు సంఘం ఎఐటియుసి కృషి చేయాలని కోరుతూ సింగరేణి ఆర్జీ వన్ ఏరియాకు చెందిన కార్మికులు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా కార్మికులు గుర్తింపు సంఘం నాయకులతో మాట్లాడుతూ సింగరేణిలో గుర్తింపు సంఘం ఎఐటియుసి కృషితో యాజమాన్యం పలు ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేందుకు ఎన్నో సంవత్సరాల తరువాత వివిధ నోటిఫికేషన్లు జారీ చేసిందని, అందుకు గుర్తింపు సంఘం ఎఐటియుసికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ మాట్లాడుతూ సింగరేణిలో కార్మికుల హక్కుల కోసం, సంస్థ పరిరక్షణ కోసం ఎఐటియుసి నిరంతరం కృషి చేస్తుందన్నారు. గుర్తింపు సంఘంగా గెలిచిన తర్వాత గుర్తింపు పత్రం రాకున్నా సంస్థ అభివృద్ధి కోసం ఎఐటియుసి యాజమాన్యంతో మాట్లాడి వివిధ సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తుందన్నారు. సంస్థలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను అంతర్గత అభ్యర్థులకు ముందుగా అవకాశం ఇచ్చి భర్తీ చేయాలని కోరడం జరిగిందని, అర్హులైన వారు సంస్థలో లేకుంటే బయటి వారితో ఉద్యోగాల ను భర్తీ చేయాలని ఎఐటియుసి కోరిందన్నారు. అందుకే యాజమాన్యం అంతర్గత అభ్యర్థులతో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్‌లు జారీచేసిందన్నారు. సంస్థలో చాలామంది సీనియర్ కార్మికులు తెలుగు మాధ్యమంలో చదివిన వారు ఉన్నారని, వీరికి ఇంగ్లీష్ మాధ్యమంలో పరీక్షలు నిర్వహించడం వల్ల నష్టం జరుగుతుందన్నారు. ప్రస్తుతం సంస్థలో నూతనంగా అపాయింట్మెంట్ అయిన కార్మికులు ఆంగ్ల మాధ్యమం విద్యను అభ్యసించారని వారికి ఎలాంటి ఇబ్బంది లేదని, కానీ సీనియర్ కార్మికులు తెలుగు మాధ్యమంలో చదివినందన వారు ఇబ్బంది పడే అవకాశం ఉందని, ఈ విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి ఆంగ్లంతో పాటు తెలుగు మాధ్యమంలో పరీక్షలు నిర్వహించాలని కోరుతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎఐటియుసి ఆర్జీవన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, మిట్ట శంకర్, దొంత సాయన్న, బలుసు రవి, గుర్రం ప్రభుదాస్, బి. సమ్మయ్య, తొడుపునూరి రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

ఎఐటియుసి రాష్ట్ర ప్రధానకార్యదర్శి బాలరాజు




**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** కార్మికుల హక్కులను హరిస్తున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని ఎఐటియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసురత్నం కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. హన్మకొండ బాలసముద్రంలోని జిల్లా కార్యాలయంలో జరిగిన ఎఐటియూసి జిల్లా సమితి సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తూ 44 కోడ్‌లుగా ఉన్న కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి నరేంద్ర మోడీ కార్మిక వర్గాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలను తిప్పికొట్టాలని, కార్మికుల హక్కులను హరిస్తున్న కేంద్రంలోని బిజెపిని



రానున్న ఎన్నికలలో ఓడించాలన్నారు. సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. హనుమకొండ జిల్లా ఎఐటియుసి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వేల్పుల సారంగపాణి, జక్కు రాజుగౌడ్ ఎన్నికయ్యారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ధర్ముల రామ్మూర్తి, ఉపాధ్యక్షులుగా ఆదరి రమేష్, మాలోతు శంకర్, కర్రె లక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శిగా రామ రాజేష్‌ఖన్నా, నేదునూరి రాజమౌళి, గుంటి రాజేందర్, గడ్డం లలిత, కవ్వంపల్లి కిషన్, లంకదాసరి అశోక్‌లతో పాటు 35 మందితో జిల్లా కమిటిని ఎన్నుకున్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలివ్వకపోతే నిరవధిక సమ్మె

ఎఐటియుసి రాష్ట్రకార్యదర్శి సమ్మయ్య

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** తెలంగాణలోని ఎన్‌హెచ్ఎం స్కీంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న రావాల్సిన 3 నెలల వేతనాలు, 7 నెలల పిఆర్‌సి ఏరియర్స్ వెంటనే చెల్లించాలని లేని పక్షంలో ఈనెల 22 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య, రెండవ ఎఎన్ఎం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.రజిత, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శోభ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కాలయాపన చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతోనే కార్మికులకు వేతనాలు అందించడం లేదన్నారు. ఎన్‌హెచ్ఎం స్కీంలో దాదాపు ఆల్ క్యాడర్స్ 2వ ఏఎన్ఎంలు, ఆర్‌పిఎస్‌కె డాక్టర్లు, ఎం.ఎల్‌హెచ్‌పిలు, అర్బన్ హెల్త్ సెంటర్ సిఓ అకౌంటెంట్, ఎంఎన్‌ఏ, వాచ్‌మెన్, స్వీపర్, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్సు, సపోర్టింగ్ స్టాఫ్, డిఇవో, కాంటిజెంట్ వర్కర్స్ లాంటి దాదాపు 78 క్యాడర్లలో సుమారు 17514 మంది ఉద్యోగులు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో గత అనేక సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారని, ఈ ఉద్యోగులు నిత్యం కిందిస్థాయి ప్రజానీకానికి అందుబాటులో ఉంటూ అనేక ప్రాంతాల నుంచి విధులకు హాజరవుతుంటారన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ పేద, మధ్యతరగతికి చెందిన వారని తెలిపారు. ప్రతి నెల 1వ తేదీన జీతం అందితే తప్ప వారి కుటుంబాలు నడవని పరిస్థితి లేదన్నారు. 3నెలలుగా జీతాలు అందకపోవడంతో కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించి ప్రతి నెల ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 1వ తేదీన జీతాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని, తద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి వీలుంటుందన్నారు. 22 నుంచి నిరవధిక సమ్మెలో భాగంగా నోపే నో వర్క్ ప్రకారం విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు.

## పంటకు నష్టపరిహారాన్ని చెల్లిస్తాం

మెదక్ ఎంఎల్ఎ మైనంపల్లి రోహిత్



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** రెండు రోజుల క్రితం నిజాంపేట మండలంలో భారీగాలులతో వడగండ్ల వాన కురిసిన నేపథ్యంలో నిజాంపేట మండలంలోని జడ్చర్ల తాండాలోని ధ్వంసమైన పంటపొలాలను ఎంఎల్ఎ మైనంపల్లి రోహిత్ బుధవారం పరామర్శించారు. మొక్కజొన్న పండించిన రైతు మాట్లాడుతూ మొక్కజొన్న పంట పూర్తిగా ధ్వంసమైందని, చెడుగొట్టు వానతో మమ్మల్ని రోడ్డు పాలు చేసిందని కన్నీటిపర్యంతం అయ్యారు. స్పందించిన ఎంఎల్ఎ మైనంపల్లి రోహిత్ రైతులతో మాట్లాడారు. అధైర్య పడకండి రైతులను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటామని, నష్టపోయిన మొక్కజొన్న పంటకు ప్రభుత్వ పరంగా అందించే నష్టపరిహారాన్ని సత్వరమే అందించేలా చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. మూడు రోజుల క్రితం కరెంట్ షాక్‌తోచనిపోయిన బొక్కల్లో మల్లయ్య బాలమల్లు కుటుంబాన్ని పరామర్శించారు ప్రభుత్వం నుంచి వచ్చే సహాయాన్ని అందించే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. విద్యుత్ ఎఈ గణేష్‌తో ఫోన్‌లో మాట్లాడి బాలమల్లయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సుప్రభాత రావు, ముత్యం రెడ్డి, రమేష్ రెడ్డి, మారుతి నసీరుద్దీన్, మోహన్ రెడ్డి, మసూద్ అలీ, దేమే యాదగిరి, నాతి లక్ష్మా గౌడ్, మహేందర్ రెడ్డి, కాకి రాజయ్య, పంజా బాబు, నరేందర్, వెంకటేష్ గౌడ్, జెల్లా లక్ష్మణ్, రవీందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సులేమాన్, బోయిని చంద్రం, శ్రీకాంత్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## లింగంపల్లిలో సిఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం

పాల్గొన్న మంత్రి రాజనర్సింహ

ప్రత్యేక ఆకర్షణగా సినీ హీరో రామ్



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** లింగంపల్లి సిటీ సెంటర్లో సిఎంఆర్ షాపింగ్ మాల్ తమ 31వ బ్రాంచిని బుధవారం ప్రారంభించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖమంత్రి దామోదర రాజనరసింహ, సినీ హీరో రామ్, ఎంబిసి కార్పొరేషన్ చైర్మన్, తెలంగాణ పిసిసి జనరల్ సెక్రటరీ జైపాల్ రెడ్డి, పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కట్టా శ్రీనివాస్‌గౌడ్, సిఎంఆర్ ఫౌండర్, చైర్మన్ మావూరి వెంకటరమణ, సిఎంఆర్ షాపింగ్ మాల్ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలజీలు హాజరై షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు. అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ సిఎంఆర్ షాపింగ్ మాల్‌లో నూతన డిజైన్లతో కూడిన వస్త్రాలు, బంగారు ఆభరణాలు ఆకట్టుకుంటున్నాయన్నారు. వస్త్రా, భరణాలు ధరలు అన్ని తరగతుల ప్రజలకు అందుబాటులో ఉంచారని తెలిపారు. తదుపరి సినీ హీరో రామ్ మాట్లాడుతూ సిఎంఆర్ షాపింగ్ మాల్ గత 40 సంవత్సరాలుగా వస్త్ర వ్యాపార రంగంలో రాణింస్తుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా క్వాలిటీ, డిజైన్లకు ప్రత్యేకంగా నిలుస్తూ తెలుగు రాష్ట్రాలలో అగ్రగామిగా నిలిచిందని కొనియాడారు. అనంతరం సిఎంఆర్ ఫౌండర్, చైర్మేన్ మావూరి వెంకటరమణ, సిఎంఆర్ ఎండి మావూరి మోహన్ బాలజీ మాట్లాడుతూ తమ సంస్థను గత 40 సంవత్సరాలుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు అదరిస్తూ వస్తున్నారని, సిఎంఆర్ 31వ బ్రాంచి షోరూమ్‌ను లింగంపల్లి సర్కిల్‌లో ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. సిఎంఆర్ అంటే ఫ్యామిలీ అందరికీనచ్చే విధంగా అన్నిరకాల వెరైటీలు, డిజైన్లు లభిస్తున్నాయన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కస్టమర్లకు నచ్చే విధంగా నూతన డిజైన్లతో కూడిన వస్త్రాలను, ఆభరణాలను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో లాండ్ లార్డ్ నదీం ఉల్లా ఖాన్, వజ్రం కన్స్‌ట్రక్షన్స్ చైర్మన్ కోల అంజనేయులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జె.జైపాల్ తదితరులు పాల్గొన్నారు.







## సమగ్ర విద్యలో క్రీడలది ముఖ్యపాత్ర : జగన్‌మోహన్




**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** ఎస్సార్ విశ్వవిద్యాలయంలో బుధవారం 22వ వార్షిక క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్సార్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో విధ్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొని వారి క్రీడా నైపుణ్యాన్ని, జట్టు స్ఫూర్తిని ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు అర్శనపల్లి జగన్ మోహన్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్సార్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జగన్ మోహన్ రావు మాట్లాడుతూ సమగ్ర విద్యలో క్రీడలు ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎస్సార్ విశ్వవిద్యాలయం రిజిష్ట్రార్ డాక్టర్ ఆర్. అర్చనా రెడ్డి, విద్యార్థి సంక్షేమ శాఖ డీన్ డాక్టర్ ఏవీవీ సుధాకర్, క్రీడా విభాగం కన్వీనర్ డాక్టర్ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

## ఎన్నికల సామాగ్రి పంపిణీ, రిసెప్షన్ కేంద్రాల తనిఖీ



**ప్రజాపక్షం/దేవరకొండ :** దేవరకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న డిఆర్సి, రిసెప్షన్ కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ హరిచందన తనిఖీ చేశారు. కేంద్రంలో స్ట్రాంగ్ రూమ్ భద్రత, వాహనాల పార్కింగ్ సామర్థ్యం, తదితర వివరాలు తెలుసుకున్నారు. కొండభీమనపల్లి పరిధిలో ఉన్న అవుట్ డోర్ స్టేడియాన్ని పరిశీలించారు. డిండి రోడ్‌లో ఉన్న గిరిజన మహిళ డిగ్రీ కళాశాల హాస్టల్ క్యాంపస్‌ను తనిఖీ చేయడమేకాక, హాస్టల్‌లో సౌకర్యాలు, లైబ్రరీ, వంటశాల తదితర వాటిని పరిశీలించారు. హాస్టల్ క్యాంపస్‌ను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్డీవో శ్రీరాములు, తహసీల్దార్ సంతోష్‌కిరణ్, మునిసిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి కలెక్టర్ వెంట ఉన్నారు.

## ఇసిల నియామకం సరైనదే

**న్యూఢిల్లీ:** భారత ప్రధాన న్యాయమూర్తిని సెలక్షన్ కమిటీ నుండి మినహాయించే ఎలక్షన్ కమిషన్ 2023 చట్టం ప్రకారం ఇద్దరు కొత్త ఎన్నికల కమిషనర్ల (ఇసిలు) నియామకాన్ని కేంద్రం బుధవారం సుప్రీంకోర్టులో సమర్థించుకుంది. న్యాయ వ్యవస్థ నుంచి ఒక సభ్యుడి ఉనికి మాత్రమే భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) స్వతంత్రత ఉద్భవించదని వ్యాఖ్యానించింది. ఇసిఐకి ఇద్దరు కమిషనర్లను హడావుడిగా నియమించారని, కమిషన్‌లో న్యాయమూర్తికి చోటు లేకుం డా చేస్తున్న 2023 చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్‌పై అఫిడవిట్‌ను దాఖలు చేసిన కేంద్ర ప్రభుత్వం, ఆ మరుసటి రోజే ఇద్దరు ఇసిలను ఏ విధంగా నియమించారని పిటిషనర్ చేసిన వాదనను కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ తిరస్కరించింది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర కమిషనర్ల నియామకం, సేవా నిబంధనలు, కార్యాలయ నిబంధనల చట్టం, 2023ని సవాలు చేస్తూ కాంగ్రెస్ నాయకురాలు జయా ఠాకూర్, అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్రం స్పందించింది. ఎలక్షన్ కమిషన్ స్వతంత్రత ఒక న్యాయ సభ్యుడి వల్ల ఏర్పడదని తన అఫిడవిట్‌లో వ్యాఖ్యానించింది. సంభావ్య నియామకాల జాబితాను ప్రతిపక్షాలతో పంచుకోవడం లేదన్న వాదనను కూడా కేంద్రం ఖండించింది. షార్ట్‌లిస్ట్ చేసిన వ్యక్తుల పేర్లను 2024 మార్చి 13న లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు అధీర్ రంజన్ చౌదరికి అందచేసినట్టు కేంద్రం తన అఫిడవిట్‌లో పేర్కొంది. ఆయన కూడా సభ్యుడిగా ఉన్న సెర్చ్ కమిటీ సిఫార్సు కోసం ఆరు పేర్లను షార్ట్‌లిస్ట్ చేసినట్టు వివరించింది. కుదించిన జాబితాలోని పేర్లను లోక్‌సభలోని ఏకైక అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ నాయకుడితో పంచుకున్నామని వివరించింది. ఆ జాబితాను బహిర్గతం చేయాలన్న డిమాండ్‌లో అర్థం లేదని వాదించింది. పిటిషన్‌లో ఎక్కడా కమిషనర్లుగా నియమితులైన వారి విద్యార్హతలను ప్రశ్నించలేదని, కమిషనర్ హోదాలో పని చేయగడానికి జాబితాలో పేర్కొన్న వ్యక్తులకు ఉన్న అర్హత, సామర్థ్యం వంటి అంశాలపై అభ్యంతరాలు కూడా లేవనెత్తలేదని కేంద్ర ప్రభుత్వం తన అఫిడవిట్‌లో పేర్కొంది. అభ్యర్థులకు రాజ్యాంగబద్ధమైన పదవిని నిర్వహించడానికి గల అర్హతలపై ఏ విధమైన ప్రశ్నలు లేనప్పుడు, సదరు అభ్యర్థులు పదవికి అనర్హులు ఎలా అవుతారని ప్రశ్నించింది. న్యాయ వ్యవస్థ నుంచి సభ్యులు ఎవరూ లేకపోవడంతో, ఎంపిక కమిటీలు పక్షపాతంతో వ్యవహరిస్తాయన్న వాదన కూడా సరైనది కాదని తెలిపింది. ఇలాంటి నియామకాలన్నీ పూర్తిగా ప్రభుత్వపరంగానే జరుగుతాయని గుర్తుచేసింది. కాగా, కొత్త కమిషన్ల నియామకంపై స్టేని ఇవ్వడానికి సుప్రీం కోర్టు గత వారం నిరాకరించింది.

## మూలస్తంభాలపై దాడి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలనే ఉద్దేశంతోనే ‘ఇండియా’ కూటమి ఏర్పడిందని అన్నారు. ఈ కూటమిలోని పార్టీలు ప్రజల్లో లోతుగా పాతుకుపోయాయని అన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన ప్రజాస్వామ్యం, ప్రజల మానవ, పౌరహక్కుల హక్కులను పరిరక్షించి, మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, అన్నింటికంటే ముఖ్యమైనది రాజ్యాంగం కల్పించిన సమానత్వం, న్యాయాన్ని అందించడం అనే స్పష్టమైన ఉద్దేశ్యంతో ‘ఇండియా’ కూటమి ఆవిర్భవించిందని ఏచూరి పేర్కొన్నారు. బీహార్‌లో జెడియు, ఉత్తరప్రదేశ్ లో ఆర్ఎల్‌డి వంటి పార్టీలు నిష్క్రమించడం, సీట్ల పంపకాల ఒప్పందాల్లో జాప్యం వంటి అంశాలను కూటమికి ఎదురుదెబ్బగా భావిస్తున్నామని అన్నారు. అయితే, సీట్ల పంపకాలపై చర్చలు సానుకూల దిశలో జరుగుతున్నాయని చెప్పారు. ఈ సంప్రదింపులు త్వరలోనే ముగుస్తాయని ఏచూరి అన్నారు. సీట్ల సర్దుబాట్లు, పొత్తులు వంటిని ఎన్నికల రాజకీయాలని అన్నారు. పార్టీలు కలవడం లేదా విడిపోవడం అనేది ప్రధానం కాదని ఏచూరి చెప్పారు. ఎవరు వస్తున్నారు... ఎవరు వెళుతున్నారన్నది ప్రధానం కాదని, ఏ సూత్రాలపై ప్రజలు చేరుతున్నారన్నదే కీలకమని చెప్పారు. ప్రజల ముందు ఎన్నో అంశాలు ఉన్నాయని అన్నారు. ప్రత్యేకించిన జీవనోపాధి అత్యంత ముఖ్యమైన సమస్య అన్నారు. ‘ప్రజలను వారి జీవన ప్రమాణాలే పట్టి పీడిస్తున్నాయి. ఇదే వారి ప్రధాన సమస్య. గత పదేళ్లుగా ఉపాధి కల్పన విషయంలో ఎలాంటి మెరుగుదల లేదు. ఈ విషయాన్ని గణాంకాలు కూడా స్పష్టం చేస్తున్నాయి’ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థతో పాటు ప్రజల జీవితాలు కూడా నాశనమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి సమస్యతో అల్లాడుతున్న ప్రజలకు సమాధానం చెప్పలేక, మతపరమైన అంశాలను బిజెపి తెరపకి తెస్తున్నదని ఏచూరి ఆరోపించారు. మతతత్వాన్ని, విద్వేషాన్ని వ్యాప్తి చేస్తూ, విష ప్రచారాలతో ఓట్లు సంటపాదించుకునే దిశగా బిజెపి పావులు కదుపుతున్నదని విమర్శింరు. కానీ, ఆ ఎత్తుగడలు పని చేయబోవని ఆయన అన్నారు. ఈ విషయం బిజెపికి కూడా అర్థమైందని, అందుకే ఆ పార్టీలో నైరాశ్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నదని చెప్పారు. రాష్ట్రాల వారీగా పార్టీలను చీల్చి, ఇడి, సిబిఐ వంటి ఏజెన్సీలను దుర్వినియోగం చేసి, రాజకీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి బిజెపి ప్రయత్నిస్తున్నదని ధ్వజమెత్తారు. నిజంగానే 370 లేదా 400 స్థానాలను సాధిస్తామన్న నమ్మకం ఉంటే బిజెపి ఎందుకు అంత నిరాశ చెందుతున్నదని ఏచూరి ప్రశ్నించారు. ప్రతిపక్షం బలంగా ఉన్న ప్రతి రాష్ట్రంలోనూ ఆయా పార్టీలను చీల్చాలన్న ఆందోళన ఎందుకని నిలదీశారు. వివిధ పార్టీల నాయకులను బెదిరించడం, పార్టీలోకి వచ్చేలా చేయడం వంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్నదని బిజెపిని ఆయన దుయ్యబట్టారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు విస్పష్టమైన తీర్పు చెప్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com